॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ పంచదశోఽ ధ్యాయః - పురుషోత్తమయోగః

# (పదునైదవ అధ్యాయము - పురుషోత్తమయోగము)

భగవద్గీతలో ఉన్న అత్యంత చిన్న అధ్యాయాల్లో ఈ పదిహేనవ అధ్యాయం ఒకటి. ఇందులో 20 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. కాని చాలా ముఖ్యమైన అధ్యాయం. ఈ అధ్యాయాన్ని భోజనం చేసేముందు పఠించే ప్రార్థన శ్లోకాలుగా భావిస్తారు కాని, ఇందులో వేదాంతబోధ ఉండటంవల్ల కూడా ఇది ముఖ్యమైనది.

ఈ అధ్యాయము మూడవషట్కములోకి వస్తుంది కాబట్టి, ఈ షట్కములో చర్చిస్తున్న మూడు అంశాలనూ ఈ అధ్యాయములో చూడగలము. అవి జ్ఞానయోగః, ఐక్యమ్, సద్గుణః. జ్ఞానయోగాన్ని సాధనగాను, జీవాత్మ పరమాత్మ ఐక్యం విషయంగాను, సద్గుణాలను విలువలయొక్క ప్రాముఖ్యతగాను చూస్తాము. ఈ మూడు అంశాలను ఇందులో చూస్తాము కాబట్టి ఇది చాలా ముఖ్యమైనది.

ఈ అధ్యాయము పేరు పురుషోత్తమయోగము. ఈ అధ్యాయము **పురుషోత్తమ ప్రాప్తి యోగము** అని కూడా ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ పురుషోత్తమ అంటే నిర్గుణచైతన్యము. పురుషోత్తమ పదం సగుణ ఆకారంలో ఉన్న విష్ణువు, కృష్ణుడు, ఈశ్వరుడు, శివులను సూచించదు. పురుషోత్తమ అంటే నిర్గుణబ్రహ్మ లేదా నిర్గుణచైతన్యము. ఈ అర్థాన్ని, ఈ అధ్యాయము చివర్లో సాక్షాత్తూ కృష్ణపరమాత్మే ఇస్తాడు. అందువల్ల ఎటువంటి అయోమయము ఉండే ఆస్కారం లేదు. పురుషోత్తముడు అంటే గుణాలులేని చైతన్యము; యోగము అంటే ఈ సందర్భంలో విషయం; ఈ రెండు కలిపితే పురుషోత్తమయోగము అంటే నిర్గుణబ్రహ్మ విషయము. ఇదీ ఈ అధ్యాయముయొక్క ప్రధానాంశము. ఈ నేపథ్యంతో అధ్యాయములోకి అడుగుపెడదాము.

### 1. సంసారవర్ణనమ్ - శ్లోకాలు 1-3 మొదటి పాదం: ఉపోద్ఘాతం

ఈ అధ్యాయము పేరులోనే ఉంది, దీని అంశము నిర్గుణబ్రహ్మ అని. అందువల్ల ఈ అధ్యాయాన్ని అధ్యయనం చేస్తే నిర్గుణబ్రహ్మజ్ఞానము పొందుతాము. కాని నేను నిర్గుణబ్రహ్మజ్ఞానము పొందితే నాకు కలిగే ఫలమేమిటి? ఎందుకంటే ప్రయోజనం లేని పనిని మందబుద్ధి ఉన్నవ్యక్తి కూడా చెయ్యడు.

మనం నేర్చుకునే ఈ లౌకికవిద్యలు ఉద్యోగం సంపాదించుకోవటంకోసం. ఉద్యోగం ఎందుకంటే అది మనకు జీవనాధారం కాబట్టి. ఇప్పుడు ఈ బ్రహ్మజ్ఞానము ఎందుకంటే మోక్షం పొందటానికి. అందువల్ల బ్రహ్మజ్ఞానము మోక్షసాధనము.

మోక్షమంటే ఏమిటి? మోక్షం సంసారంనుంచి విముక్తి కలిగిస్తుంది. సంసారనివృత్తి అంటారు. సంసారం అంటే ఏమిటి? మనిషి నిరంతరం ఎదుర్కొనే అనేక సమస్యలు, వాటిని తప్పించుకోవటానికి అతను పెట్టే - పరుగులను సంసారం అంటారు. ఒకవ్యక్తి స్వీయజీవితచరిత్రని ఇంగ్లీషులో ఆటోబయోగ్రఫీ అంటాము. దాన్ని

తమాషాగా ఆటోయొక్క బయోగ్రఫీగా అభివర్ణించవచ్చు. ఆటో చేసేపని ఏమిటి? నిరంతరం పరుగులు తీస్తూ ఉంటుంది. మనిషి చేసే పని కూడా అంతే. అతని జీవితంలో క్షణం విశ్రాంతి లేకుండా నిరంతరం పరుగులు తీస్తూనే ఉంటాడు. పైగా మనిషి ప్రయాణం ఈ జన్మతో ముగియదు. జన్మజన్మలకూ కొనసాగుతుంది. ఇది ఒక అంతులేని కథ. అందువల్ల సంసారం అంటే నిరంతరం సమస్యలను ఎదుర్కోవటం; వాటికి పరిష్కారమార్గాలు వెతుక్కోవటం. ఈ సంసారంనుంచి పొందే విడుదలను మోక్షం అంటారు. బ్రహ్మజ్ఞానము ఆ మోక్షాన్ని కలుగజేస్తుంది. బ్రహ్మజ్ఞానము మోక్షాన్ని కలుగజేసే అనేక మార్గాల్లో ఒకటికాదు, అది ఒక్కటే మార్గము అని ఘోషిస్తుంది శాస్త్రము. వేరే మార్గాలను ప్రయత్నిస్తే, అవి తాత్కాలికంగా ఉపశమనాన్ని కలుగజేస్తాయేమో కాని, రోగాన్ని శాశ్వతంగా నయం చెయ్యవు. అందువల్ల బ్రహ్మజ్ఞానం మోక్షాన్ని కలుగజేస్తుంది; మోక్షం సంసారంనుంచి విముక్తి కలుగజేస్తుంది.

సంసారం ఒక సమస్య అనుకుంటే కదా మోక్షం కోరేది? చాలామందికి సంసారం ఒక సమస్యగా అనిపించదు. ఒకవేళ అనిపించినా నవ్వుతూ నేను ఒక మహాసంసారిని అంటారు. అలాంటివారు దాన్నుంచి బయటపడటానికి ఏమాత్రం ప్రయత్నం చెయ్యాలనుకోరు. సంసారాన్ని ప్రేమించేవ్యక్తి మోక్షాన్ని కోరడు; మోక్షాన్ని కోరనివ్యక్తి బ్రహ్మజ్ఞానము అనవసరం అనుకుంటాడు. అందువల్ల మోక్షఇచ్ఛ కలగాలంటే సంసారదోషదర్శనము చెయ్యాలి. బ్రహ్మజ్ఞానంమీద ఇచ్ఛ కలగాలంటే మోక్షఇచ్ఛ కలగాలి. బ్రహ్మజ్ఞానంమీద ఇచ్ఛ కలగాలంటే, గీతాబోధ వదలకుండా వినాలి. ఒక సమస్య తొలగాలంటే ముందు ఆ సమస్య ఏమిటో అర్థం కావాలి. రోగమేమిటో తెలియకపోతే, దానికి సరియైన మందు ఇవ్వలేడు వైద్యుడు. ఇక్కడ మనరోగం పేరు భవరోగం. భవరోగం అంటే సంసారరోగం.

శారీరక ఆరోగ్యానికి యాభయ్యోపడిలో పడ్డాక, జనరల్ హెల్త్ చెకప్ చెయ్యాలి అంటారు. ఎందుకు? ఏదైనా అనారోగ్యం వస్తే లేదా రాబోతుంటే, దానిని నివారణ చెయ్యవచ్చు. అలా మన ఆధ్యాత్మిక ఆరోగ్యానికి కూడా హెల్త్ చెకప్ ఉంది. భవరోగమనే అనారోగ్యం ఉందో లేదో దానిద్వారా తెలుసుకోవచ్చు. ఒకవేళ ఉంటే దానికి మందు బ్రహ్మజ్ఞానవిద్య. అందువల్ల కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో తన బోధను సంసారవర్ణనతో మొదలుపెడుతున్నాడు.

సంసారం అంటే నిరంతరం మారుతూ ఉన్న జీవితం. పుట్టినప్పటినుంచి శరీరం అనేక వికారాలకు లోనవుతుంది. జరా,వ్యాధి,మరణ,దుఃఖాలను కలుగజేస్తుంది. ఈ విషయాన్ని మొదటి రెండు శ్లోకాల్లోనూ, మూడవశ్లోకంలో మొదటిపాదం వరకూ వివరిస్తాడు కృష్ణపరమాత్మ. ఈ అధ్యాయంలో అర్జునుడు ప్రశ్న వెయ్యడు; అందువల్ల కృష్ణపరమాత్మే స్వయంగా మరికొంత బోధ చెయ్యటానికి ముందుకువస్తాడు.

సంసారం అంటే మారుతున్న మన జీవితం మాత్రమే కాదు, మారుతున్న ప్రపంచం; మారుతున్న పరిస్థితులు కూడా. ఈ సంసారాన్ని అశ్వత్థవృక్షంతో పోలుస్తున్నాడు కృష్ణపరమాత్మ. అశ్వత్థవృక్షము అంటే రావిచెట్టు; వటవృక్షము అంటే మర్రిచెట్టు. మర్రిచెట్టుకు కూడా ఊడలు క్రిందికి వ్రేలాడుతాయి. ఇక్కడ చూస్తున్నది రావిచెట్టు. ఇదికూడా కృష్ణపరమాత్మ స్వంతంగా ఇచ్చిన ఉదాహరణ కాదు. గీతాబోధ ఉపనిషత్తులసారం అని

చూస్తూనే ఉన్నాము; అందులోనూ కృష్ణపరమాత్మకు కఠోపనిషత్తు అంటే మమకారం ఎక్కువ ఉన్నట్టు ఉంది; ఆ ఉపనిషత్తులోంచి చాలా మంత్రాలను యథాతథంగానో, వాటి సారాన్నో గ్రహించాడు. ఇక్కడ కూడా కఠోపనిషత్తులోని మంత్రంయొక్క సారాన్ని గ్రహించాడు.

**ఊర్ధ్వమూలోఽవాక్శాఖః ఏషోఽశ్వత్థః సనాతనః, తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే**

**తస్మిం లోకాః శ్రితాః సర్వే తదు నాత్యేతి కశ్చన। ఏతద్వై తత్॥** – కఠ 2.3.1

ఈ మంత్రంలో ఒక భాగాన్ని మాత్రం తీసుకుని, ఈ మారుతున్న జగత్తును, జీవితాన్ని అశ్వత్థవృక్షంతో ఎలా పోల్చవచ్చో చూపిస్తున్నాడు ఈ మొదటి మంత్రాల్లో.

శంకరాచార్యులవారు తన కఠోపనిషత్తుభాష్యంలోను, భగవద్గీతభాష్యంలోను ఈ పోలికను చాలా వివరంగా విశ్లేషించారు. సంసారానికీ, అశ్వత్థవృక్షానికీ మధ్య ఉన్న అనేకానేక పోలికలను వివరించారు. రెండు వస్తువులను, ఒకదానితో ఒకటి పోల్చామంటే, వాటిమధ్య కనీసం ఒక సమానధర్మమన్నా ఉండాలి. ఈ సమానధర్మాన్ని **సాధర్మ్యమ్** అంటారు సంస్కృతంలో. ఒకవ్యక్తిని ములక్కాడలా ఉన్నాడు అంటాము. అంటే దాని అర్థం అతన్ని ములక్కాడలా తినవచ్చని కాదు; ములక్కాడలా సన్నగా, పొడవుగా ఉన్నాడని. అటువంటిది ఒకటికన్నా ఎక్కువ పోలికలుంటే, ఆ ఉదాహరణను గొప్ప ఉదాహరణ అనవచ్చు.

శంకరాచార్యులవారు అనేకానేక పోలికలు చెప్పారు; ఆయన విజ్ఞత ఎంతగొప్పదో తెలుసుకోవటానికైనా వాటిలో కొన్ని పోలికలను చూద్దాము.

**సంసారానికి, అశ్వత్థవృక్షానికి మధ్య ఉన్న సమాన అంశాలు**

ఎ) **మహత్త్వమ్** – పెద్దది. రెండూ చాలా పెద్దవి. విశ్వం చాలా పెద్దది; అశ్వత్థవృక్షం కూడా చాలాపెద్దది. మొదటి పోలిక **మహత్త్వమ్**.

బి) **ఆద్యంతరహితత్వమ్** – ఆది అంతాలు లేనిది. సంసారానికి, ఈ వృక్షానికి కూడా ఆది అంతాలు లేవు. మనుష్యులు ఎప్పుడూ అడిగే ప్రాథమిక ప్రశ్నల్లో ఒకటి ఈ సృష్టి మొదట ఎప్పుడు పుట్టింది? నేనెందుకు పుట్టాను అని ఎవరైనా అడిగితే నన్ను సతాయించటానికి అని నవ్వేస్తాము కాని అదికాదు దానికి జవాబు అని మనకూ తెలుసు.

నేనెందుకు పుట్టాను ప్రశ్నకు అసలైన జవాబు – నువ్వు చేసుకున్న కర్మవల్ల పుట్టావు. నేను కర్మ ఎప్పుడు చేశాను? నీ పూర్వజన్మ సుకృతంవల్ల పుట్టావు. అక్కడ కూడా ప్రశ్న ఆగదు. పూర్వజన్మవల్ల ఈ జన్మ వచ్చిందనుకుందాము; కాని మొట్టమొదటి జన్మకు ఏ పూర్వజన్మ ఉంది? శాస్త్రం ప్రకారం సృష్టి ఒక సరళరేఖలా సాగలేదు. సృష్టి ఒక వృత్తంలా సాగుతుంది. అందువల్ల ఇది మొదటి జన్మ అని కానీ, ఇది మొదటి సృష్టి అని కానీ చెప్పలేము. ప్రతిసృష్టికీ, ప్రతిజన్మకీ దానిముందు సృష్టి, దానిముందు జన్మ ఉంటాయి. వృత్తాన్ని కూడా ఒకచోట మొదలుపెట్టి గీస్తాము కదా? ఆ ప్రశ్న కూడా సరిపోదు. ఒక వృత్తం గీసేశాక, ఈ వృత్తానికి మొదలు ఏదో చూపించండి అంటే చూపించలేము.

అందువల్ల ఇది మొదటిసృష్టి, ఇది మొదటిజన్మ అని చెప్పలేము. ఇది ఒక అనంతవృత్తం; కర్మవల్ల జన్మ; జన్మవల్ల కర్మ కొనసాగుతూనే ఉంటాయి. వృక్షం విషయంలో కూడా అంతే. చెట్టు ముందా, విత్తు ముందా? ఈ ప్రశ్నకు మన దగ్గర జవాబు లేదు. చెట్టు ఎలా వచ్చింది? విత్తనంనుంచి వచ్చింది; విత్తనం ఎలా వచ్చింది? అంతకుముందు చెట్టునుంచి వచ్చింది. అంతకుముందు చెట్టు ఎలా వచ్చింది? దానిముందు విత్తనంనుంచి వచ్చింది. కాబట్టి వృత్తంగా కొనసాగే దానికి రెండవపోలిక **ఆద్యంతరహితత్వమ్**.

సి) **అనిర్వచనీయత్వమ్** – నిర్వచించలేనిది. తార్కికంగా నిరూపించలేము. ఒక వస్తువు కారణమా, కార్యమా అంటే దాన్ని తార్కికంగా నిరూపించలేము. ఇందాక చూసినట్టుగా ఒక వస్తువును కార్యంగానూ వర్ణించలేము; కారణంగానూ వర్ణించలేము. ఎందుకంటే ఒకకోణంలోంచి చూస్తే ఒక వస్తువు కారణం; ఇంకో కోణంలోంచి చూస్తే అదే వస్తువు కార్యం అవుతాయి. చెట్టుపరంగా చూస్తే చెట్టు కారణం; విత్తనం దాన్నుంచి వచ్చిన కార్యం. అదే విత్తనం పరంగా చూస్తే విత్తనం కారణం; చెట్టు కార్యం. 'ఇవాళ' కారణమా, కార్యమా? 'నిన్న' కోణంలో చూస్తే, నిన్న కారణం, ఇవాళ కార్యం. 'రేపు' కోణంలో చూస్తే ఇవాళ కారణం, రేపు కార్యం. ఒకేవ్యక్తి ఒకకోణంనుంచి చూస్తే తండ్రి, ఇంకోకోణంలో చూస్తే కొడుకు.

మన జీవితాన్ని ఏది నిర్దేశిస్తున్నది? ఫ్రీవిల్లా, విధా? జరిగిపోయిన సంఘటనల ఆధారంగా చూస్తే విధి కారణంగా అనిపిస్తుంది. అదే రాబోయే భవిష్యత్తు పరంగా చూస్తే ఫ్రీవిల్ కారణంగా అనిపిస్తుంది. అందువల్ల ఏ విషయంలోనూ ఇది కారణం, ఇది కార్యం అని నూటికి నూరుపాళ్ళు చెప్పలేము. ఇతను తండ్రా, పుత్రుడా అంటే ఏదో ఒకటి చెప్పలేము. స్వామీజీ గురువా, శిష్యులా అంటే ఆయన శిష్యగణానికి ఆయన గురువు; తన గురువుకు ఆయన శిష్యులు. అందువల్ల దేన్నీ ఇది కారణం, ఇది కార్యం అని తార్కికంగా గిరిగీసి చూపించలేము. సృష్టిలోని లోతులు కొలిచినకొద్దీ అది అంతుపట్టకుండా పోతుంది. మూడవపోలిక – **అనిర్వచనీయత్వమ్**.

డి) **మూలత్వమ్** – చెట్టుకి వేరు ఉంటుంది. కింద వేరు అనే మూలం లేకుండా చెట్టు ఉండనే ఉండదు. కాని తమాషా ఏమిటంటే, చెట్టు కనబడుతుంది కాని భూమిలోపల ఉన్న వేరు కనబడదు. అంటే చెట్టు ప్రమాణగోచరం కాని వేరు కాదు. కాని వేరు కనబడకపోయినా, వేరు ఉందని తెలుసు. ఎందుకంటే వేరు లేకుండా, చెట్టుకు ఉనికి లేదని మనకు తెలుసు.

ఈ సూత్రాన్ని జగత్తుకు అన్వయిస్తే, జగత్తుకు కూడా ఒక మూలం ఉండి వుండాలి. ఆ మూలాన్నే **భగవంతుడు** లేదా ఈశ్వరుడు అంటారు. కాని నాకు ఆ మూలం అయిన భగవంతుడు కనబడటంలేదే? దానికి జవాబు చెప్పకుండా ఎదురు ప్రశ్నించాలి. చెట్టుకు మూలమైన వేరు కూడా కనబడటం లేదే? చెట్టుకి వేరు కనబడకపోయినా, ఉందని ఎలా నమ్ముతామో, అలాగే జగత్తనే చెట్టుకు, భగవంతుడనే మూలం లేకుండా ఉనికి లేదని అర్థం చేసుకోవాలి. భగవంతుడు విశ్వాధారం. విష్ణుసహస్రనామాల్లో ఒక నామం అధోక్షజః. దాని అర్థం ప్రత్యక్షప్రమాణ అగోచరం అని. అక్షః అంటే ఇంద్రియాలు; జః అంటే పుట్టిన; అక్షజః అంటే ఇంద్రియాలద్వారా పుట్టిన జ్ఞానం; అధః అంటే దానికి అందని. అధోక్షజః అంటే ఇంద్రియాలద్వారా పుట్టే జ్ఞానం కాదని అర్థం. ఆ విధంగా చెట్టుకు కనబడని మూలం వేరు; జగత్తుకు కనబడని మూలం భగవంతుడు. నాలుగవ పోలిక – **మూలత్వమ్**.

ఇ) **శాఖాత్వమ్** – ఒక పెద్దవృక్షానికి అనేక శాఖలు లేదా కొమ్మలు ఉంటాయి. కొన్ని శాఖలు చాలా కిందికి ఉంటాయి; కొన్ని శాఖలు మధ్యభాగంలో ఉంటాయి; మరికొన్ని శాఖలు ఆకాశంలోకి విస్తరించి ఉంటాయి. అదే విధంగా జగత్తుకు శాఖలు లోకాలు. ఈ పద్నాలుగు లోకాలను తీసుకుంటే భూలోకం మధ్యలో ఉంది; భువర్లోక సువర్లోకాలు ఊర్ధ్వముఖంగా ఉంటే, పాతాళలోకాలు అధోముఖంగా ఉన్నాయి. ఐదవ పోలిక – **శాఖాత్వమ్**.

ఎఫ్) **పర్ణత్వమ్** – పర్ణాలు అంటే ఆకులు. వృక్షానికి అనేక ఆకులు ఉంటాయి. ఒక్కో చెట్టుకు ఆకులు ఎంత దట్టంగా ఉంటాయంటే ఆ చెట్టుయొక్క కాండం, కొమ్మలు కనబడకుండా ఆకులు కప్పేస్తాయి. అదే విధంగా జగత్తనే వృక్షానికి వేదాల్లోని కర్మకాండ లేదా కర్మ అనే ఆకులు ఉన్నాయి.

కర్మకాండను చెట్టుయొక్క ఆకులతో ఎలా పోలుస్తారు? ఒక వృక్షం పెరిగి పెద్దదవటానికి ఆకులు తోడ్పడతాయి. నిజానికి ఆకులవల్లనే చెట్టు పదికాలాలపాటు ఉంటుంది. ఆకులకున్న ఆకుపచ్చరంగు, దానికున్న క్లోరోఫిల్‌వల్ల వచ్చిందనీ; అది కిరణజన్య సంయోగక్రియ అనే పద్ధతి ద్వారా ఆహారాన్ని వండుతుందనీ, ఆ ఆహారంవల్లనే చెట్టు పదికాలాలపాటు ఉంటుందనీ చిన్నప్పటి పాఠాల్లో నేర్చుకున్నాము. దీన్ని సంస్కృతంలో **ఛాదనాత్ ఛందాంసి** అంటారు. వేదాల్లోని కర్మకాండను ఆకులతో పోలుస్తారు.

కర్మకాండ జగత్తనే వృక్షాన్ని ఎలా పెంచిపోషిస్తుంది? కర్మకాండ అనేకరకాల కర్మల గురించి చెబుతుంది. ఫలానా కర్మ చేస్తే పుత్రులు పుడతారు అంటుంది; ఫలానా కర్మ చేస్తే అంతులేని ధనం వస్తుంది అంటుంది; ఫలానా కర్మ చేస్తే స్వర్గలోకానికి వెళతారు అంటుంది. ఆ విధంగా అనేక రకాలైన ప్రలోభాలు చూపిస్తుంది. సహజంగానే ఎవరైనా కర్మకాండకు ఆకర్షితులవుతారు. దీనితో పోల్చిచూస్తే జ్ఞానకాండ ఆకర్షణీయంగా ఉండదు. మాండూక్యోపనిషత్తు చాలా నిరాసక్తంగా ఉంటుంది దీనితో పోలిస్తే. ఆ విధంగా కర్మకాండ ఏ కోరిక తీర్చుకోవాలనుకుంటే, దానికి ఒక తక్షణమార్గాన్ని చూపిస్తుంది.

ఆ విధంగా మనిషి అనేక కర్మలు చేస్తాడు. సహజంగా అతను చేసిన అనేక కర్మలు అనేక కర్మఫలాలను ప్రసాదిస్తాయి. కర్మఫలాలంటే ఏమిటి? పుణ్యపాపాలు. పుణ్యపాపాలు పెరిగినకొద్దీ పునరపి జననం, పునరపి మరణాలను కలుగజేస్తాయి. ఆ విధంగా కర్మకాండ సంసారమనే వృత్తంలో కొనసాగటానికి తోడ్పడుతుంది.

**ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః ।**
**జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥** – 14.18

జ్ఞానకాండ సంసారవృక్షానికి ముగింపు పలికితే, కర్మకాండ సంసారవృక్షాన్ని పెంచి పోషిస్తుంది. ఆరవ కారణం – **పర్ణత్వమ్**.

జి) **ఫలత్వమ్** – చాలా వృక్షాలకు ఫలాలు ఉంటాయి. ఆ ఫలాలు అనేక పక్షులను ఆ చెట్లవైపు ఆకర్షిస్తాయి. ఈ ఫలాలకు మూడురకాల రుచులు ఉంటాయి. కొన్ని తియ్యగా ఉంటాయి, కొన్ని పుల్లగా ఉంటాయి, కొన్ని మధ్యరకంగా ఉంటాయి. మామిడిపండు విషయంలో బాగా తెలుస్తుంది ఈ భిన్నరుచులు. పూర్తిగా పండకముందు తింటే కొంచెం తియ్యగా, కొంచెం పుల్లగా ఉంటాయి అవి.

సంసారవృక్షం కూడా మూడురకాల ఫలాలను ఇస్తుంది. అమ్మాయి పెళ్ళి కుదిరింది, చాలామంచి సంబంధం వచ్చింది, మీ కలలు ఫలించాయి; ఆనందంలో చిందులు తొక్కుతున్నారు, ప్రపంచం నందనవనంగా కనిపిస్తుంది; భగవంతుడు కరుణామయుడుగా అనిపిస్తాడు. ఆ ఆనందంలో తేలియాడుతుండగానే పిడుగులాంటి వార్త వస్తుంది. అమెరికాలో ఉన్న అబ్బాయికి ఉద్యోగంలో ఏదో సమస్యవచ్చి, అమెరికా వదిలి వచ్చేస్తున్నాడని వార్త! ఒక కంట పన్నీరు, ఒక కంట కన్నీరు! జగత్తును, భగవంతుణ్ణి, కనిపించిన వారినందరినీ తిట్టిపోస్తారు. ఎందుకీ జీవితం అనిపిస్తుంది. భగవంతుడు ఎందుకు అనవసరంగా ఈ జగత్తును సృష్టించాడు అని కోపం కూడా వస్తుంది. అంటే సంసారం దుఃఖాలయం అయింది. కాసేపు నవ్వు, కాసేపు ఏడుపు; ఒక్కోసారి ఇందాక వర్ణించినట్టుగా మిశ్రఫలం. ఏడవ పోలిక – **సుఖదుఃఖ మిశ్రఫలత్వమ్**.

హెచ్) **ఆశ్రయత్వమ్** – వృక్షాలమీద పక్షులు గూళ్ళు కట్టుకుని నివాసం ఉంటాయి. అంటే వృక్షాలు పక్షులకు ఆశ్రయాన్నిస్తాయి. అంతేకాదు ఆ వృక్షాలు పండించే ఫలాలు పక్షులకు ఆహారం అవుతాయి. ఆ వృక్షాలు తాము తినవు. ఆ ఫలాలను పక్షులు తింటాయి.

సంసారవృక్షంలో పక్షులు జీవులు. కొందరు జీవులు ఊర్ధ్వలోకాలలో సుఖఫలాలను అనుభవిస్తుంటే, మరికొందరు జీవులు అధోలోకాల్లో దుఃఖఫలాలను అనుభవిస్తుంటే, భూలోకంలోని మనుష్యులు ద్వంద్వాలతో కూడిన సుఖదుఃఖ మిశ్రితఫలాలను అనుభవిస్తారు. ఈ పక్షి దృష్టాంతం ముండకోపనిషత్తులో కూడా చూస్తాము.

> **ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే**
> **తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్ అన్యో అభిచాకశీతి** – ముండకం 3.1.1

జీవాత్మపక్షి సంసారవృక్షంలోని తీయటిఫలాలను, చేదుఫలాలను అనుభవిస్తుంది. ఎనిమిదవ పోలిక – **ఆశ్రయత్వమ్**.

ఐ) **చలనత్వమ్** – అంత పెద్ద వృక్షం కూడా గాలికి ఊగుతుంది. చిరుగాలి వేస్తే కదలికలు చిన్నవిగా ఉంటాయి, అదే పెనుతుఫాను వీస్తే విపరీతంగా ఊగిపోతుంది.

సంసారవృక్షంలో జీవులను కదిపేది ప్రారబ్ధకర్మమనే గాలి. ఆ గాలి ఒక్కోసారి చిరుగాలిలా ఆహ్లాదకరంగా వీచవచ్చు; ఒక్కోసారి పెనుతుఫాను గాలిలా మారి వేరే ఊరికో, వేరే దేశానికో విసిరివేయవచ్చు. మీరు కోరుకున్నచోటికి కాక ఇంకొక దేశంలో, కొత్త పరిస్థితుల్లో, కొత్త వాతావరణంలో పడవేయవచ్చు, ఈ ప్రారబ్ధకర్మ అనే గాలి. తొమ్మిదవ పోలిక – **చలనత్వమ్**.

జె) **ఛేద్యత్వమ్** – అంత మహావృక్షాన్ని కూడా కష్టపడి ప్రయత్నం చేస్తే కూకటివేళ్ళతో సహా పెకలించివేయవచ్చు. దానికి సరియైన గొడ్డలి వాడాలి. దానితో ఆ వృక్షం మళ్ళీ పెరగదు.

సంసారవృక్షాన్ని కూడా తీవ్రమైన ప్రయత్నం చేస్తే కూకటివేళ్ళతో సహా పెకలించివేయవచ్చు. దానికి వాడాల్సిన గొడ్డలి జ్ఞానం. జ్ఞానం అనే గొడ్డలితో సంసారవృక్షాన్ని ఖండించి, జననమరణ చక్రంనుంచి శాశ్వతంగా బయట

పడవచ్చు. చిన్నచెట్టును అతి తేలికగా కొట్టివేయగలిగితే, మహావృక్షానికి ఎక్కువ శ్రమ పెట్టాల్సి ఉంటుంది. పదవ పోలిక – **ఛేద్యత్వమ్.**

శంకరాచార్యులవారు ఇంకా ఎన్నో పోలికలు చెప్పారు. అవి కూడా పెద్దపెద్ద సమాసాలతో, మంచి కవితాశైలిలో వర్ణించారు. మనం వాటిలో కొన్నింటిని చూశాము. ఈ సమాన అంశాలవల్ల సంసారాన్ని వృక్షంతో పోల్చారు. కృష్ణపరమాత్మ వీటిలో చాలా అంశాలను వర్ణించాడు. అంతేకాదు, కొన్ని పోలికలు తను విడిగా చెప్పాడు. వాటిని ఆ సందర్భంలో చూద్దాము.

దీనితో సంసారానికీ, అశ్వత్థవృక్షానికీ మధ్య ఉన్న సమాన అంశాల చర్చ అయిపోయింది.

ఈ నేపథ్యంతో శ్లోకాల్లోకి అడుగుపెడదాము.

**శ్రీ భగవాన్ ఉవాచ**

శ్లో. 1 **ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥**

ఊర్ధ్వమూలమ్, అధః, శాఖమ్, అశ్వత్థమ్, ప్రాహుః, అవ్యయమ్,
ఛందాంసి, యస్య, పర్ణాని, యః, తమ్, వేద, సః, వేదవిత్ ॥

| | | | |
|---|---|---|---|
| ఊర్ధ్వమూలమ్ | = ఆదిపురుషుడైన పరమేశ్వరుడే వేరుగా | ఛందాంసి | = వేదములు |
| | | యస్య, పర్ణాని | = దేనియొక్క ఆకులో |
| అధశ్శాఖమ్ | = పరమాత్మే ముఖ్యశాఖగా కలిగి | తమ్ | = అట్టి సంసారరూపవృక్షతత్త్వమును |
| అశ్వత్థమ్ | = సంసారరూపమైన అశ్వత్థవృక్షమును | యః | = ఏ పురుషుడు |
| | | వేద | = తత్త్వపరంగా తెలిసికొంటాడో |
| అవ్యయమ్ | = శాశ్వతమైనదిగా | సః | = అతడు |
| ప్రాహుః | = పేర్కొంటారు | వేదవిత్ | = వేదార్థములను బాగుగా తెలిసినవాడు |

**ఛన్దాంసి యస్య పర్ణాని (సన్తి తమ్) అశ్వత్థమ్ ఊర్ధ్వ–మూలమ్**
**అధః–శాఖమ్ అవ్యయమ్ ప్రాహుః । యః తమ్ వేద, సః వేదవిత్ (ఇతి ఉచ్యతే) ॥**

తా: ఆదిపురుషుడైన పరమేశ్వరుడే వేరుగా, పరమాత్మే ముఖ్యశాఖగా కలిగి సంసారరూపమైన అశ్వత్థవృక్షమును శాశ్వతమైనదిగా పేర్కొంటారు. వేదములు దేనియొక్క ఆకులో అట్టి సంసారరూపవృక్ష తత్త్వమును ఏ పురుషుడు సమగ్రముగా తెలిసికొంటాడో అతడు వేదార్థములను బాగుగా తెలిసినవాడు.

**అశ్వత్థం ప్రాహుః (సంసారమ్)** – సంసారం పదాన్ని మనం కలుపుకోవాలి. సంసారాన్ని అశ్వత్థవృక్షంతో పోలుస్తారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎటువంటి అశ్వత్థవృక్షం? దాన్ని వర్ణించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

**ఊర్ధ్వమూలమ్** – ఆ చెట్టుకు వేళ్ళు ఊర్ధ్వంగా ఉన్నాయి. ఊర్ధ్వం పదానికి రెండు అర్థాలున్నాయి.

ఒక అర్థం – అది ఉత్కృష్టమైనది; అందువల్ల పవిత్రమైనది. భగవంతుడు ఈ మొత్తం జగత్తుయొక్క సృష్టికర్త. ఇంకోవిధంగా చెప్పాలంటే ఈ జగత్తు ఆయన పుత్రుడు; భగవంతుడు మొత్తం జగత్తుకు తండ్రి. అందువల్ల ఉన్నతమైనవాడు, శ్రేష్ఠుడు. ఊర్ధ్వం అంటే అక్షరాలా భగవంతుడు, ఎక్కడో దూరంగా వైకుంఠంలో ఉన్నాడని అర్థం తీసుకోకూడదు. నిజానికి ఈ లోకం లేదా ఈ ప్రాంతం ఊర్ధ్వంగా ఉంది అనలేము. ఎందుకంటే ఆ పదం సాపేక్షిక పదం. అందువల్ల ఊర్ధ్వం అంటే **ఉత్కృష్టత్వమ్**.

రెండవ అర్థం – అతీతం. మనకు అర్థంకాని విషయం వింటే, ఉదాహరణకు మాండూక్యోపనిషత్తు బోధ వింటే, నా తలమీదనుంచి వెళ్ళిపోయింది బోధ అన్నామనుకోండి. ఏమిటి దాని అర్థం? ఆ బోధ నాకు అర్థంకాలేదని. దీన్ని సంస్కృతంలో **దుర్విఘ్నేయత్వమ్** అంటారు. ఈ ఉత్కృష్టమైన, దుర్విఘ్నేయమైన బ్రహ్మ సంసారవృక్షానికి మూలం.

**అధః శాఖమ్** – అధః అంటే కింద. ఊర్ధ్వం పదానికి ఎలాగైతే రెండు అర్థాలున్నాయో, అలాగే అధః పదానికి కూడా రెండు అర్థాలున్నాయి. ఊర్ధ్వం ఒక అర్థం ఉత్కృష్టమైనది కాబట్టి అధః అంటే నికృష్టమైనది. అంటే బ్రహ్మతో పోలిస్తే 14 లోకాలు తక్కువస్థాయికి చెందినవి. శాఖలు అంటే 14 లోకాలు అని చూశాము. అలాగే ఊర్ధ్వం పదానికి ఇంకొక అర్థం దుర్విఘ్నేయం అంటే అర్థంకానిది; కంటికి కనబడనిది. దానికి వ్యతిరేక అర్థం అర్థం అయ్యేది, కంటికి కనబడేది. కంటికి కనబడని భగవంతుణ్ణి, కంటికి కనబడని వేళ్ళతో పోలిస్తే, కంటికి కనబడే లోకాలను కంటికి కనబడే శాఖలతో పోలుస్తున్నది శాస్త్రం. అలాగే భగవంతుడు శ్రేష్ఠమైతే ఈ లోకాలు తక్కువస్థాయికి చెందినవి అవుతాయి.

**అవ్యయమ్** – ఈ అశ్వత్థవృక్షము అవ్యయం. అవ్యయం అంటే శాశ్వతం. ఆది, అంతాలు లేనిది. విత్తు ముందా, చెట్టు ముందా అంటే ఆ వృత్తం కొనసాగుతూనే ఉంటుంది. చెట్టునుంచి విత్తనం; విత్తనంనుంచి చెట్టు; చెట్టునుంచి విత్తనం వస్తూనే ఉంటాయి. అంటే చెట్టు అనాది, అనంతం. అదే విధంగా జీవుడు కూడా అనాది, అనంతం. అతను జనన–మరణ చక్రంలో పడి తిరుగుతూనే ఉంటాడు. జీవుడు ఎప్పుడు పుట్టాడో చెప్పలేము. ఎందుకంటే పూర్వజన్మ కర్మవల్ల ఈ జన్మ వస్తుంది; పూర్వజన్మ కర్మ ముందుజన్మవల్ల వస్తుంది. ఆ విధంగా అది ఒక వృత్తం. కర్మ–జన్మ–చక్ర రూపేణ. అవ్యయం అంటే శాశ్వతం.

**ఛందాంసి యస్య పర్ణాని** – సంసారవృక్షాన్ని పెంచిపోషించేది వేరే ఏదోకాదు, శాస్త్రం విధించిన కర్మలు. ఛందాంసి అంటే **వేదస్య కర్మకాండః**. కర్మకాండ ఎప్పుడూ మనుష్యులను కర్మలలో బంధించివేస్తుంది. చాలామందికి ఈ కర్మల్లో ఉన్న శ్రద్ధ, ఆసక్తి; గీత, ఉపనిషత్తులమీద ఉండదు. వారికి భక్తి బాగా ఉంటుంది. వారి జీవితమంతా అనేక పుణ్యక్షేత్రాలకు వెళుతూ, అనేక అభిషేకాలు చేయిస్తూ, అనేకానేక అతిరుద్ర, మహారుద్ర యాగాలు చేయిస్తూ గడిపేస్తారు. వేదపూర్వభాగానికే అంకితమైపోయి, వేద అంతభాగం ఒకటుందనే తెలుసుకోరు. అంటే విజయవంతంగా సంసారాన్ని పెంచిపోషిస్తారు.

అంటే ఏమిటి మీ ఉద్దేశ్యం? కర్మకాండను గాలికి వదిలేయాలా అని అడగవచ్చు మీరు. కర్మకాండతో మాకేమీ శత్రుత్వం లేదు. నిజానికి కర్మకాండ చాలా అవసరం కూడా. కర్మకాండే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రతలను కలుగజేసి, జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తుంది. అవి కలుగగానే దాన్నించి జ్ఞానకాండకు రమ్మంటున్నాము అంతే. కర్మకాండ విషయంలో రెండు తీవ్రమైన భావనలు ఉంటాయి. కొంతమంది కర్మకాండకు కూడా రారు. వారికి పూజలు, యజ్ఞాలు చేసే తీరికా లేదు, శ్రద్ధా లేదు. అదికూడా మంచిది కాదు. ముందే చెప్పినట్టుగా వారికి చిత్తశుద్ధి కాని, చిత్త ఏకాగ్రత కాని రాదు.

ఇంకొక తీవ్రమైన భావన కర్మకాండలోనే నిలిచిపోవటం. అదీ తప్పే. అది నాకు ఐదోక్లాసు టీచరు నచ్చింది, ఆ క్లాసులోనే ఆగిపోతాను అన్నట్టుంటుంది. శాస్త్రంయొక్క బోధ సారాంశం అంతకుముందు కూడా చూశాము. కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం చేసి చిత్త ఏకాగ్రత పొంది, జ్ఞానకాండకు వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి, ఆత్మజ్ఞానం పొంది మోక్షం పొందాలి. మీరు భగవద్గీతకు వచ్చారంటేనే మీరు కర్మకాండనుంచి జ్ఞానకాండకు వచ్చినట్టు అర్థం.

**యస్తం వేద సః వేదవిత్** – ఎవరైతే తెలుసుకుంటారో. ఏం తెలుసుకుంటారు? సంసారవృక్షం గురించి తెలుసుకుంటారో. అంటే ఆ వృక్షంయొక్క శాఖలు, ఆకులు, పండ్లు, మొదలైనవాటి గురించి తెలుసుకోవటమే కాదు, ఈ సంసార వృక్షానికి మూలం భగవంతుడని కూడా తెలుసుకోవాలని శంకరులవారు అంటున్నారు.

**సమూలం వృక్షం యః వేద సః వేదవిత్**

శాస్త్రాన్ని అధ్యయనం చేసి, సరిగ్గా అర్థం చేసుకున్న వ్యక్తే జ్ఞాని. వేదవిత్ అంటే వేదాంతవిత్; అంటే జ్ఞాని.

మోక్షమంటే ఏమిటి? సంసారనివృత్తి. సంసారం అంటే ఏమిటో తెలిస్తేనే, సంసారనివృత్తి రూపమోక్షం అంటే ఏమిటో అర్థమవుతుంది. అప్పుడే మోక్షం విలువ తెలుస్తుంది. అప్పుడే మోక్షసాధన వైపు తిరుగుతాము. ఎందుకంటే సాధ్యంయొక్క విలువ తెలియకపోతే, దానికి వాడే సాధన విలువ తెలియదు. అందువల్ల ముందుగా కృష్ణపరమాత్మ సంసారాన్ని వర్ణిస్తున్నాడు. ఆ వర్ణన ఇంకా కొనసాగుతున్నది.

శ్లో. 2 **అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయప్రవాలాః ।**
**అధశ్చ మూలాన్యనుసంతతాని కర్మానుబంధీని మనుష్యలోకే ॥**
అధః, చ, ఊర్ధ్వమ్, ప్రసృతాః, తస్య, శాఖాః, గుణప్రవృద్ధాః, విషయప్రవాలాః,
అధః, చ, మూలాని, అనుసంతతాని, కర్మానుబంధీని, మనుష్యలోకే ॥

| | | | |
|---|---|---|---|
| తస్య | = ఆ సంసార వృక్షమునకు | శాఖాః | = దేవమనుష్య తిర్యగ్యోనులలో జన్మించే ప్రాణులే |
| గుణప్రవృద్ధాః | = త్రిగుణములనెడి జలములచే వృద్ధిపొందునట్టి | అధః, చ | = క్రిందివైపునకు |
| విషయప్రవాలాః | = శబ్దాది భోగములనెడి చిగుళ్ళుగల | ఊర్ధ్వమ్ | = పైవైపునకు |

| | | | | |
|---|---|---|---|---|
| ప్రసృతాః | = సర్వత్ర వ్యాపించియుండును | | అధః, చ | = క్రిందను |
| మనుష్యలోకే | = మానవలోకమందు | | (ఊర్ధ్వం, చ) | = పైనను |
| కర్మానుబంధీని | = మనుష్యులను కర్మానుసారముగా బంధించు | | అనుసంతతాని | = అన్ని లోకములలో వ్యాపించియున్నవి |
| మూలాని (అపి) | = అహంకార, మమకార వాసనలు అనే వేర్లు, ఊడలు గూడ | | | |

**తస్య గుణ–ప్రవృద్ధాః విషయ–ప్రవాలాః శాఖాః అధః ఊర్ధ్వమ్ చ ప్రసృతాః (సన్తి)**
**అధః చ మనుష్య–లోకే కర్మ–అనుబన్ధీని మూలాని అనుసన్తతాని (సన్తి) ॥**

తా: ఆ సంసార వృక్షమునకు త్రిగుణములనెడి జలములచే వృద్ధిపొందునట్టి శబ్దాది భోగములనెడి చిగుళ్ళుగల దేవమనుష్య తిర్యగ్యోనులలో జన్మించే ప్రాణులే క్రిందివైపునకు, పైవైపునకు సర్వత్ర వ్యాపించియుండును. మానవలోకమందు మనుష్యులను కర్మానుసారముగా బంధించు అహంకార, మమకార వాసనలు అనే వేర్లు, ఊడలు గూడ క్రిందను, పైనను అన్ని లోకములలో వ్యాపించియున్నవి.

ఇంతకుముందు శ్లోకంలో బ్రహ్మ సంసారవృక్షానికి మూలమనీ, శాఖలు పద్నాలుగు లోకాలనీ, ఆకులు కర్మకాండ అనీ చూశాము. ఈ శ్లోకంలో శాఖల గురించి మరింత వివరంగా వస్తుంది.

**తస్య శాఖా ప్రసృతాః** – పెద్ద సంసారవృక్షంయొక్క కొమ్మలు సర్వత్రా వ్యాపించియున్నాయి.

**అధః చ ఊర్ధ్వమ్** – కొన్ని శాఖలు బాగా పైకి వ్యాపించియున్నాయి; కొన్ని శాఖలు బాగా కిందికి ఉన్నాయి; మరికొన్ని మధ్యలో ఉన్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే పద్నాలుగు లోకాలూ ఈ సంసారవృక్షంయొక్క కొమ్మలు. భువర్లోక, సువర్లోకాలు చాలా పైకి ఉన్న శాఖలు; అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళలోకాలు అధోలోకాలు; భూలోకం మధ్యలోకం. మధ్య ఉన్న కొమ్మలు భూలోకాన్ని సూచిస్తాయి.

అంతేకాదు, ప్రతిలోకంలోను, అందులో ఉన్న జీవులకు ఆ లోకానికి తగ్గ శరీరాలు ఉంటాయి. ఊర్ధ్వలోకాల్లో దేవతలకు వారివారి స్థాయినిబట్టి దేవశరీరము, గంధర్వశరీరము, పితృశరీరమువంటి శరీరాలు ఉంటాయి. అంటే ఇవి ఉత్తమలోకాలకు చెందిన ఉత్తమ శరీరాలు; మధ్యమలోకానికి చెందిన భూలోకంలో మధ్యమ శరీరాలు ఉంటాయి; అధోలోకానికి చెందిన పాతాళలోకాల్లో అధమశరీరాలు ఉంటాయి.

జీవుడు అంటే శరీరం కాదని మర్చిపోకూడదు. జీవుడు అంటే శరీరంలో ఉన్న శరీరి. ప్రతిబింబసహిత సూక్ష్మశరీరం జీవుడు. ఇదీ జీవుని నిర్వచనం. ఈ శరీరం మధ్యమశాఖలో ఉంది. సంసారానికి చెందిన ఈ మధ్యమశాఖలోని జీవి కష్టసుఖాలను అనుభవిస్తుంది. ఈ శరీరం ధరించటానికి తోడ్పడిన ప్రారబ్ధకర్మ ముగియగానే, ఈ శరీరాన్ని వదిలేస్తుంది. అంటే శరీరం మరణిస్తుంది. ఈ జీవి వేరే లోకానికి వెళుతుంది. ఉత్తమలోకాలకి వెళితే ఇంద్రశరీరమో, వరుణశరీరమో, అగ్నిశరీరమో పొందుతుంది. ఇంద్రశరీరం ఇంద్రుడు కాదు, ఇంద్రశరీరం ఈ జీవికి ఒక ఉపాధి మాత్రమే; కాకపోతే మనుష్యశరీరంమీద ఉత్తమ ఉపాధి. అదే ఒకవేళ ఈ జీవికి పాపం ఎక్కువ ఉంటే, అధోలోకానికి వెళతాడు. జంతు జన్మనో, చెట్టు జన్మనో పొందుతాడు.

**యోనిమన్యే ప్రపద్యన్తే శరీరత్వాయ దేహినః**

**స్థాణుమన్యేऽనుసంయన్తి యథాకర్మ యథా శ్రుతమ్** – కఠ 2.2.7

ఇది కఠోపనిషత్తులో చాలా ముఖ్యమైన మంత్రము. మనిషి ఎప్పుడూ పైలోకాలకే వెళతాడని చెప్పలేము. మనిషి అధోలోకాలలో పడిపోవచ్చు అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

అందువల్లనే జీవితమనే ఆటను వైకుంఠపాళి (స్నేక్స్ అండ్ లాడర్స్)తో పోలుస్తారు. కొన్ని సిద్ధాంతాల్లో జీవుడు పైలోకాలకు వెళితే ఆ లోకాల్లోనే తిరుగుతాడని భావిస్తారు. కాని వేదాంతం ఇటువంటి ఎదుగుదలను ఒప్పుకోదు. మనిషిజన్మలో సరిగ్గా జీవించకపోతే అధోగతిపాలు అయ్యే అవకాశం ఉంది అంటుంది. తమోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి అధోలోకాలకు వెళతాడని చూశాము. వైకుంఠపాళి ఆటనే పరమపదసోపానం అనికూడా అంటారు. ఆ ఆటలో మీరు చకచకా నిచ్చెన ఎక్కి 94కి చేరారనుకుందాము. ఆరు పడితే వైకుంఠం చేరుకుంటారు. కాని ఆ మధ్యలో రెండు పెద్ద పాములు బుసలు కొడుతూ పొంచివుంటాయి. 95లోకి వెళితే 56లో జారిపోతారు, 98లో పడితే చాలా కిందికి, అంటే 11కి వెళ్ళిపడతారు. అందువల్ల జీవితంలో ఎప్పుడూ పైకి దూసుకుపోతారనే నమ్మకం లేదు. మీ జీవితాన్ని చాలా బాధ్యతగా నడుపుకురావాలి.

ఆ విధంగా ఒక్కొక్క శరీరం ఒక్కొక్క కొమ్మలాంటిది. ఇప్పుడు మనుష్యశరీరం అనే కొమ్మమీద ఉన్నాము, వచ్చే జన్మలో దేవశరీరం అనే కొమ్మమీద ఉంటామో, లేదా కిందికొమ్మమీదకు జారిపోతామో తెలియదు. ఉన్న కొమ్మమీంచి పైకొమ్మమీదకి ఎగబ్రాకటానికి కాకూడదు మన ప్రయత్నం. అసలా చెట్టుమీంచే వినీలాకాశానికి స్వేచ్ఛగా ఎగిరిపోయేందుకు ఉండాలి. అంటే జననమరణ వృత్తంలోపడి తిరగకుండా, జ్ఞానం పొంది, ఈ వృత్తంనుంచి బయటపడాలి. అప్పుడు స్వేచ్ఛగా ఎగిరే పక్షిలా ఉంటాము.

అధశ్చోర్ధ్వం ప్రసృతాః = ఉత్తమ మధ్యమ అధమ శరీర రూపేణ శాఖా ప్రసృతాః

ఈ మూడురకాల జన్మలు ఎలా వస్తాయి? దేవశరీరం, మనుష్యశరీరం లేదా జంతుశరీరం ఎలా వస్తాయి?

**గుణప్రవృద్ధా** – భగవంతుడు తన ఇష్టాయిష్టాలను అనుసరించి మనకు భిన్నమైన శరీరాలను ఇవ్వడు. మనమే 'భగవాన్, నాకీ శరీరం ఇవ్వు,' అని కోరతాము. మన కోరిక మేరకు భగవంతుడు ఆయా శరీరాలను ఇస్తాడు. అంటే ఇంత ప్రత్యక్షంగా కోరము కాని, మన జీవితవిధానం దాన్ని పరోక్షంగా కోరేలా చేస్తుంది. ఇంతకుముందు అధ్యాయంలో ఈ విషయం వివరంగా చూశాము. సత్త్వగుణం ఉన్నవ్యక్తి ఊర్ధ్వలోకాలకు, రజోగుణం ఉన్నవ్యక్తి మనుష్యలోకానికి, తమోగుణం ఉన్నవ్యక్తి అధోలోకాలకు వెళతాడని వచ్చింది అందులో. అందువల్ల వచ్చే జన్మలో మన పరిస్థితి ఏమిటన్నది భగవంతుడు రాయటం లేదు; విధి ఆడే వింతనాటకం కాదు, మనం చేతులారా చేసుకుంటున్నాము. మనకున్న ఫ్రీవిల్‌ను సద్వినియోగం చేసుకుంటే ఉత్తమజన్మ వస్తుంది; దుర్వినియోగం చేసుకుంటే అధోజన్మ వస్తుంది. మన గుణాలనుబట్టి వస్తాయి.

**విషయప్రవాలాః** – విషయవస్తువులను, చెట్టుకు వచ్చిన చిగుళ్ళతో పోల్చవచ్చు. చెట్టుయొక్క కాండంనుంచి ముందు చిన్న చిగుళ్ళు తొడుగుతాయి. అవి కాలక్రమేణా పెద్దకొమ్మలుగా ఎదుగుతాయి. అదే విధంగా, వచ్చే జన్మలో మనం ధరించబోయే శరీరం ఈ జన్మలోనే చిగుళ్ళు తొడుగుతుంది. అదెలా సాధ్యం?

ఈ జన్మలో మనం చూసే విషయవస్తువు మనలో కోరికను పుట్టిస్తుంది. దాన్ని కామం అంటారు. అలా కోరికను పుట్టించాలనే ప్రకటనల వర్షం కురిపిస్తారు. ఆ విధంగా విషయవస్తువు కామానికి దారితీస్తుంది. కామం కర్మకు దారితీస్తుంది. కర్మ చేస్తేనే ఆ కోరిక తీరుతుంది. ఉదాహరణకు మీరు బెంజ్‌కారు చూశారు. అది విషయవస్తువు. దానిమీద మీకు కోరిక పుడుతుంది. అది కామానికి దారితీస్తుంది. ఆ కోరికను తీర్చుకోవాలంటే, అన్ని లక్షల ధనాన్ని మీరు ప్రోగెయ్యాలి. దానికితగ్గ కర్మ చెయ్యాలి. మీరు చేసిన ప్రతి కర్మ కూడా పుణ్యమో, పాపమో కలుగజేస్తుంది. పుణ్యపాపాల్లో ఏది ఎక్కువ ఉంటే, దాన్నిబట్టి వచ్చేజన్మ వస్తుంది. అంటే మీ మరుజన్మ ఈ జన్మలో మీకు వచ్చిన పుణ్యపాపాలమీద; మీ పుణ్యపాపాలు మీరు చేసిన కర్మలమీద; కర్మలు మీ కోరికమీద; మీ కోరిక మీరు చూసిన విషయవస్తువుమీద ఆధారపడివుంటాయి.

**విషయవస్తువు → కోరిక → కర్మలు →పుణ్యపాపం → మరుజన్మ**

పోనీ ఆ మరుజన్మలో ఊరుకుంటారా? ఇదే వృత్తం కొనసాగుతుంది మళ్ళీ. మళ్ళీ మీరు ఉన్న ప్రపంచంలో మీకు అనేక వస్తువులు కనబడతాయి. ఈ వరుసక్రమంలో జరిగిపోతుంది.

**పుణ్యేన పుణ్యం లోకం నయతి, పాపేన పాపముభాభ్యామేవ మనుష్యలోకమ్** – ప్రశ్నోపనిషత్తు

అందువల్ల విషయప్రవాలాః అంటే విషయవస్తువులు చిగుళ్ళవంటివి. చిగురు ఎలాగైతే పెరిగి పెద్దకొమ్మగా ఎదుగుతుందో, అలా విషయవస్తువు పెరిగి వచ్చేజన్మ అనే కొమ్మగా మారుతుంది.

**అధశ్చ మూలాన్యనుసంతతాని** – ఏ వృక్షాన్ని తీసుకున్నా దానికి అనేక వేర్లు ఉంటాయి. వాటిలో మళ్ళీ ఒక ముఖ్యమైన వేరు ఉంటుంది. వృక్షం ఎదగటానికి ముఖ్యమైన వేరు ఒక్కటే చాలదు, అనేక చిన్నవేర్లు కూడా ఉండాలి. వృక్షం ఎంత పెద్దదయితే ఆ వేర్లు అంత దూరానికి విస్తరిస్తాయి. ఒక్కోసారి మీ పక్కింట్లో ఉన్న వృక్షం యొక్క వేర్లు బాగా పెరిగి, మీ రెండిళ్ళ మధ్యనున్న గోడను చీల్చుకుని, మీ ఇంటిలోకి వచ్చే ప్రమాదం కూడా ఉంది. అదే విధంగా సంసారవృక్షానికి కూడా ప్రధానవేరు, వేరే వేర్లు ఉంటాయి. ప్రధానవేరు భగవంతుడని కృష్ణపరమాత్మ మొదటిశ్లోకంలో పేర్కొన్నాడు. ఈ ద్వితీయస్థాయి వేర్లు ఏమిటో కృష్ణపరమాత్మ చెప్పలేదు. కాని భాష్యకారులు వాటిని **రాగద్వేషాలనే బలమైన వాసనలు** అంటారు. చూసిన ప్రతివస్తువుమీద మీరు రాగమనే ముద్రనో, ద్వేషమనే ముద్రనో వేస్తారు. జరిగిన ప్రతి ఒక్క అనుభవాన్నీ బాగుందనో, బాగాలేదనో నిర్ణయిస్తారు. ఆ విధంగా జీవితంలో జరిగే అనేక అనుభవాలకు మంచి, చెడు అనే బిరుదులను తగిలిస్తారు. అంతదాకా ఎందుకు, ఒక వ్యక్తిని రెండుమూడుసార్లు చూస్తే అతనికి అతుక్కుపోవటమో, అతనినుంచి దూరంగా పారిపోవటమో చేస్తారు. వారానికి ఒకసారి వెళ్ళే గీతాబోధకు కూడా ఒకరి పక్కన కూర్చోటానికి ఇష్టపడతారు, ఇంకొకరి పక్కనుంచి తప్పించుకుంటారు. అలాగే ఒకవారం రోజులు నలుగురుతో కలిసి తీర్థయాత్రలకు వెళ్ళినా, తీసుకువెళ్ళిన ఏజంట్‌తో ఫలానా అతనితో ఒకే గదిలో వెయ్యమనో, ఫలానా అతనితో ససేమిరా వెయ్యవద్దనో, ఫలానా గది కావాలనో, ఫలానా గది వద్దనో రకరకాలుగా వేధిస్తారు. 7 రోజుల జీవితానికి అంత బలమైన రాగద్వేషాలను ప్రదర్శిస్తే 70 సంవత్సరాల జీవితానికి ఇంకెంత బలంగా రాగద్వేషాలు పేరుకొని ఉంటాయి?

రాగం ప్రవృత్తికి దారితీస్తే, ద్వేషం నివృత్తికి దారితీస్తుంది. ప్రవృత్తిమార్గం అంటే మీకు నచ్చినదానివైపు వెళ్ళటం; నివృత్తి అంటే మీకు నచ్చనిదానివైపునుంచి దూరం తొలగిపోవటం. రాగద్వేషాలకు తగ్గట్టుగా ప్రవృత్తిమార్గంలో కర్మలనో, నివృత్తిమార్గంలో కర్మలనో చేస్తారు. ఆ కర్మలకు తగ్గ పుణ్యపాపాలు వస్తాయి. పుణ్యపాపాలకు తగ్గ పునర్జన్మ వస్తుంది. అధశ్చ అంటే మూలవేరుతో పాటు; మూలాని అంటే మూలవేరు కాదు, రెండవరకం వేర్లు; అనుసంతతాని అంటే అంతటా విస్తరిస్తాయి. గుర్తుంచుకోండి, ఈ రాగద్వేషాలు మీ ఇంటికే పరిమితమవవు, మీ ఇరుగుపొరుగుకు, పొరుగుదేశాలకు కూడా విస్తరిస్తాయి.

ఇండియా–శ్రీలంకల మధ్య జరిగే టెన్నిస్ ఆట చూస్తే, ఇండియా గెలవాలనే బలమైన రాగం ఉంటుంది. అది సహజం. కాని మీకు సంబంధం లేని రెండుదేశాలు ఆస్ట్రేలియా–అమెరికాల మధ్య టెన్నిస్ ఆట జరుగుతున్నా కూడా, మీరు చూడటం మొదలుపెట్టిన పావుగంటలోనే ఒకదేశంమీద రాగం ఏర్పడుతుంది. ఆదేశం గెలవాలని బలంగా కోరుకుంటారు. అంటే దానర్థం ఏమిటి? రెండవస్థాయి వేర్లు అంతటా విస్తరిస్తున్నాయన్నమాట.

**కర్మానుబంధీని** – ఈ రెండవస్థాయి వేర్లు కర్మలలో బంధిస్తాయి. అనుబంధః అంటే రాగద్వేష వాసనలయొక్క పరిణామం. ఎటువంటి కర్మలు చేస్తారు? అవి ప్రవృత్తిరూపకర్మలు కావచ్చు, నివృత్తిరూపకర్మలు కావచ్చు. మీరు చేసే ఏ పని అయినా ఈ రెండింటిలో ఒక పద్ధతిలో చేస్తారు. ఇదంతా జరిగేది ఎక్కడ?

**మనుష్యలోకే** – నిజానికి ఇది మనిషియొక్క జీవితచరిత్ర. ఈ జన్మలో చేసిన ప్రవృత్తిరూప–నివృత్తిరూప కర్మలు వచ్చేజన్మకి బీజం వేస్తాయని చూశాము.

ఈ వృత్తాన్ని రంగులరాట్నంతో పోల్చవచ్చు. రంగులరాట్నాన్ని మెర్రీగోరౌండ్ అంటారు ఇంగ్లీషులో. అది ఆనందాన్ని కలుగజేస్తుందని, అందులోకి హుషారుగా ఎక్కుతాము మనం. కాని అదే మెర్రీగోరౌండ్‌ని నడిపేవ్యక్తి అక్కడ్నుంచి ఏ కారణంవల్లనో వెళ్ళిపోయాడనుకోండి, మనం అందులోంచి ఇప్పట్లో దిగే అవకాశం లేదని తెలిస్తే, మెర్రీగోరౌండ్ కాస్తా సారీగోరౌండ్‌గా మారిపోతుంది.

అదేవిధంగా మనం ఈ సంసారచక్రంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము. మనం కోరినప్పుడు మనుష్యజన్మ వచ్చి, మనం కోరినప్పుడు బయటపడగలిగితే బాగానే ఉంటుంది కాని, నిస్సహాయంగా జననమరణ వృత్తంలో పడి తిరుగుతుంటాము. అందువల్ల కర్మానుబంధీని మనుష్యలోకే అన్నాడు కృష్ణపరమాత్మ. మనుష్యలోకే అని ప్రత్యేకించి ఎందుకు అన్నాడు? ఎందుకంటే పద్నాలుగు లోకాలు ఉన్నా ఒక్క మనుష్యజన్మనే కర్మజన్మ అంటారు. తక్కిన లోకాలను భోగభూమి అంటే, భూలోకాన్ని మాత్రమే కర్మభూమి అంటారు. తక్కిన లోకాలలో కొత్తగా కర్మచేసి కొత్తగా పుణ్యపాపాలను పొందలేము. అక్కడ అంతకుముందు జన్మలలో చేసిన పుణ్యాన్నో, పాపాన్నో క్షయం చేసుకోగలము అంతే. ఒక్క భూలోకంలోనే, అందులో మనిషికే కర్మచేసే అవకాశం ఉంది. అందువల్ల మనుష్యలోకే అన్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 3 **న రూపమస్యేహ తథోపలభ్యతే నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా ।**
**అశ్వత్థమేనం సువిరూఢమూలమ్ అసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా ॥**

న, రూపమ్, అస్య, ఇహ, తథా, ఉపలభ్యతే, న, అంతః, న, చ, ఆదిః, న, చ, సంప్రతిష్ఠా,
అశ్వత్థమ్, ఏనమ్, సువిరూఢమూలమ్, అసంగశస్త్రేణ, దృఢేన, ఛిత్త్వా ॥

అస్య = ఈ సంసారవృక్షముయొక్క
రూపమ్ = స్వరూపము ఎలా వర్ణింపబడినదో
తథా = అలా
ఇహ = ఈ లోకమందు బాగుగా పరిశీలించినప్పటికినీ
న, ఉపలభ్యతే = తెలియబడకున్నది
(యతః) = ఎందుకంటే
న, ఆదిః = దీనికి ఆదియు లేదు
చ = ఇంకా
న, అంతః = అంతమూ లేదు
చ = అలాగే

న, సంప్రతిష్ఠా = సరియైన స్థితియులేదు
(అతః) = ఇందువల్ల
ఏనమ్ = ఇటువంటి
సువిరూఢమూలమ్ = అహంకార, మమకార వాసనలనెడి దృఢమైన మూలములుగల
అశ్వత్థమ్ = సంసారరూపమైన అశ్వత్థవృక్షమును
దృఢేన = నిశితమైన
అసంగశస్త్రేణ = వైరాగ్యమనెడి శస్త్రముచే
ఛిత్త్వా = ఛేదించి

**(యథా అయం వర్ణితః) తథా అస్య రూపమ్ ఇహ న ఉపలభ్యతే ।**
**(అస్య) అన్తః న, ఆదిః చ న, సమ్ప్రతిష్ఠా చ న (ఉపలభ్యతే),**
**సువిరూఢ-మూలమ్ ఏనమ్ అశ్వత్థమ్ దృఢేన అసఙ్గ-శస్త్రేణ ఛిత్త్వా ॥**

తా: ఈ సంసారవృక్షముయొక్క స్వరూపము ఎలా వర్ణింపబడినదో అలా ఈ లోకమందు బాగుగా పరిశీలించినప్పటికినీ తెలియబడకున్నది. ఎందుకంటే దీనికి ఆదియు లేదు ఇంకా అంతమూ లేదు. అలాగే సరియైన స్థితియులేదు. ఇందువలన ఇటువంటి అహంకార, మమకార వాసనలనెడి దృఢమైన మూలములుగల సంసారరూపమైన అశ్వత్థవృక్షమును నిశితమైన వైరాగ్యమనెడి శస్త్రముచే ఛేదించి,

రెండున్నర శ్లోకాలు సంసారవర్ణన శ్లోకాలు అని చూశాము. అందువల్ల ఈ శ్లోకంలోని మొదటిపాదం వరకు ఈ సంసారవర్ణన కొనసాగుతుంది. ఇక్కడ కృష్ణపరమాత్మ ఒక సాంకేతిక సమాచారాన్ని సూచిస్తున్నాడు. ఈ సంసారలోతులు కొలవటానికి ప్రయత్నించినకొద్దీ అనేక సందేహాలు కలుగుతాయి. ఈ జగత్తు ఎప్పుడు వచ్చింది, జీవుడు ఎప్పుడు పుట్టాడు, జగత్తు ఎప్పుడు అంతమవుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికినకొద్దీ, అవి అంతుపట్టని సమస్యలుగా మిగిలిపోతాయి.

మొత్తం సృష్టి ఒక మాయ. సృష్టి అర్థమయినట్టే ఉంటుంది కాని అర్థం కాకుండా ఉంటుంది. శాస్త్రజ్ఞులు విశ్వంయొక్క వివరాలు తెలుసుకుందామని ప్రయత్నించినకొద్దీ మానవమేధస్సు ఒక అతీతశక్తికి తలవంచక తప్పదు అని గ్రహిస్తారు.

TOE – Theory Of Everything

శాస్త్రజ్ఞులు ప్రతి ఒక్కదానికీ ఒక సిద్ధాంతం చెప్పాలని ప్రయత్నిస్తున్నారు కాని, కొంతమేరకు విజయవంతం అయినా, వారికి అంతుపట్టనిది ఇంకా ఎంతోవుంది.

**అస్య రూపం న ఉపలభ్యతే** – ఈ విశ్వంయొక్క స్వరూపం మానవమేధస్సుకు అందదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. రూపం అంటే స్వరూపం. దేని స్వరూపం? ఈ విశ్వంయొక్క స్వరూపం; న ఉపలభ్యతే అంటే అందదు. దాన్ని అనిర్వచనీయమ్ అంటారు. జగత్తును మిథ్య అని బోధిస్తాయి ఉపనిషత్తులు.

**సత్ అసత్భ్యామ్ అనిర్వచనీయం మిథ్యా**

ఈశ్వరుడు ఎలా మాయాశక్తితో ఈ జగత్తును సృష్టించాడో; కంటికి ఎదురుగా ప్రత్యక్షంగా కనిపిస్తూ, మనను వేదిస్తున్న ఈ జగత్తు ఎలా మిథ్యో, చాలా వివరంగా, ఒక క్రమపద్ధతిలో ఉపనిషత్తుల్లో వస్తుంది. మాండూక్యకారికల్లో గౌడపాదాచార్యులవారు జగత్తు మిథ్య అనీ, నిర్గుణబ్రహ్మ (తురీయం) కార్యకారణ విలక్షణమ్ అనీ, అంటే తురీయంనుంచి జీవుడు కాని, జగత్తు కాని పుట్టలేదు అనీ; శ్రుతి, యుక్తి ప్రమాణాల ద్వారా చాలా వివరంగా చెప్పుకువస్తారు. ఇక్కడ దీన్ని న ఉపలభ్యతే అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఉపనిషత్తుల్లో బోధించినట్టుగా లేదా మాండూక్యకారికల లోతుల్లోకి వెళ్ళకుండా, వీలున్నంత తేలికగా ఈ సృష్టి గురించి చిన్న విశ్లేషణ చేద్దాము ఇప్పుడు. నేను ఎందుకు పుట్టాను? ప్రతివారికి ఎప్పుడో ఒకప్పుడు రాకతప్పని ప్రశ్న ఇది – నేను ఎందుకు పుట్టాను? దానికి ఒక్కముక్కలో జవాబు చెప్పాలంటే నువ్వు చేసుకున్న కర్మవల్ల పుట్టావు. ఫలానా వ్యక్తికే కొడుకుగా ఎందుకు పుట్టావు అంటే అతను చేసుకున్న కర్మ కూడా దానికి తోడవుతుంది.

కాని ఆ కర్మ ఎలా వచ్చింది? మీ పూర్వజన్మకర్మవల్ల. పూర్వజన్మకర్మ ఎలా వచ్చింది? అంతకుముందు చేసిన కర్మవల్ల. కాని మొట్టమొదటి జన్మకు పూర్వజన్మ ఎక్కడినుంచి వస్తుంది? మొట్టమొదటి జన్మ అంటూ లేదంటుంది శాస్త్రం. సృష్టి వృత్తాకారంలో జరుగుతుంది. అంటే ఈ సృష్టి, దానిముందు సృష్టి గురించి చూస్తాము ఎప్పుడూ. వృత్తాన్ని కూడా ఒకచోట మొదలుపెట్టి గీస్తాము కదా; కాని ఇది మనం గీస్తున్న వృత్తం కాదు. ఒక చేతిగాజుని చూపించి దీనికి మొదలు ఎక్కడుందో చెప్పండి అంటే, చెప్పగలరా? లేదు! అదేవిధంగా సృష్టిప్రక్రియ అనే వృత్తానికి ఆది, అంతం అంటూ ఉండదు.

ఈ సృష్టిప్రక్రియ అంశాన్ని కాలంతో అన్వయించి చూద్దాము. సృష్టి ఎప్పుడు జరిగిందని మీరు అడిగితే, ఆ ప్రశ్న సమయంతో ముడిపడివుందని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే సృష్టి, కాలం ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయి. అదేవిధంగా దేశం కూడా. అంటే దేశం, కాలం, సృష్టి – ఈ మూడూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయి.

ఇప్పుడు సృష్టి ఎప్పుడు మొదలయింది ప్రశ్నలో కాలం ఎప్పుడు మొదలయింది అనే ప్రశ్న అంతర్లీనంగా ఉంది. కాలం ఎప్పుడు మొదలయింది ప్రశ్నే కుదరదు. ఎందుకు? కాలంయొక్క ఆరంభం గురించి మాట్లాడాలీ అంటే, ఆరంభం గురించి చెప్పే ఇంకొక కాలం ఉండాలి. ఇప్పుడు సమయం ఏడు అయింది, ఎనిమిది అయింది,

తొమ్మిది అయింది. దానికి భిన్నంగా ఇంకొక సమయం ఉండాలి. మొదటి సమయం, రెండవ సమయంయొక్క ప్రారంభం గురించి చెప్పగలదు. ఒకవేళ మొదటి సమయం, రెండవ సమయంయొక్క ప్రారంభం గురించి చెబితే, మొదటి సమయంయొక్క ప్రారంభం గురించి ఏ సమయం చెప్పగలదు? దీనికి జవాబు మనకు అందదు. అదే సూత్రం దేశానికి కూడా వర్తిస్తుంది. అందువల్ల సృష్టియొక్క ఆరంభం గురించి కాని, అంతం గురించి కాని మనం చెప్పలేము. కొబ్బరిచెట్టు ముందా, కొబ్బరికాయ ముందా? కోడి ముందా, కోడిగుడ్డు ముందా? ఇవి అంతపట్టని ప్రశ్నలు.

విజ్ఞానశాస్త్రజ్ఞులు ఒకవేళ నాస్తికులైనాకూడా, విశ్వంయొక్క లోతులు కొలవటానికి ప్రయత్నించినకొద్దీ, భగవంతునియొక్క సర్వజ్ఞత్వానికి చేతులెత్తి మొకరించకుండా ఉండలేరు. దీనివెనుక ఏదో తెలియనిశక్తి ఉంది అంటారు. ఈ విషయం ఎప్పుడో కొన్ని వేల సంవత్సరాల క్రితం శాస్త్రం చెప్పింది. సృష్టివెనక మాయాశక్తి ఉంది అంది. ఈ మాయ అనే పదం మన దేశస్థులకు బాగా అలవాటు. అర్థంకానిది మాయ అంటారు. అందువల్ల అస్యరూపం ఇహ న ఉపలభ్యతే అన్నాడు కృష్ణపరమాత్మ.

**న అంతః** – సృష్టియొక్క అంతం గురించి కూడా మాట్లాడలేము. సృష్టి ఆరంభం గురించి మాట్లాడలేము. ఎందుకంటే సృష్టి ఆరంభం అంటే కాలంయొక్క ఆరంభం అవుతుంది. కాలంయొక్క ఆరంభం మానవమేధస్సుకు అందదు. అదేవిధంగా సృష్టియొక్క అంతం అంటే కాలంయొక్క అంతం అవుతుంది. అదీ చెప్పలేము.

కొందరు అడుగుతూ ఉంటారు, 'కాలం అంతమయ్యాక ఏమవుతుంది?' ఒకసారి ఆ ప్రశ్నను పరిశీలించండి. ప్రశ్నలోనే భిన్నపదాలు లేవూ? కాలం అంతమయ్యాక అంటే కాలం ముగిశాక. ముగిశాక పదమే తర్కానికి అందదు. ముగిశాక అనే పదమే కాలాన్ని సూచిస్తుంది; కాలం ముగిశాక ఇంకేం ఉంటుంది? అలాగే కాలం ముందు ఏముంటుంది? కాని ఎవరైనా, ఏదైనా మీటింగుకి అనుకున్న సమయానికన్నా ముందువస్తే, 'నువ్వు ముందు వచ్చావు,' అంటాము కదా అనవచ్చు మీరు. అదివేరు. ఏడుగంటల లోపు వచ్చావు అంటే దాని ముందు ఆరు ఉంది, ఐదు కూడా ఉంది. కాని అసలు మొత్తం కాలానికి ముందు ఏ కాలం ఉంది? అందువల్ల న అంతః న ఆదిః.

సరే ఆది–అంతాలు లేవు, పోనీ మధ్యలో ఉందా? ఆది అంతాలు లేనిదానికి మధ్యభాగాన్ని ఎలా కొలుస్తాము? ఒకవేళ 'ఈ గదిలో మధ్యభాగం ఏది?' అని అడిగామనుకోండి, అది ఎలా చెప్పగలరు. ముందు ఈ గదియొక్క ఆది అంతాలు కొలుస్తారు. రెండు చివరలు తెలియకుండా వాటి మధ్యభాగాన్ని ఎలా చెబుతారు? అందువల్ల మధ్యభాగం గురించి కూడా చెప్పలేరు.

**న చ సంప్రతిష్ఠా** – మధ్యభాగం కూడా లేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మామూలుగా సంప్రతిష్ఠా అంటే ఆధారం, అధిష్ఠానం. కాని ఇక్కడ సంప్రతిష్ఠా అంటే మధ్యభాగము. అంటే ఈ మూడు విషయాలు తెలియవు. ఏమిటవి? ఆది, అంతము, మధ్యభాగము. ఈ మూడూ కాక నాకు అన్నీ తెలుసని అంటే, నాకు ఏమీ తెలియదని అర్థం.

అందువల్ల సంసారం లోతులు కొలిచినకొద్దీ అది అంతుపట్టని సమస్యగా మిగిలిపోతుంది. సంసారం లోతులు కొలిచేదానికన్నా, దాన్నించి బయటపడటం మీ కర్తవ్యం. మీకు స్వప్నప్రపంచం భయాందోళనలను కలుగజేస్తుంటే, దానికి పరిష్కారం ఏమిటి? స్వప్నాన్ని విశ్లేషిస్తూ కూర్చునేకన్నా, స్వప్నంనుంచి జాగ్రదావస్థకు మేలుకోవటమే దానికి పరిష్కారం. కొంతమంది మానసిక శాస్త్రవేత్తలు స్వప్నాన్ని విశ్లేషించటంలో ఎంతగా మునిగిపోతారంటే, ఈ జాగ్రద్‌ప్రపంచాన్ని అనుభవించే తీరికే ఉండదు వారికి. అందువల్ల స్వప్నప్రపంచం సమస్యాత్మకంగా ఉంటే, దాన్నించి మేలుకోవటమొక్కటే మార్గం. ఇక్కడ కూడా అంతే. సంసారం సమస్యాత్మకంగా ఉంటే, దాన్నించి బయటపడటమొక్కటే మార్గం. ఆ మార్గాన్ని రెండవపాదంనుంచి చూస్తాము. సంప్రతిష్ఠా పదంతో మొదటి అంశం అయిన సంసారవర్ణన ముగిసింది.

### 2. మోక్షసాధనాని – శ్లోకాలు 3 రెండవ పాదం –6

మూడవశ్లోకంలోని రెండవపాదంనుంచి రెండవ అంశంలోకి అడుగుపెడుతున్నాము. ఏమిటది? **సంసారనివృత్తి ఉపాయః** – ఈ సంసారచక్రంనుంచి బయటపడటమెలా? దీన్ని మోక్షసాధనాని అన్నాము. కృష్ణపరమాత్మ నాలుగుమార్గాల గురించి చెప్పబోతున్నాడు. అంటే ఆ నాలుగింటిలో ఏదో ఒకటి ప్రయత్నించమని కాదు అర్థం; నాలుగూ సమానంగా అవసరమే. శ్లోకంలోకి వెళ్ళేముందు అవేమిటో చూద్దాము. అవి వైరాగ్యం, శరణాగతి, వేదాంత విచారణ, సద్గుణాలు. ఉపాయః అంటే పద్ధతులు.

ఎ) **వైరాగ్యం** – వైరాగ్యమనే శస్త్రంతో సంసారాన్ని ఛేదించాలి. ఇంకోవిధంగా చెప్పాలంటే, ప్రపంచంమీద ఆధారపడటం తగ్గించుకోవాలి. ఎందుకు? ప్రపంచం అనుక్షణం మారుతూ ఉంటుంది, ప్రపంచం అంతుపట్టకుండా ఉంటుంది, ప్రపంచంలో ఎప్పుడేమవుతుందో తెలియదు; ప్రపంచంమీద ఆధారపడవద్దు అని చెప్పినంత మాత్రాన ప్రపంచాన్ని ద్వేషించమనటం లేదు. ప్రపంచంమీద ఆధారపడేస్థాయినుంచి భగవంతునిమీద ఆధారపడేస్థాయికి ఎదగాలి.

మొదట్లో భగవంతుణ్ణి ఏకరూప ఈశ్వరునిగా కొలుస్తారు. మీ ఇష్టదేవత ఎవరైతే ఆ రూపంలో భగవంతుణ్ణి ఆరాధిస్తారు. తర్వాత నెమ్మదిగా ఏకరూప ఈశ్వరుని స్థాయినుంచి అరూప ఈశ్వరుని స్థాయికి ఎదుగుతారు. అప్పుడు చైతన్యపరంగా జీవ ఈశ్వర ఐక్యం నేర్చుకుంటారు. అప్పుడు భగవంతునిమీద ఆధారపడే స్థాయినుంచి, మీమీదే మీరు ఆధారపడే స్థాయికి ఎదుగుతారు. ప్రపంచంమీద ఆధారపడే స్థాయినుంచి భగవంతునిమీద ఆధారపడే స్థాయికి ఎదగటం వైరాగ్యం.

మొదటే శాస్త్రం అరూప ఈశ్వరుణ్ణి పరిచయం చెయ్యదు. ముందు భగవంతుణ్ణి సృష్టికర్తగా, స్థితికర్తగా, లయకర్తగా పరిచయం చేస్తుంది. ఆయనను మీకు భిన్నంగా ఉన్నవ్యక్తిగా, సర్వశక్తివంతునిగా, సర్వజ్ఞునిగా చూపిస్తుంది. అంటే ఆయనను పరోక్షంగా చూపిస్తుంది. తర్వాతే ఆ భగవంతుడు ఎవరో కాదు నువ్వే అంటుంది. అహం బ్రహ్మ అస్మి అని మీరు అర్థంచేసుకునేలా చేస్తుంది. కాని ప్రస్తుతం సంసారంనుంచి విముక్తి చెందాలంటే ప్రపంచంమీద ఆధారపడటం మాని, భగవంతునివైపు దృష్టి మరల్చాలి.

బి) **శరణాగతి** – మోక్షమార్గంలో పయనించాలంటే భగవంతుణ్ణి శరణువేడాలి. మనం ఏపని చేపట్టినా, అది దిగ్విజయం కావాలంటే దానికి రెండు అంశాలు తోడ్పడాలి. అవి మానవప్రయత్నం, ఈశ్వర అనుగ్రహం. మనం శ్రద్ధపెట్టి ప్రయత్నం చెయ్యకపోతే ఏమీ జరగదు. 'ఒక మనిషి అరవైనాలుగు గుర్రాలను నీటిదగ్గరకు తీసుకు వెళ్ళగలడు కాని, అరవైనాలుగు మనుష్యులు ఒక్క గుర్రంచేత నీరు త్రాగించలేరు.' అంటే గుర్రం ప్రయత్నం చెయ్యాలి. అది మొండికెత్తితే ఎవరూ ఏమీ చెయ్యలేరు. అలాగే మనం ప్రయత్నం చెయ్యాలి. మనం ప్రయత్నం చెయ్యకపోతే భగవంతుడు కూడా మనకు సహాయం చెయ్యలేడు. అలాగని మన ప్రయత్నం ఒక్కటే చాలదు. దానికి ఈశ్వర అనుగ్రహం తోడవ్వాలి. ఈశ్వర అనుగ్రహం తోడయితే, ఎటువంటి ఆటంకాలు కలగకుండా, మన పని నిర్విఘ్నంగా నెరవేరుతుంది. దానికి శరణాగతి కావాలి.

సి) **వేదాంత విచారణ** – వేదాంత విచారణ అంటే వేదాంతశాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. వాటిని కృష్ణపరమాత్మ **పరిమార్గనం** అన్నాడు. పరిమార్గనం అంటే ఆత్మవిచారణ. ఆత్మవిచారణను శాస్త్రం అనే పరికరం ద్వారా చెయ్యాలి. మనం ఏదైనా అనారోగ్యంతో వెళితే వైద్యుడు దాన్ని తెలుసుకోవటానికి అనేక పరికరాలను వాడతాడు. ఇ.సి.జి., స్కానింగ్, బ్లడ్‌టెస్ట్, ఎక్స్‌రేవంటి పరికరాల్లో అవసరమైనదాన్ని వాడి, రోగనిర్ధారణ చేస్తాడు. ఇక్కడ ఆత్మవిచారణ చెయ్యటానికి పనికివచ్చే పరికరం శాస్త్రప్రమాణము.

అందువల్లనే సందర్భం వచ్చినప్పుడల్లా ఆత్మవిచారణ అంటే వేదాంతశాస్త్రవిచారణ అంటాము. శాస్త్రం అద్దంలాంటిది. మన అందమైన మొహం చూసుకోవాలని ఉంటే, దాన్ని ప్రత్యక్షంగా చూసుకోలేము. అద్దంలోనే చూడాలి. బాహ్యంగా అద్దంలోకి చూస్తున్నట్టు అనిపించినా, నిజానికి మనం చూసేది మన మొహాన్నే. ఎందుకంటే నిజానికి మనం అద్దంలోకి చూస్తున్నా కూడా, కుంకుమ పెట్టుకోవాలంటే అద్దానికి పెడతామా, మన మొహానికి పెడతామా? అద్దంలో చూస్తూ, మన మొహానికి పెట్టుకుంటాము.

అదేవిధంగా శాస్త్రమనే అద్దంలోకి సరియైన గురువుద్వారా చూస్తే, దాన్ని సరిగ్గా చూడటం నేర్చుకున్నకొద్దీ, మన గురించి మనకు లోతుగా అర్థమవుతుంది. శాస్త్రం ఎంతబాగా అర్థమయితే, ఆత్మజ్ఞానం అంతబాగా వంటబడుతుంది. ఆ విధంగా వేదాంతవిచారణ మూడవ సాధన.

డి) **సద్గుణాలు** – మనలో సద్గుణాలు ఉంటే, ఆత్మజ్ఞానం పెంపొందించుకోగలుగుతాము. కెమిస్ట్రీలో కెమికల్ రియాక్షన్స్ గురించి చెప్పేటప్పుడు NTP అంటారు. NTP అంటే Normal Temperature and Pressure. కొన్ని రియాక్షన్లకు మామూలు ఉష్ణోగ్రత ఉండాలి; కొన్నింటికి తక్కువ ఉష్ణోగ్రత ఉండాలి; మరికొన్నింటికి చాలా ఎక్కువ ఉష్ణోగ్రత ఉండాలి.

కెమిస్ట్రీలోనే కాదు, వేదాంతబోధ దిగ్విజయంగా అర్థమవ్వాలంటే దానికి కూడా అనువైన వాతావరణం, ప్రశాంతత ఉండాలి. మనస్సు వేడెక్కిపోయినా, మనస్సు తాకిడికి గురయినా బోధ తలకెక్కదు. ఇక్కడ అనువైన వాతావరణం అంటే సాధనచతుష్టయ సంపత్తి. అక్కడ NTP అంటే ఇక్కడ SCS (Sadhana Chatustaya Sampatti) అందాము. ఇంకోవిధంగా చెప్పాలంటే **సద్గుణాలు**. కొన్ని సద్గుణాలను కృష్ణపరమాత్మే 10, 12, 13వ అధ్యాయాల్లో వివరించాడు. ఇక్కడ కూడా కొన్ని చెబుతాడు.

ఈ నాలుగు సాధనల్లో ఏది ముఖ్యసాధన అని అడిగితే, కృష్ణపరమాత్మ ప్రత్యేకించి చెప్పడు కాని, వేదాంత విచారణే ముఖ్యం. వేదాంతవిచారణ సాక్షాత్ సాధన అయితే, తక్కిన మూడూ సహకారీ సాధనలు అవుతాయి. ఎందుకంటే తక్కినవి మనస్సును సంసిద్ధం చెయ్యటానికి తోడ్పడతాయి. ఒక రోగికి ఆపరేషను చెయ్యాలంటే దాని ముందు కొన్ని ఏర్పాట్లు చెయ్యాలి. అతనికి షుగర్ కంట్రోల్లో ఉండాలి; బి.పి. కంట్రోల్లో ఉండాలి; జ్వరం ఉండకూడదు. ఇవన్నీ సరిపోయాక, 'సరే నువ్వు ఇంటికి వెళ్ళు,' అంటాడా వైద్యుడు? అప్పుడు ఆపరేషను చేస్తాడు. అందువల్ల షుగర్, బి.పి., జ్వరంలాంటి వాటిని అదుపులో పెట్టటం సహకారీ సాధనలు అయితే, ఆపరేషను చెయ్యటం సాక్షాత్తు సాధన. ఆపరేషనువల్ల లోపలవున్న వైరసును లేదా బాక్టీరియాను తొలగిస్తాడు వైద్యుడు.

ఇదే సూత్రాన్ని ఆత్మజ్ఞానానికి అన్వయిస్తే, మనకున్న వైరసు అజ్ఞానం. అజ్ఞానాన్ని జ్ఞానంతోనే తొలగించగలము. ఆ జ్ఞానం వేదాంతవిచారణవల్ల మాత్రమే కలుగుతుంది. సద్గుణాలు ఉంటే అజ్ఞానం తొలగదు. సద్గుణాలు పెంపొందించుకోకముందు దుర్మార్గులైన అజ్ఞానులం అయితే, ఇప్పుడు సన్మార్గులైన అజ్ఞానులం అవుతాము. అంతే భేదం. అందువల్ల సద్గుణాలు అజ్ఞానాన్ని తొలగించలేవు. వైరాగ్యం అజ్ఞానాన్ని తొలగించలేదు. శరణాగతి అజ్ఞానాన్ని తొలగించలేదు. అది ఒక్క శాస్త్రవిచారణవల్ల మాత్రమే తొలుగుతుంది. ఇప్పుడు ఈ నేపథ్యంతో మూడవశ్లోకాన్ని రెండవభాగంనుంచీ చూద్దాము.

ఎ) **వైరాగ్యం – అసంగశస్త్రేణ** – అసంగం అంటే వైరాగ్యం; శస్త్రం అంటే కత్తి లేదా గొడ్డలి.

**దృఢేన ఛిత్త్వా** – దృఢంగా దానిమీద ఆధారపడటాన్ని ఛేదించాలి. దేన్ని ఛేదించాలి?

**ఏనం సువిరూఢమూలమ్ అశ్వత్థమ్** – అశ్వత్థవృక్షం లేదా ఈ సంసారవృక్షంమీద ఆధారపడటాన్ని ఛేదించాలి. ఎటువంటి సంసారవృక్షం?

సువిరూఢమూలమ్ – చాలా లోతుగా పాతుకుపోయిన వేర్లు ఉన్నాయి. ఇలా బలమైన వేర్లతో పాతుకుపోయిన సంసారంమీద ఆధారపడటం చాలా ప్రమాదంతో కూడినది. ఎలాగైతే కార్డుబోర్డు కుర్చీమీద కూర్చోలేమో, అలాగే ఈ ప్రపంచంమీద ఆధారపడలేము. శాంతి, భద్రత, ఆనందాలు కావాలంటే అవి ప్రపంచంలో దొరకవు; భగవంతుడొక్కడే అటువంటి శాంతి, భద్రత, ఆనందాలను అందివ్వగలడు. ఇది మొదటి సాధన. ప్రపంచంమీద ఆధారపడటంనుంచి భగవంతునిమీద ఆధారపడేస్థాయికి చేరుకోవటం. దీన్ని వైరాగ్యం అంటారు. వైరాగ్యం అంటే ద్వేషం కాదు. వైరాగ్యం అంటే పరిపక్వత. వైరాగ్యమనే ఖడ్గంతో సమూలమైన అశ్వత్థవృక్షాన్ని ఖండించి... ఈ వాక్యం పూర్తికాలేదు. తక్కిన మూడు సాధనలు కూడా చెయ్యాలి. ఏమిటవి? రాబోయే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 4 **తతః పదం తత్పరిమార్గితవ్యం యస్మిన్ గతా న నివర్తంతి భూయః ।**
**తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ ॥**
తతః, పదమ్, తత్, పరిమార్గితవ్యమ్, యస్మిన్, గతాః, న, నివర్తంతి, భూయః,
తమ్, ఏవ, చ, ఆద్యమ్, పురుషమ్, ప్రపద్యే, యతః, ప్రవృత్తిః, ప్రసృతా, పురాణీ ॥

| | | | |
|---|---|---|---|
| తతః | = అనంతరము | ప్రవృత్తిః | = సంసారవృక్షపరంపర |
| యస్మిన్ | = ఏ పరమపదమును | ప్రసృతా | = వ్యాపించియున్నదో |
| గతాః | = పొందినవారు | తమ్, ఆద్యమ్, పురుషమ్, ఏవ | = ఆ ఆదిపురుషుడగు పరబ్రహ్మనే |
| భూయః | = మళ్ళీ | ప్రపద్యే | = శరణు పొందుదును |
| న, నివర్తంతి | = తిరిగిరారో | (ఇతి) | = (అను భావముతో) |
| చ | = ఇంకా | తత్, పదమ్ | = ఆ పరమపదమును |
| యతః | = ఏ పరమేశ్వరునినుంచి | పరిమార్గితవ్యమ్ | = వేదాంత విచారణ చేయవలెను |
| పురాణీ | = పురాతనమైన | | |

**తతః యతః పురాణీ ప్రవృత్తిః ప్రసృతా తమ్ ఏవ చ ఆద్యమ్ పురుషమ్ ప్రపద్యే,**

**(ఇతి) తత్ పదమ్ పరిమార్గితవ్యం, యస్మిన్ గతాః భూయః న నివర్తన్తి ॥**

తా: అనంతరము ఏ పరమపదమును పొందినవారు మళ్ళీ తిరిగిరారో, ఇంకా ఏ పరమేశ్వరునినుంచి పురాతనమైన సంసారవృక్షపరంపర వ్యాపించియున్నదో ఆ ఆదిపురుషుడగు పరబ్రహ్మనే శరణు పొందుదును అను భావముతో ఆ పరమపదమును వేదాంత విచారణ చేయవలెను.

**తతః** – తతః అంటే దాని తర్వాత. దాని తర్వాత అంటే దేని తర్వాత? వైరాగ్యం పొందిన తర్వాత. వైరాగ్యం అంటే బలవంతంగా అణగదొక్కటం కాదు; పరిపక్వతతో కూడిన వైరాగ్యం. చిన్నప్పుడు బొమ్మలతో ఆడుకున్నా, వయస్సు పెరిగేకొద్దీ మనకు తెలియకుండానే వాటిమీద మోజు పోతుంది. మనం ప్రత్యేకించి ఏమీ సాధన చెయ్యనవసరం లేదు. అలాగే కంప్యూటర్ గేమ్స్‌మీద మోజు, బిస్కట్లమీద మోజువంటివి నెమ్మదిగా మటుమాయమయిపోతాయి. ఆ విధంగా శారీరక ఎదుగదల సహజంగానే జరుగుతుంది. కాని భావపరమైన ఎదుగుదల కలగటానికి మన ప్రయత్నం తోడవ్వాలి. నిత్యానిత్య వస్తువివేకం చేస్తే సహజంగా వైరాగ్యం కలుగుతుంది. దీనిని వివేకజన్యవైరాగ్యం అంటారు.

అలా మొదటి సాధనలో విజయం పొందాక, రెండవ ఉపాయానికి వెళ్ళాలి. ఉపాయం అంటే సాధన.

**పరిమార్గితవ్యమ్** – పరిమార్గనం అంటే విచారణ. దేనియొక్క విచారణ? సంసారవృక్షానికి మూలకారణం ఏమిటి లేదా అధిష్ఠానం ఏమిటి? ముందే చూసినట్టుగా సంసారవృక్షానికి మూలకారణం బ్రహ్మ. ఆ బ్రహ్మవిచారణ చెయ్యాలి. బ్రహ్మవిచారణ చెయ్యటమంటే కళ్ళుమూసుకుని బ్రహ్మ ఎవరు, బ్రహ్మ ఎవరు అని ప్రశ్నించుకోవటం కాదు; విచారణ అంటే గురుశాస్త్ర ముఖేన వేదాంతవిచారః. అందువల్ల బ్రహ్మవిచారణ అంటే శాస్త్రవిచారణ. శాస్త్రవిచారణ కూడా స్వంతంగా చెయ్యకూడదు. ఒక సమర్థవంతమైన గురువుద్వారానే చెయ్యాలి. ఈ సాధన వివరణలోకి మళ్ళీ వద్దాము. ముందు మూడవ సాధన చూద్దాము. అది రెండవపాదంలో ఉంది చూడండి.

బి) **శరణాగతి** – ప్రతి ఒక్క సాధకుడు కూడా భక్తుడై ఉండాలి. ఈశ్వరభక్తి లేకపోతే, ఎంత మేధస్సు ఉన్నా అది ఆ వ్యక్తిని దీవించదు. బుద్ధి పదునుగా ఉండాలి నిజమే, కాని దానికి భక్తికూడా తోడవ్వాలి. అందువల్లనే భగవద్గీత బోధను కూడా ప్రార్థనాశ్లోకాలతో మొదలుపెడతాము.

**పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయమ్**
**వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్ ।**
**అద్వైతామృతవర్షిణీం భగవతీమ్ అష్టాదశాధ్యాయినీమ్**
**అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ ॥**

నిజంగా ఆ ప్రార్థన అర్థం తెలిసి చేస్తున్నామా లేదా, గుడ్డిగా చదువుతున్నామా అనుకున్నా కూడా అది శరణాగతి మంత్రం. ఇక్కడ ఈ శ్లోకంలో అటువంటి శరణాగతిని చూస్తాము.

**తం పురుషమ్ ఆద్యమ్ ప్రపద్యే** – ఈ మాటలను సాధకుడు భగవంతుణ్ణి సంబోధిస్తూ చెప్పిన శరణాగతి మాటలుగా అర్థం చేసుకోవాలి. ఓ భగవంతుడా, పురుషునిగా పిలవబడుతున్న నీకు నా శరణాగతి.

పురుష పదానికి రెండు అర్థాలున్నాయి.

పురుషః – పూరయతి సర్వమ్ ఇతి పురుషః – సర్వవ్యాపకుడు.

పురే వసతి ఇతి పురుషః – నా హృదయంలో ఉన్నాడు.

ఈ రెండు అర్థాలూ తీసుకోవచ్చు. సర్వవ్యాపకుడైన భగవంతుడు నా హృదయంలో కూడా ఉన్నాడు. ఆ భగవంతుణ్ణి నేను శరణు వేడుతున్నాను. ఆ భగవంతుని వివరాలు ఇంకా ఉన్నాయి. ఏమిటవి?

**యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ** – ప్రవృత్తి అంటే ఉత్పత్తి లేదా సృష్టి. దేని సృష్టి? తైత్తిరీయోపనిషత్తులో ఆ బ్రహ్మనుంచి పంచభూతాలు, చెట్లు, అన్నం, మనిషి వచ్చాయని వస్తుంది. మొట్టమొదట పుట్టింది ఆకాశం. అంటే ఆకాశం కూడా పుట్టిందని అర్థం. ఎప్పుడు సృష్టి జరిగింది? పురాణీ ప్రవృత్తిః – సృష్టి చాలా పురాతనమైనది. అంటే కొన్ని లక్షల సంవత్సరాల ముందు జరిగింది. ప్రసృతా అంటే భగవంతునినుంచి వచ్చింది ఈ సృష్టి. మొత్తం అర్థం కలిపితే, ఈ పురాతనమైన సృష్టి రావటానికి ఎవరైతే మూలకారణమో, ఆ భగవంతుణ్ణి నేను శరణు వేడుతున్నాను.

తతః – దీని అర్థం ముందే చూశాము. తతః అంటే దాని తర్వాత; అంటే వైరాగ్యం పొందాక అని చూశాము. వైరాగ్యం పదాన్ని సాధనచతుష్టయ సంపత్తికి ఉపలక్షణంగా తీసుకోవాలి. అంటే వైరాగ్యం ఒక్కటే చాలదు. సాధనచతుష్టయ సంపత్తిలో ఉన్న నాలుగు లక్షణాలూ ఉండాలి అధికారికి. వాటిని వివేకం, వైరాగ్యం, శమాదిషట్కసంపత్తి, ముముక్షుత్వం అంటారు. ఒకరైతు పొలంలో విత్తనాలను నాటాలంటే వెంటనే నాటడు. ముందుగా పొలాన్ని దున్ని, భూమిని అనువుగా చేసి, అప్పుడు విత్తనాలు నాటుతాడు. అలాగే వేదాంత విచారణ చెయ్యాలంటే సాధకునికి సాధనచతుష్టయ సంపత్తి అనే అధికారిత్వం ఉండాలి. ఈ నియమంతోనే బ్రహ్మసూత్రాలు మొదలవుతాయి. అథాఉ తో బ్రహ్మజిజ్ఞాసా – బ్రహ్మసూత్రాలు 1

వ్యాసాచార్యులవారు రచించిన బ్రహ్మసూత్రాలు వేదాంతశాస్త్రంలోని ప్రస్థానత్రయంలో న్యాయప్రస్థానంగా పేరుపొందింది. 555 సూత్రాలు ఉన్నాయి దానిలో. ఆ ఒక్క సూత్రానికే, ముఖ్యంగా అతః పదానికే విస్తారమైన భాష్యం రాశారు శంకరాచార్యులవారు, తక్కిన ఉపభాష్యకారులు కూడా. అతః అంటేనే అనేక అర్థాలు ఉన్నాయి. ఆ అర్థాలను విశ్లేషించి అతః అంటే దాని తర్వాత అని విశ్లేషించారు శంకరాచార్యులవారు.

దాని తర్వాత అంటే దేని తర్వాత? దానిక్కూడా అనేక వాదోపవాదాలు చేసిన తర్వాత **సాధనచతుష్టయ సంపత్తి అనంతరం** అనే అర్థాన్ని నిశ్చయించారు శంకరులవారు. అంటే మనస్సును సంసిద్ధం చేశాక. నిజానికి మన జీవితంలో మన మతం నిర్దేశించిన అంశాలను చూస్తేనే ఆ విషయం తేటతెల్లమవుతుంది. ప్రతి ఒక్క తంతునూ సంస్కారం అంటుంది వేదం. గర్భాధానసంస్కారం, పుంశవనసంస్కారం, సీమంతసంస్కారం, జాతకర్మ సంస్కారం. సంస్కారం అంటే శుద్ధిచెయ్యటం, సంస్కరించటం. చివరికి పండగల్లో పెట్టే బొమ్మలకొలువు కూడా మనస్సును సంస్కరించేదే. సంస్కారం ఎంత అద్భుతమైన పేరు! అలా సంస్కరించబడిన మనస్సును సంస్కృత అంతఃకరణము అంటారు.

బ్రహ్మసూత్రాల్లోని అతః పదం అర్థమే ఇక్కడ తతః అర్థం. అథ అనకూడదు. తతః అంటే సాధనచతుష్టయ సంపత్తి అనంతరం. అప్పుడేం చెయ్యాలి? ఇప్పుడు మూడవ సాధనకు వెళదాము. అది మొదటిపాదంలో ఉంది.

సి) **వేదాంత విచారణ –** పరిమార్గితవ్యమ్ – పరిమార్గనం అంటే వేదాంతవిచారణ అని చూశాము. ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా శాస్త్రాన్ని గురువుద్వారా అధ్యయనం చెయ్యాలి. బ్రహ్మసూత్రాల్లోని మొదటిసూత్రం– అథాఽతో బ్రహ్మజిజ్ఞాసా అని చూశాము. దాని పూర్తి అర్థం విచారణ తర్వాత ఇలా వస్తుంది.

సాధనచతుష్టయ సంపత్తి అనంతరం, కర్మవల్ల, ఉపాసనవల్ల మోక్షం రాదు కాబట్టి, జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాబట్టి, సమర్థవంతుడైన గురువువద్ద వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి.

స్థూలశరీరం దగ్గర్నుంచి మొదలుపెట్టాలి. స్థూలశరీరం అంటే ఏమిటి? సూక్ష్మశరీరం అంటే ఏమిటి? కారణశరీరం అంటే ఏమిటి? జీవుడెవరు? పరమాత్మ ఎవరు? ఈ శరీరాలకు అతీతంగా ఏదైనా ఉందా? ఇలాంటి ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి శాస్త్రవిచారణలో. బ్రహ్మసూత్రంలో బ్రహ్మజిజ్ఞాసా పదానికి సమానమైన పదం ఇక్కడ కృష్ణపరమాత్మ పరిమార్గనం పదం వేస్తున్నాడు. పరిమార్గితవ్యమ్ అంటే విచారయిత్వమ్. దేని గురించి విచారణ చెయ్యాలి?

**పదమ్** – పదం అంటే బ్రహ్మ గురించిన విచారణ అని చూశాము. పద్యతే ఇతి పదం. అంటే మనిషియొక్క అంతిమలక్ష్యం అవ్వాలి. పదమ్ పదానికి ఇంకొక అర్థం కూడా ఉంది. దాని అర్థం అధిష్ఠానం. ఈ అర్థం ప్రకారం కూడా ఈ విశ్వానికి అధిష్ఠానం బ్రహ్మ. అందువల్ల పదమ్ అంటే బ్రహ్మ అనే అర్థం ఏ విధంగా చూసినా కూడా వస్తుంది. ఈ బ్రహ్మను సంసారవృక్షానికి మూలంగా కృష్ణపరమాత్మ అంతకుముందు శ్లోకంలో వర్ణించాడు.

బ్రహ్మ అనే అంతిమలక్ష్యాన్ని పొందటంవల్ల కలిగే లాభం ఏమిటి? ఇప్పటికే నాకు ఎన్నో లక్ష్యాలు ఉన్నాయి, మీరు నా పట్టికలో ఇంకొకటి అదనంగా కలిపారు అని మీరు అడగవచ్చు. కృష్ణపరమాత్మ ఇదే అంతిమలక్ష్యం;

దీన్ని చేరితే ఇంక వేరే ప్రయాణం లేదు అంటున్నాడు. ఎంతో ప్రయాణం చేసి ఇల్లు చేరాక, ఇంక మీ అంతిమలక్ష్యాన్ని చేరుకున్నట్టే, వేరే ప్రయాణం లేదు. అలాగే బ్రహ్మ అనే ఇల్లు చేరాక, మీ గమ్యం చేరుకున్నారు, వేరే ప్రయాణం లేదు.

అదే తక్కిన గమ్యాల విషయం తీసుకోండి; ఒక లక్ష్యం పూర్తిచేసి, అమ్మయ్య అని మీరు విశ్రాంతి తీసుకునేలోపే అంతవరకూ పొంచివున్న ఇంకొక లక్ష్యం 'నేను ఆలశ్యం చెయ్యను,' అంటూ మీముందుకు దూసుకువస్తుంది. చదువు అయిపోయింది, అమ్మయ్య అనుకునేలోపు ఉద్యోగపు వేట. ఉద్యోగం దొరికింది అనుకునేలోపు పెళ్ళి. పెళ్ళి అయిందని నిశ్చింతగా ఉండేలోపు పిల్లలు. ఆ తర్వాత పిల్లలు సంస్కారవంతులుగా ఎదగాలి, మంచి చదువులు చదవాలి, వారు మంచి ఉద్యోగాలు చేయాలి, పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాలి. సరే, ఇప్పుడన్నా అయిందా? లేదు. వారికి పురుళ్ళు పోయాలి, మనవళ్ళని పెంచి పోషించాలి. ఇది ఒక అంతులేనికథ. ప్రయాణానికి అంతంలేదు. ఈ ప్రయాణం అనాదికాలంగా సాగుతున్నది. కాని బ్రహ్మజ్ఞానం పొందితే అలాకాదు.

**యస్మిన్ గతా** – ఈ గమ్యాన్ని చేరుకున్నాక. ఈ గమ్యం అంటే బ్రహ్మ అనే గమ్యాన్ని చేరుకున్నాక; మోక్షం అనే గమ్యాన్ని చేరుకున్నాక.

**భూయః న నివర్తంతి** – మళ్ళీ సంసారానికి తిరిగివచ్చే ప్రసక్తే లేదు. నిరంతరం కొనసాగుతున్న ఈ సంసారమనే పోరాటం శాశ్వతంగా ముగుస్తుంది. వైకుంఠపాళిని పరమపదసోపానపటము అనికూడా అంటారని చూశాము. పరమపదం పొందితే నిచ్చెన, పాములతో ఆడే ఆట ముగుస్తుంది. అలాగే బ్రహ్మ అనే పరమపదం పొందితే సంసారం అనే ఆట ముగుస్తుంది. దీనితో మూడు సాధనలు ముగిశాయి. ఏమిటవి? వైరాగ్యం, శరణాగతి, వేదాంతవిచారణ. నాలుగవ సాధన తర్వాత మంత్రంలో వస్తుంది.

శ్లో. 5 **నిర్మానమోహా జితసంగదోషా అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః ।**
**ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైః గచ్ఛంత్యమూఢాః పదమవ్యయం తత్ ॥**
నిర్మానమోహాః, జితసంగదోషాః, అధ్యాత్మనిత్యాః, వినివృత్తకామాః,
ద్వంద్వైః, విముక్తాః, సుఖదుఃఖసంజ్ఞైః, గచ్ఛంతి, అమూఢాః, పదమ్, అవ్యయమ్, తత్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| నిర్మానమోహాః | = | దురభిమానమును, మోహమును త్యజించినవారును | సుఖదుఃఖసంజ్ఞైః | = | సుఖదుఃఖములనే |
| జితసంగదోషాః | = | ఆసక్తియనెడి దోషమును జయించినవారును | ద్వంద్వైః | = | ద్వంద్వములనుంచి |
| అధ్యాత్మనిత్యాః | = | పరమాత్మ స్వరూపమునందే నిత్యస్థితులైనవారును | విముక్తాః | = | విముక్తులైనవారును అగు |
| వినివృత్తకామాః | = | ప్రాపంచిక వాంఛలనుంచి పూర్తిగా మరలినవారును | అమూఢాః | = | జ్ఞానులు |
| | | | తత్, అవ్యయమ్ పదమ్ | = | శాశ్వతమైన ఆ పరమపదమును |
| | | | గచ్ఛంతి | = | చేరుదురు |

**నిర్మాన-మోహాః, జితసఙ్గదోషాః, అధ్యాత్మ-నిత్యాః, వినివృత్త-కామాః సుఖ-దుఃఖ-సంజ్ఞైః**
**ద్వన్ద్వైః విముక్తాః, అమూఢాః, తత్ అవ్యయం పదమ్ గచ్ఛన్తి ॥**

తా: దురభిమానమును, మోహమును త్యజించినవారును, ఆసక్తియనెడి దోషమును జయించినవారును, పరమాత్మ స్వరూపమునందే నిత్యస్థితులైనవారును, ప్రాపంచిక వాంఛలనుంచి పూర్తిగా మరలినవారును, సుఖదుఃఖములనే ద్వంద్వములనుంచి విముక్తులైనవారును అగు జ్ఞానులు శాశ్వతమైన ఆ పరమపదమును చేరుదురు.

డి) **సద్గుణాలు** – నాలుగవ సాధన సద్గుణాలు. సద్గుణాలను పెంపొందించుకోవాలి. అవి మోక్షం పొందటానికి యోగ్యతను కలుగజేస్తాయి. ఇప్పటికే పదమూడవ అధ్యాయంలో కొన్ని విలువలను చూశాము.

**అమానిత్వమదంభిత్వమ్ అహింసా క్షాంతిరార్జవమ్ ।**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥** – 13.8

అంతేకాదు, మళ్ళీ పదహారవ అధ్యాయంలో, పదిహేడవ అధ్యాయంలో కూడా చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల ఇక్కడ కొన్ని విలువలను మాత్రమే పేర్కొంటున్నాడు. ఏమిటవి?

**నిర్మానమోహాః** – అన్నిటికన్నా ముందు వినయం పెంపొందించుకోవాలి. కొన్ని విజయాలు సాధించగానే మీకు తెలియకుండానే మీలో గర్వం, దురభిమానం, పొగరు చోటుచేసుకునే ప్రమాదం ఉంది. అంతేకాదు, విజయాలు సాధించగానే మీచుట్టూ ఉన్న కొందరు మిమ్మల్ని ఆకాశానికెత్తేస్తారు. దానితో మీరు కూడా గర్వంతో పొంగిపోయే ఆస్కారం ఉంది. అందువల్ల వినయం ఉండితీరాలని శాస్త్రం ఘోషిస్తున్నది.

వినయం పెంపొందించుకోవటానికి ఒక మార్గం సాష్టాంగనమస్కారం చెయ్యటం. అలా వంగి సాష్టాంగ నమస్కారం చేస్తేనే వినయభావన ప్రకటించినట్టు అవుతుంది. మన శాస్త్రం అటువంటి నమస్కారం భగవంతునికే కాదు, తల్లిదండ్రులకు, పెద్దవారికి, ఆచార్యులకు కూడా చెయ్యమంటుంది.

ఇంకొక పద్ధతి ఒక సామెతను గుర్తుంచుకోవాలి. 'తాడిని తన్నేవాడుంటే, వాడి తలదన్నే వాడుంటాడు.' మీరు మీ రంగంలో ఎంత విజయాన్ని సాధించినాకూడా, మీరు ప్రథమశ్రేణిలో ఉండలేరు. మీకన్నా ఉన్నతంగా ఎవరో ఉంటూనేవుంటారు. ఈ విషయం గుర్తుంచుకుంటే, మీకు తెలియకుండానే, మీలో వినయం చోటు చేసుకుంటుంది.

మరొక పద్ధతి మీరు ఏ రంగంలో రాణించినా, అది భగవంతుడు మీకిచ్చిన కానుక. ఆ కానుక ఎప్పుడు పోతుందో చెప్పలేరు. మీకొక మృదుగంభీరమైన గొంతు ఉంటే, ఒక్క ఐస్‌క్రీమ్ తింటే అది పాడయ్యే ప్రమాదం ఉంది. అలా గొంతు మాత్రమే కాదు, మీలో ఏ శక్తి ఉన్నా, అది భగవంతుని కృపే. భగవద్గీతలోనే పదవ అధ్యాయంలో చూశాము ఎవరిలో ఏ శక్తివున్నా కూడా, అది నా విభూతి మాత్రమే అని కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు. అందువల్ల మీలో ఏ శక్తివున్నా, దాన్ని మానసికంగా భగవంతునికి వెంటనే అర్పించండి.

ఈ రెండు విషయాలు సదా గుర్తుంచుకోండి – మీరు ఎంత ఉన్నతశిఖరాలు ఎక్కినా, మీకన్నా ఒకమెట్టు పైనే ఉంటారు మరెవరో; మీలో ఏ శక్తివున్నా అది భగవంతుని కృప. ఈ రెండు భావనలను మనస్సులో నిలబెట్టుకుని, అవకాశం దొరికినప్పుడల్లా సాష్టాంగనమస్కారం చేస్తూంటే దురభిమానం పెరగదు. పదమూడవ అధ్యాయంలో చెప్పిన **అమానిత్వమ్** అర్థమే **నిర్మానమ్**కి కూడా. నిర్మానమ్ అంటే దురభిమానం లేకపోవటం.

**నిర్మోహాః** – నిర్ పదం రెండుసార్లు వాడాలి. నిర్మానః, నిర్మోహాః అని నిర్మానమోహాః ని విడదీయాలి. నిర్మోహాః అంటే మోహం లేకుండా ఉండాలి. మోహం లేకపోవటం అంటే ఏమిటి? వివేకం చూపించటం.

ప్రతి మనిషి కూడా ఆత్మ, అనాత్మల మేలుకలయిక. అంటే మీలో ఆత్మతత్త్వమూ ఉంటుంది, అనాత్మతత్త్వమూ ఉంటుంది. దయానందస్వామీజీ అద్భుతంగా చెబుతారు, ఒకవ్యక్తి ఆధ్యాత్మికంగా ఎంత ఉన్నతస్థాయిలో ఉన్నా, అతను భోజనం చేసేటప్పుడు అనాత్మతత్త్వమే. అనాత్మని పోషించటానికి, అనాత్మ ఆహారాన్ని తీసుకుంటాడు. ఇందులో ఆత్మప్రమేయం ఏమీలేదు. ఆ విధంగా మీ ఎదుగుదలకు ఆత్మతత్త్వం, అనాత్మతత్త్వం రెండూ తోడ్పడతాయి. అందువల్లనే పురుషార్థాలను నాలుగుగా విభజించింది శాస్త్రం. అర్థకామాలూ ముఖ్యమే, ధర్మమోక్షాలూ ముఖ్యమే. ఏదో ఒకటే చేస్తానంటే కుదరదు. నేను రోజంతా ధ్యానం చేస్తాను, ఆహారం తీసుకోను అంటే అదీ కుదరదంటాడు కృష్ణపరమాత్మ పదహారవ అధ్యాయంలో. రోజంతా ఏమీ తినకుండా, ధ్యానమే చెయ్యాలంటే అది ఇడ్లీ, చపాతీలమీద ధ్యానం అవుతుంది కాని భగవంతునిమీద ధ్యానం అవదు. అందువల్ల నూటికి నూరుపాళ్ళు ఆధ్యాత్మిక చింతనలోనూ గడపకూడదు, నూటికి నూరుపాళ్ళు లౌకిక వ్యవహారాలలోనూ మునగకూడదు. అందువల్ల అర్థకామాలకు సమయం కేటాయించండి; బాగా తినండి, బాగా సంపాదించండి; కాని గీతాబోధకు వెళ్ళటానికి తగినంత సమయాన్ని కేటాయించుకోండి. దానికి మాత్రం సమయం లేదని తప్పించుకోవటానికి ప్రయత్నించకండి. మోహం అంటే ధనార్జన ఒక్కటే నాకు జీవితంలో పరిపూర్ణత్వాన్ని ఇస్తుందంటే పొరపాటు! పైసా మే పరమాత్మా హై అంటారు కొందరు. పైసానూ కావాలి, పరమాత్మా కావాలి. పైసాని పరమాత్మగా కొలవకూడదు. శాస్త్రం డబ్బు సంపాదించవద్దని ఎన్నడూ చెప్పదు; కాని అదే జీవితపరమావధిగా భావించకూడదు అంటుంది.

'కేవలం మీకేముంది అనేది మీ ఆనందానికి కారణం కాకూడదు, మీరేమిటి అన్నది కూడా కారణం కావాలి.' కాని ఈ వాక్యంలో ఒక భాగానికే మీరు ప్రాముఖ్యతనిస్తున్నారు. మీకేముందో చూస్తున్నారు కాని మీరేమిటో పట్టించుకోవటం లేదు. అందువల్ల నిర్మోహాః అంటే ఆధ్యాత్మిక చింతనకు కూడా సమానమైన ప్రాముఖ్యతను ఇవ్వటం.

**జితసంగదోషాః** – సంగ అంటే భావపరంగా అనుబంధం పెంచుకోవటం; దేనికైనా భావపరంగా బానిస అవటం. బాహ్యవస్తువులమీద భావపరంగా ఆధారపడటం చాలా ప్రమాదకరమైన ఆలోచన. ఎందుకంటే బాహ్యప్రపంచం నిరంతరం మారుతూవుంటుంది. మారుతున్న దానిమీద ఆధారపడటం ఆరోగ్యకరమైన పనికాదు; అందువల్ల బాహ్యవస్తువులను వాడండి; కాని వాటిమీద ఆధారపడకండి. కాదు, నేను దేనిమీదైనా ఆధారపడి తీరాలంటే, శాశ్వతమైన దానిమీద ఆధారపడండి. ఈ అధ్యాయంలోనే ఆ అంశాన్ని చూశాము. ప్రపంచంమీద ఆధారపడేస్థాయినుంచి భగవంతునిమీద ఆధారపడేస్థాయికి ఎదగండి.

జితసంగదోషాః అంటే భగవంతునిమీద ఆధారపడటం నేర్చుకున్నవారు. వారు మనుష్యులమీద, వస్తువులమీద, పరిస్థితులమీద ఆధారపడకుండా ఉండగలగటం నేర్చుకున్నారు. ఇలా బాహ్యవస్తువులమీద ఆధారపడకుండా, మనస్సును నిగ్రహించుకోగలగటం కష్టమే; కాని అసాధ్యం మాత్రం కాదు. దానికి సాధన చెయ్యాలి. నిజానికి శాస్త్రం విధించిన వ్రతాల వెనకనున్న సదుద్దేశం అదే. ఏకాదశికో, శివరాత్రికో ఉపవాసం ఉండాలంటే, ఆరోజు ఆహారంవైపు ప్రలోభపడకుండా ఉంటారు. అయ్యప్పదీక్ష తీసుకుంటారు కొంతమంది. ఆ మండలం రోజులు వారు అంతకుముందు ఇష్టంగా చేసే ఎన్నో పనులకు దూరంగా ఉంటారు.

అలా దేనికి బానిస అవుతున్నారో, దాన్నించి దూరం తొలిగే మార్గాన్ని పాటించాలి; మీరు ఒకవేళ కాఫీగత ప్రాణులు అయితే, ఒకపూట కాఫీ మానేసి చూడాలి; సెల్‌ఫోన్ లేకుండా క్షణం గడవకపోతే, ఒకరోజంతా దానికి దూరంగా ఉండిచూడాలి. జితసంగదోషాః అంటే బంధవిముక్తి.

**వినివృత్తకామాః** – కొత్త బంధాలను పెంచుకోకూడదు. జితసంగదోషాః అంటే ఉన్న బంధాన్ని తెంచుకోవటం; వినివృత్తకామాః అంటే కొత్త బంధాన్ని పెంచుకోకపోవటం. కొంతమంది ఒక వ్యసనం వదులుకోవటానికి ఇంకొక వ్యసనానికి లోనవుతారు. సిగరెట్టు మానుకోవాలంటే పాన్‌పరాగ్‌కి బానిస అవుతారు. **ముల్లుపోయి, కత్తివచ్చే ఢాంఢాం** అన్నట్టు అవుతుంది. ఒక వ్యసనంనుంచి ఇంకో వ్యసనానికి బానిస అయితే, అది దీనంత చెడు వ్యసనం అవుతుంది, ఒక్కోసారి దీనికన్నా హానికరం కూడా అవుతుంది. అందువల్ల వినివృత్తకామాః అంటే కొత్త వ్యసనాలకు బానిస కానివారు.

**ద్వంద్వైర్విముక్తాః** – ద్వంద్వాలకు అతీతంగా ఎదిగినవారు. జీవితంలో భిన్న అనుభవాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకసారి ఐశ్వర్యంలో తులతూగితే, ఇంకొకసారి బీదరికం అంచులు చూడాల్సిరావచ్చు; ఒకసారి ఆరోగ్యంతో మిలమిల మెరిసిపోతే, ఇంకొకసారి పక్క దిగలేని దయనీయ పరిస్థితి ఏర్పడవచ్చు; ఒకసారి విజయశిఖరాలను అధిగమిస్తే, ఇంకొకసారి పరాజయమనే అగాధంలో పడిపోవచ్చు; ఒకసారి ఎవరైనా ఆకాశానికెత్తితే, ఇంకొకసారి ఇంకొకరు పాతాళంలోకి తోసివేయవచ్చు. అందువల్ల జీవితమనేది రెండు భిన్నాల మేలుకలయిక. ఈ భిన్నాల జంటను ద్వంద్వం అంటారు సంస్కృతంలో. సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు, మానావమానాలు. ఇలా ఎన్నో విభిన్నజంటలు మనను జీవితంలో ముంచెత్తుతుంటాయి.

పురాణగాథలను మనకు ఉగ్గుపాలతో నూరిపోసేది అందుకే. పురాణాల్లో ఎవరి గాథ తీసుకున్నా వారేమీ ఈ ద్వంద్వాలకు అతీతం కాదు. శ్రీరామునికి ఉన్నట్టుండి పట్టాభిషేకం చేస్తామన్నారు; మరికాసేపటికే రాజ్యం వదిలేసి అరణ్యాలకు వెళ్ళాలన్నారు. రెండూ సమానంగా స్వీకరించాడు శ్రీరాముడు. శ్రీరాముడు రాజ్యభోగాలూ అనుభవించాడు, వనవాసంలో కందమూలాలు తినీ జీవించాడు; ధర్మరాజూ అంతే. రాజ్యభోగాలు అనుభవించాడు, అజ్ఞాతవాసం కూడా చేశాడు. నలమహారాజు చాలా అవస్థలు పడ్డాడు; అంతటి మహామహులకే జీవితంలోని హెచ్చుతగ్గులు తప్పకపోతే, మానవమాత్రులం మనమెంత?

**అవశ్యంభావిభావానాం ప్రతికారో భవేద్ యది**
**తదా దుఃఖైర్న లిప్యేరన్ నలరామయుధిష్ఠిరాః**

నలునికి, రామునికి, ధర్మరాజుకే సుఖదుఃఖాలను ఎదుర్కోక తప్పనప్పుడు, మామూలు మనుష్యులం మనమెంత? మనం కూడా మన మనస్సును దిటవుపరుచుకోవాలి. దీన్ని షాక్ అబ్‌సార్బర్ అంటారు. దాన్ని వివేకంతోనూ, భక్తితోనూ ఏర్పరచుకోవాలి.

ఈ షాక్ అబ్సార్బర్ పూర్తిగా స్పందించకుండా చెయ్యలేదు కాని, ఆ స్పందనలోని తీవ్రతను తగ్గిస్తుంది. అంటే అనుకోని పరిస్థితి ఎదురైనప్పుడు పిచ్చెక్కకుండానూ, ఆత్మహత్య చేసుకునే భావన రానీకుండానూ అడ్డుపడుతుంది. బాధ, దుఃఖం కలగవచ్చు కాని అది భరించలేనంత బాధ, దుఃఖాలుగా ఉండదు. అందువల్ల ద్వంద్వైర్విముక్తిః అంటే ద్వంద్వాలకు అతీతంగా ఎదగాలి.

**సుఖదుఃఖసంజ్ఞైః** – సుఖదుఃఖాలనే ద్వంద్వాలను సమానంగా తీసుకోవాలి. గడ్డురోజులు ఎదురైతే, గట్టి మనస్సుతో ముందుకుసాగాలి.

**యథా కందుకపాతేన ఉత్పతత్యార్యః పతన్నపి।**
**తథా త్వనార్యః పతతి మృత్పిండిపతనం యథా॥**

మనుష్యులను రెండు తెగల బంతుల కింద విభజిస్తున్నది ఈ శ్లోకం. ఒకటి తడిమట్టిముద్దతో చేసిన బంతి, రెండవది రబ్బరుబంతి. రెండు బంతులను కిందికి విసిరారనుకోండి, ఏమవుతుంది? తడిమట్టిముద్దతో చేసిన బంతి కిందపడ్డాక కిందనే ఉండిపోతుంది. అది మళ్ళీ పైకి లేవలేదు. కాని రబ్బరుబంతి కిందపడగానే పైకి లేస్తుంది. నిజానికి దాన్ని ఎంత బలంగా కిందికి కొడితే, అంతకు రెట్టింపు బలంతో అది పైకి లేస్తుంది.

మీరు ఏ బంతిలా ఉందామనుకుంటున్నారో మీరే తేల్చుకోండి. ఏదైనా దుఃఖం కలిగినా మళ్ళీ దాన్నించి బలం పుంజుకోండి. సుఖదుఃఖసంజ్ఞైః అంటే సుఖదుఃఖాలను సమానంగా తీసుకోవటం.

**అధ్యాత్మనిత్యాః** – నిత్యమూ ఆధ్యాత్మగ్రంథాలను పఠించాలి. ఈ గ్రంథాలను అధ్యయనం చేస్తే నిజానికి ఈ విలువలను పెంచిపోషిస్తారు. ఎలాగైతే శారీరక ఆరోగ్యానికి ప్రతిరోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలో, అదేవిధంగా మానసిక ఆరోగ్యానికి పౌష్టికాహారం ఇటువంటి ఆధ్యాత్మిక గ్రంథాలు. దాని బదులు పుకార్లను పుట్టించే వార్తలు చదివితే, జంక్‌ఫుడ్ తిన్నట్టే అవుతుంది. ఆధ్యాత్మిక గ్రంథాలు అంటే ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. రోజూ భగవద్గీతను చదవండి, చదివించండి, ఇంకొకరికి బోధ చెయ్యండి, మీకు తెలిసిన జ్ఞానాన్ని నలుగురితో పంచుకోండి. పంచుకోవటానికి ఎవరూ దొరకకపోతే, ఎవరినైనా ఇంటికి పిలిచి, వారికి వేడివేడి కాఫీ ఇవ్వండి. ఆ కాఫీ తాగటానికి వారికి కాస్త సమయం పడుతుంది కదా. ఆలోపు మీరు చెప్పాలనుకున్నది చెప్పేయండి. అధ్యాత్మనిత్యాః అంటే నిత్యమూ ఆధ్యాత్మగ్రంథాలను పారాయణం చెయ్యటం.

ఎవరైతే ఈ విలువలను, తక్కిన సాధనలైన వైరాగ్యం, శరణాగతి, వేదాంతవిచారణలతో కలిసి పాటిస్తారో వారికి కలిగే ఫలమేమిటో కూడా వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**అమూఢాః** – ఈ నాలుగు సాధనలనూ పాటించినవారు అమూఢులు అవుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మోహం అంటే అజ్ఞానం; మూఢః అంటే అజ్ఞాని; అమూఢః అంటే అజ్ఞాని కానివాడు. అజ్ఞాని కానివాడు అంటే జ్ఞాని లేదా స్థితప్రజ్ఞుడు.

**తత్పదమ్ గచ్ఛంతి** – అటువంటి జ్ఞానులు బ్రహ్మపదం చేరుకుంటారు అంటే మోక్షం పొందుతారు. అది ఎటువంటి పదం?

**అవ్యయమ్** – శాశ్వతం. జ్ఞానం ఎన్నడూ పోదు. ధనాన్ని ఇంకొకరితో పంచుకుంటే అది తగ్గిపోతుంది కాని జ్ఞానమనే ధనాన్ని ఇంకొకరితో పంచుకుంటే అది రెట్టింపు అవుతుంది. ఒకవేళ జ్ఞానాన్ని పంచుకుంటే, అది తగ్గిపోయేటట్టయితే, స్వామీజీ గీతాబోధ పదిహేనుసార్లుపైనే చేసివుంటారు. కాని ఆయన జ్ఞానం ఏమీ తగ్గలేదు సరికదా, అంతకంతకూ ఎక్కువవుతోంది.

**న చోరహార్యం న చ రాజహార్యం న భ్రాతృభాజ్యం న చ భారకారి।**
**వ్యయేకృతే వర్ధత ఏవ నిత్యం విద్యాధనం సర్వధన ప్రధానమ్॥**

విద్య అనే సంపద ఉంటే దాన్ని దొంగలు ఎత్తుకుపోతారనే భయంలేదు, ఖర్చుపెడితే కరిగిపోతుందనే భయం లేదు. ఎందుకంటే జ్ఞానాన్ని పంచుకున్నకొద్దీ అది వృద్ధి చెందుతుంది. అందువల్ల మోక్షఫలం అవ్యయం.

అవ్యయమ్ అంటే కాలాతీతం; కాలంయొక్క కోరల్లో చిక్కనిది. ఈ కాలాతీత పదం మరేదో కాదు బ్రహ్మ. మొదటిశ్లోకంలో బ్రహ్మను జగత్తుకు అధిష్ఠానంగా వర్ణిస్తే, ఇప్పుడు బ్రహ్మను సాధకుడు చేరే అంతిమలక్ష్యంగా అభివర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏదైతే జగత్తు అంతటికీ అధిష్ఠానమో అదే సాధకుడు చేరాల్సిన అంతిమగమ్యం కూడా అవ్వాలి. పదం పదానికి ఈ రెండు అర్థాలు సరిపోతాయి. బ్రహ్మ జగత్తుకు అధిష్ఠానం, బ్రహ్మ లక్ష్యం కూడా. బ్రహ్మప్రాప్తి పొందుతాడు అంటే మోక్షప్రాప్తి పొందుతాడని అర్థం.

శ్లో. 6 **న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః ।**
**యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥**
న, తత్, భాసయతే, సూర్యః, న, శశాంకః, న, పావకః,
యత్, గత్వా, న, నివర్తంతే, తత్, ధామ, పరమమ్, మమ ॥

| | | | |
|---|---|---|---|
| యత్ | = ఏ పరమపదమును | న భాసయతే | = ప్రకాశింపజేయజాలడు |
| గత్వా | = పొంది | శశాంకః | = చంద్రుడు |
| న, నివర్తంతే | = మనుష్యులు ఈ లోకమునకు తిరిగిరారో | న, (భాసయతే) | = ప్రకాశింపజేయజాలడు |
| | | పావకః | = అగ్నియును |
| తత్ | = అట్టి స్వయంప్రకాశస్వరూపమైన పరమపదమును | న, భాసయతే | = ప్రకాశింపజేయజాలడు |
| | | తత్ | = అదియే |
| సూర్యః | = సూర్యుడు | మమ, పరమమ్, ధామ | = నా పరంధామము |

**న సూర్యః, న శశాఙ్కః, న పావకః (చ) తత్ (పదం) భాసయతే ।**
**యత్ గత్వా న నివర్తన్తే తత్ మమ పరమమ్ ధామ ॥**

తా: ఏ పరమపదమును పొంది మనుష్యులు ఈ లోకమునకు తిరిగిరారో, అట్టి స్వయంప్రకాశస్వరూపమైన పరమపదమును సూర్యుడు ప్రకాశింపజేయజాలడు, చంద్రుడు ప్రకాశింపజేయజాలడు, అగ్నియును ప్రకాశింపజేయజాలడు. అదియే నా పరంధామము.

**బ్రహ్మలక్షణ శ్లోకం**

ముందు శ్లోకంలో నాలుగు సాధనలను పాటించిన సాధకుడు అవ్యయమైన బ్రహ్మపదాన్ని పొందుతాడని చెప్పాడు కృష్ణపరమాత్మ. ఆ బ్రహ్మ అధిష్ఠానం, అంతిమలక్ష్యం అనికూడా చూశాము. అటువంటి అధిష్ఠానం, అంతిమలక్ష్యం అయిన బ్రహ్మలక్షణం ఏమిటి?

ఈ శ్లోకాన్ని బ్రహ్మలక్షణశ్లోకం అనవచ్చు. ఎందుకంటే ఈ శ్లోకం బ్రహ్మస్వరూపాన్ని వర్ణిస్తుంది. ఇటువంటి శ్లోకాలు చాలా ముఖ్యమైనవి.

**నాన్తః ప్రజ్ఞం న బహిః ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం నప్రజ్ఞానఘనం నప్రజ్ఞం నాఽప్రజ్ఞమ్।**
**అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచిన్త్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం**
**ప్రపఞ్చోపశమం శాన్తం శివమద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మా స విజ్ఞేయః॥** – మాండూక్యం 7

ఇది కూడా బ్రహ్మలక్షణ శ్లోకమే. ఇది మాండూక్యోపనిషత్తులో తురీయాన్ని నిర్వచిస్తుంది. తురీయం అంటే వేరే ఏదో కాదు, బ్రహ్మే. ఇప్పుడు ఈ భగవద్గీత శ్లోకం అలా బ్రహ్మలక్షణశ్లోకం. ఇది వివరించటానికి కృష్ణపరమాత్మ ఉపనిషత్తులనుంచి చాలా ముఖ్యమైన మంత్రాన్ని ఆధారంగా తీసుకున్నాడు. ఉపనిషత్తులు అని ఎందుకన్నామంటే, ఒకే మంత్రం, అక్షరం పొల్లుపోకుండా ముండకోపనిషత్తులోనూ, కఠోపనిషత్తులోనూ ఉంది.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః**
**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్** – ధ్యానశ్లోకం 6

భగవద్గీతను కృష్ణపరమాత్మ స్వంతంగా బోధించటం లేదు; ఉపనిషత్తుల సారం చెబుతున్నాడు. ఉపనిషత్తులనే ఆవునుంచి సారాన్ని పిండి, అర్జునుడు అనే దూడకు అందిస్తున్నాడు. కృష్ణపరమాత్మే సందర్భం వచ్చినప్పుడు ఇది వేదాలసారం అని చెబుతూనే ఉన్నాడు. కఠోపనిషత్తు మంత్రాలను ఎక్కువగా చూస్తాము గీతలో. కొన్ని శ్లోకాలు అయితే ఇంచుమించుగా ఉపనిషత్తులో ఉన్నట్టే ఉంటాయి.

ఇప్పుడు చూడబోయే మంత్రాన్ని ఆలయాల్లో దీపారాధన చేసేటప్పుడు పఠిస్తారు.

**న తత్ర సూర్యో భాతి న చన్ద్రతారకం నేమా విద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః**
**తమేవ భాన్తమనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభాతి** – కఠ 2.2.15

ఈ మంత్రం బ్రహ్మ నిర్వచనానికి అద్భుతమైన మంత్రం. ఈ నిర్వచనం అర్థం, బ్రహ్మను ఏ ప్రమాణంతోనూ ఆబ్జెక్టుగా తెలుసుకోలేము. బ్రహ్మను ఏదీ ప్రకాశింపజేయలేదు. ఈ అర్థాన్ని వివరించటానికి ఉపనిషత్తు జ్యోతి ఉదాహరణ తీసుకుంది.

జ్యోతికి సాంకేతిక అర్థం– జ్యోతి సమక్షంలో వస్తువులు తెలిసి ఆ జ్యోతి లేకపోతే వస్తువులు తెలియక పోవటం. ఉదాహరణకు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు. అందువల్ల జ్యోతి అంటే స్వయంప్రకాశకజ్యోతి.

సూర్యుడు ఒక స్వయంప్రకాశకజ్యోతి. సూర్యుడు అన్నింటినీ ప్రకాశింపజేస్తాడు. తనను తాను ప్రకాశింప జేసుకుంటాడు. అంటే **సూర్యుడు ఒక జ్యోతి**. కాని అంత స్వయంప్రకాశకజ్యోతి కూడా గుడ్డివానికి తెలియదు. కన్ను అనే ఇంద్రియం పనిచేస్తేనే బయట జ్యోతి తెలుస్తుంది. జ్యోతి అంటే ఏమన్నాం? జ్యోతి సమక్షంలో వస్తువులు తెలిసి, ఆ జ్యోతి లేకపోతే వస్తువులు తెలియకపోవటం అన్నాం. అలా చూస్తే **కన్ను ఒక జ్యోతి**.

ఇదే భావం తక్కిన ఇంద్రియాలకు కూడా వర్తిస్తుంది. చెవి అనే ఇంద్రియం పనిచెయ్యకపోతే ఏ ధ్వనీ వినిపించదు. చెవిటివాని ముందు శంఖం ఊదినట్టు అన్న సామెత ఉండనే ఉంది. చెవి పనిచెయ్యకపోతే ఏదైనా ప్రసంగానికి వెళ్ళి మాత్రం లాభమేమిటి? అలా **ఇంద్రియాలు ఒక జ్యోతి.**

ఇంద్రియాలు ఎలా పనిచేస్తాయి? వాటి వెనుక మనస్సు ఉంటేనే పనిచేస్తాయి. ఒక ప్రసంగానికి వెళ్ళి, అయ్యో గ్యాస్ కట్టేసానా లేదా అని మనస్సు కల్లోలంలో పడిపోతే, ఆ ప్రసంగం అర్థంకాదు. అందుకే చూడండి, ఖంగారులో ఏదైనా వస్తువు వెతుకుతుంటే, అది ఎదురుగా ఉన్నా కూడా కనబడదు. ఎందుకు? మన మనసు కుదురుగా లేదు. అంటే ఇప్పుడు **మనస్సు ఒక జ్యోతి**.అదేవిధంగా **వాక్కు ఒక జ్యోతి.** వాక్కు శబ్దప్రమాణం అవుతుంది.

ఎన్ని జ్యోతులో చూడండి. సూర్యుడు ఒక జ్యోతి. దాన్ని చూసే కన్ను (ఇంద్రియాలు) ఒక జ్యోతి. దాని వెనుక నడిపించే మనస్సు మరో జ్యోతి. మనస్సు తనంతట తాను చూడగలదా? ఇది కూడా జడమే. పంచభూతాలతో చేయబడింది. మనస్సనే జ్యోతిని ప్రకాశింపజేసేది ఇంకోటుంది. ఏమిటది? అది ఆత్మజ్యోతి, **చైతన్యజ్యోతి**. ఇది దేనివల్ల ప్రకాశిస్తోంది? దీనివెనుక ఇంకో జ్యోతి లేదు. అందుకని ఇది **ఒక** జ్యోతి అనకూడదు. ఇదే జ్యోతి. **ఇది స్వయంప్రకాశక జ్యోతి.** ఇది తనంతట తాను ప్రకాశిస్తూ, తక్కిన వాటిని ప్రకాశింపజేస్తుంది. ఇప్పుడు వెనకనుంచీ ముందుకు వెళితే ఆత్మజ్యోతి మనస్సుని ప్రకాశింపజేస్తే, మనస్సు ఇంద్రియాలను ప్రకాశింపజేస్తే, ఇంద్రియాలు బాహ్యంగా ఉన్న జగత్తుని ప్రకాశింపజేస్తాయి. అంటే ఒక్క చైతన్యం అన్నింటినీ ప్రకాశింపజేస్తోంది. అందుకే అది జ్యోతిషాం జ్యోతిః అయింది.

ఇందాక చూసినట్టుగా సూర్యుడు ఒక జ్యోతి. కన్ను, మనస్సు, వాక్కు జ్యోతులు. అవి ప్రమాణాలు అవుతాయి. ప్రమాణం ద్వారా ప్రమాత తెలుసుకునేదాన్ని ప్రమేయం అంటారు. ఒక వస్తువుగా, ఆబ్జెక్టుగా తెలుసుకునేదాన్ని ప్రమేయం అంటారు. కాని బ్రహ్మ ప్రమేయం కాదు. అందువల్ల ప్రమాణానికి అందదు.

బ్రహ్మలక్షణం –

**అప్రమేయం బ్రహ్మ; సర్వప్రమాణ అగోచరం బ్రహ్మ**

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి** – కేనోపనిషత్తు

బ్రహ్మ తెలిసిన ఆబ్జెక్టు కాదు, తెలియని ఆబ్జెక్టు కాదు. అంటే ఏమిటి అర్థం? బ్రహ్మ అసలు ఆబ్జెక్టే కాదు. బ్రహ్మ ఆబ్జెక్టు కాదని వినగానే కలిగే మొదటి సందేహం, అయితే అసలు బ్రహ్మ ఉన్నాడా? బ్రహ్మ పంచజ్ఞానేంద్రియాలకూ అందక, పంచకర్మేంద్రియాలకూ అందక, తర్కప్రమాణానికి కూడా అందకపోతే అసలు అటువంటి బ్రహ్మ ఉన్నాడా, లేడా? కుందేటికొమ్ము, ఆకాశపుష్పాలులాగా బ్రహ్మ లేడా? ఉపనిషత్తులు బ్రహ్మ ఖచ్చితంగా ఉన్నాడు అంటున్నాయి.

బ్రహ్మ ఆబ్జెక్టు కాదు, కాని బ్రహ్మ ఉన్నాడు. అయితే ఆ బ్రహ్మ ఎవరు? బ్రహ్మకు ఉనికి ఉండి, బ్రహ్మ ఆబ్జెక్టు కాకపోతే ఆ బ్రహ్మ ఎవరంటే దానికి ఒక్కటే జవాబుకి ఆస్కారం ఉంది. ఆ బ్రహ్మను నేనే; సాక్షిచైతన్యమైన నేను. ఈ చైతన్యంవల్లనే అన్నీ చూస్తాను కాని, చైతన్యాన్ని చూడలేను; ఈ చైతన్యంవల్లనే అన్నిటినీ అనుభవిస్తాను కాని, చైతన్యాన్ని అనుభవించలేను.

**అదృష్టో ద్రష్టాఽ శ్రుతశ్శ్రోతాఽ మతో మంతాఽ విజ్ఞాతో విజ్ఞాతా** – బృహదారణ్యకోపనిషత్తు

| | |
|---|---|
| అదృష్టోద్రష్టాః | – చైతన్యం ఎప్పటికీ చూసేది కాని చూడబడేది కాదు |
| అశ్రుతః శ్రోతాః | – చైతన్యం ఎప్పటికీ వినేది కాని వినబడేది కాదు |
| అమతో మంతాః | – చైతన్యం ఎప్పటికీ ఆలోచించేది కాని ఆలోచన కాదు |
| అవిజ్ఞాతో విజ్ఞాతాః | – చైతన్యం ఎప్పటికీ తెలుసుకునేది కాని తెలియబడేది కాదు |

బృహదారణ్యకోపనిషత్తు ప్రత్యేకత ఏమిటంటే అన్ని ఉపనిషత్తుల సారమూ అందులో ఉంటుంది; ఏ ఉపనిషత్తులో లేని అంశాలు అందులో వివరంగా వస్తాయి. బ్రహ్మను ప్రమేయంలాగా చూడలేము, వినలేము, ఆలోచించలేము, తెలుసుకోలేము. ఒక్కముక్కలో చెప్పాలంటే బ్రహ్మ చైతన్యతత్త్వం. అది జడాన్ని ప్రకాశింపజేస్తుంది కాని, జడంవల్ల చైతన్యతత్త్వం ప్రకాశించదు. బ్రహ్మవల్ల వస్తువు గురించి తెలుస్తుంది కాని వస్తువువల్ల బ్రహ్మ తెలియదు. బ్రహ్మలక్షణం ఏమిటి?

చైతన్యస్వరూపం బ్రహ్మ; చిద్రూపం బ్రహ్మ; సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ.

అంతకుముందు ఏమన్నాం? ఆత్మను జ్యోతిషాం జ్యోతిః అన్నాం. అంటే ప్రకాశవంతమైనవన్నీ జ్యోతివల్లే ప్రకాశిస్తున్నాయి అన్నాం. ఇప్పుడు మళ్ళీ దాన్ని ఎలా చూస్తామని అడిగితే చంద్రకాంతిద్వారా సూర్యకాంతిని చూడటానికి ప్రయత్నించినట్టు ఉంటుంది. చంద్రుడు వెన్నెల కురిపిస్తున్నాడంటే, సూర్యకాంతి వల్లే అని మనకు తెలిసిన విషయమే.

ఇప్పుడు ఆత్మజ్యోతి విషయానికొస్తే జ్యోతి పదం ఉంది కాబట్టి మనం జ్యోతిలాగా ఇది కూడా ఒక జ్యోతి అనీ, ధ్యానంలో కూర్చుంటే ఒక కాంతిలాగా కనబడతుంది అనీ అనుకుంటాం. కాని ఆత్మను ప్రకాశింపజేసే

కాంతిలేదు. అందుకే ఈ మంత్రంలో కొన్ని శక్తివంతమైన జ్యోతులను తీసుకోవటం జరిగింది. ఇవి వేరే వాటిని చూపిస్తాయి కాని ఆత్మను చూపలేవు.

**న తత్ర సూర్యో భాతి** – సూర్యకాంతి శక్తివంతమైనది. అన్నింటినీ ప్రకాశింపజేస్తుంది. కాని ఆత్మని ప్రకాశింపజేయలేదు.

**న చన్ద్ర తారకమ్** – చంద్రుడు, నక్షత్రాలు కూడా ఆత్మను ప్రకాశింపజేయలేవు. చంద్రుణ్ణే సూర్యుడు ప్రకాశింపజేస్తున్నప్పుడు, చంద్రుడెలా ఆత్మను ప్రకాశింపజేయగలడు?

**నేమా విద్యుతో భాన్తి** – వేలాది మెరుపులు కలిసినా ఆత్మని ప్రకాశింపజేయలేవు.

**కుతోఽయమగ్నిః** – అగ్నిమాటో? అగ్ని గురించి చెప్పేదేం ఉంది? దీన్ని కౌముతిక న్యాయం అంటారు.

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, మెరుపు, అగ్ని – ఈ ఐదూ బాహ్యమైన పంచజ్యోతులు. ఇవే ఆత్మను ప్రకాశింప జేయలేనప్పుడు, మనకున్న పంచేంద్రియాలు ఏం చేయగలవు?

**న తత్ర చక్షుః గచ్ఛతి న వాక్ గచ్ఛతి నో మనః** – కేన 1.3

ఇంద్రియాలే కాదు, మనస్సు కూడా ఆత్మను చేరుకోలేదు. అంటే ప్రమాణగోచరం కాదు.

మొదటి రెండు పాదాల సారాంశం – ఆత్మను ప్రమాణాలేవీ చూపించలేవు. ధ్యానంలో మనస్సనే ప్రమాణాన్ని వాడతాము. కాని ఆత్మను దానితో చూడలేము. అందుకే ఆత్మ అప్రమేయం. సర్వప్రమాణ అగోచరం. ఎందుకు? అన్నీ ఆత్మవల్లే ప్రకాశింపబడుతున్నాయి. ప్రకృతి సూత్రం – ప్రకాశింపజేసేది వేరే దానిచేత ప్రకాశింపబడదు. సూర్యకాంతి కుర్చీని ప్రకాశింపజేస్తోంది; కాని కుర్చీ, సూర్యకాంతిని ప్రకాశింపజేయలేదు.

**దృగేవ న తు దృశ్యతే** – దృక్‌దృశ్యవివేకమ్

వేరే ఏవీ ప్రకాశింపజేయలేవు అంటే ఆత్మను ఎలా తెలుసుకుంటాం?

ఆత్మ కర్మ కాదు, ఆత్మ కర్త. ఆత్మ ఆబ్జెక్టు కాదు, ఆత్మ సబ్జెక్టు. ప్రమాణంతో తెలుసుకునే బాహ్యవస్తువు కాదు. ప్రమాణం వెనకనున్న నేనే.

అందువల్ల ఆత్మ ప్రమాణానికి అటువైపు ఉన్నది కాదు. ప్రమాణాల వెనకనున్న నేను. ఇప్పుడు ఆత్మ గురించి ముందు చెప్పిన పదాలకు ఆత్మ అన్న మాట తీసి నేను అని కలపాలి.

నేను బ్రహ్మను. నేను విరజం. నేను నిష్కళం. నేను శుభ్రం. నేను జ్యోతిషాం జ్యోతి.

నేను మనస్సును ప్రకాశింపజేస్తే, అది ఇంద్రియాలను ప్రకాశింపజేస్తే, అవి బాహ్యప్రపంచాన్ని ప్రకాశింపజేస్తాయి. అన్నిటి వెనకా ఉన్నది ఎవరు? నేను! సుషుప్తిలో శరీరం, ఇంద్రియాలు, మనస్సు– అన్నీ నిద్రపోతాయి. మిగిలేది శుద్ధచైతన్యం మాత్రమే. జాగ్రదావస్థలో మనస్సు మేలుకుంటుంది (నేను మేలుకుంటాను అనకూడదు). నేను మనస్సుని ప్రకాశింపజేస్తే, మనస్సు ఇంద్రియాలను ప్రకాశింపజేస్తే, ఇంద్రియాలు ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తాయి. నేను నిర్వికారం. ఈ విషయం జీర్ణమయ్యేవరకూ శ్రవణం చేస్తూనే ఉండాలి.

**తమేవ భాన్తమ్** – తనని తనే ప్రకాశింపజేసుకుంటుంది.

**అనుభాతి సర్వమ్** – అంతటినీ ప్రకాశింపజేస్తుంది. అంటే ఆత్మ స్వ, పర ప్రకాశకం.

**తస్య భాసా** – (మమ వేసుకోవాలి) ఆ (నా) చైతన్యకాంతివల్లే.

**సర్వమిదం విభాతి** – అన్నీ ప్రకాశిస్తున్నాయి. ఉన్నదొక్కటే కాంతి – జ్యోతిషాం జ్యోతి. ఆ జ్యోతిషాం జ్యోతిని నేనే.

ఈ మంత్రాన్ని దీపారాధన సమయంలోను, హారతి సమయంలోనూ ఎందుకు వాడతాము? మన తెలివితక్కువతనాన్ని చూపించుకోవటానికి వాడతాము. ఓ భగవాన్, నువ్వు జ్యోతులకే జ్యోతివి. ఇంత గొప్ప జ్యోతివైన నిన్ను ఇంత చిన్న కర్పూరపు జ్యోతిలో ప్రకాశింపజేద్దామనుకుంటున్నాను. నిజానికి, కర్పూరపు కాంతి నిన్ను ప్రకాశింపజేయలేదు. నువ్వే ఆ అగ్నిని ప్రకాశింపజేస్తున్నావు. ఇదీ ఉపనిషత్తు మంత్రంయొక్క వివరణ.

ఇప్పుడు ఈ నేపథ్యంతో కృష్ణపరమాత్మ చెప్పిన శ్లోకంయొక్క అర్థాన్ని చూద్దాము.

**సూర్యః తత్ న భాసయతే** – సూర్యకాంతి బ్రహ్మచైతన్యాన్ని ప్రకాశింపజేయలేదు. దానికి భిన్నంగా బ్రహ్మే సూర్యకాంతిని ప్రకాశింపజేస్తాడు.

**న శశాంకః (తత్ భాసయతే)** – తత్ భాసయతే మనం కలుపుకోవాలి. చంద్రకాంతి కూడా బ్రహ్మను ప్రకాశింప జేయలేదు.

**న పావకః** – పావకః అంటే అగ్ని. అగ్ని కూడా బ్రహ్మను ప్రకాశింపజేయలేదు. బ్రహ్మే అగ్నిని ప్రకాశింపజేస్తాడు. వేదాంతపరిభాషలో ప్రకాశింపజేయటం అంటే తెలిసేటట్టు చెయ్యటం. బ్రహ్మ అగ్నిని ప్రకాశింపజేస్తాడు అంటే బ్రహ్మచైతన్యం ఉండటంవల్లనే నాకు అగ్ని ఉందని తెలుస్తున్నది.

ముండకమంత్రంలో ఇంకో రెండు జ్యోతుల గురించి చూశాము. అవి **తారకమ్, విద్యుతః**. తారకం అంటే నక్షత్రాలు, విద్యుతః అంటే మెరుపు. ఈ రెండూ కూడా బ్రహ్మను ప్రకాశింపజేయలేవు. ఆ బ్రహ్మచైతన్యాన్ని ఆబ్జెక్టుగా తెలుసుకోలేము అంటే ఆ బ్రహ్మ సబ్జెక్టు అయిన నేనే అని చూశాము.

ఆ బ్రహ్మ నేనే అయితే, ఆ బ్రహ్మను చేరుకోవటానికి నేను ఎన్ని కిలోమీటర్లు ప్రయాణించాలి? ఒకపక్క బ్రహ్మ అంటే ఏమిటో అర్థమయింది; ఆ బ్రహ్మను నేనే అంటూ, మళ్ళీ ఆ బ్రహ్మను చేరుకోవటానికి ఎంతదూరం ప్రయాణించాలని అడగటం అర్థంలేని ప్రశ్న. మిల్లీమీటరు అంతదూరం కూడా ప్రయాణించనవసరం లేదు. ఎందుకు? నాకు, బ్రహ్మకు మధ్య దూరం ఉంటే కదా ప్రయాణించటానికి. అందువల్ల దీనిద్వారా చాలా ముఖ్యమైన సత్యం ఒకటి అర్థం చేసుకోవాలి. ఏమిటది?

బ్రహ్మను చేరుకోవటం అంటే అక్షరాలా ప్రయాణం లేదు; అది ఒక కాలంలో జరిగేది కాదు. బ్రహ్మను చేరుకోవటం అంటే అది బుద్ధిలో కలిగే మార్పు. బుద్ధిలో కలిగే మార్పు ఏమిటి? ఇన్నాళ్ళూ మనకున్న అపోహను తొలగించుకోవటం. ఏమిటా అపోహ? నాకూ, బ్రహ్మకూ మధ్య దూరం ఉంది; బ్రహ్మ ఎక్కడో కూర్చుని ఉన్నాడు, నేను మరణానంతరం ప్రయాణం చేసి ఆయన దగ్గరకి వెళ్ళాలి అనే అపోహ. ఈ అపోహను

మన సినిమాలు బలపరుస్తాయి. ఒక భక్తుడు మరణిస్తే, అతని శరీరంలోంచి ఒక జ్యోతి (జీవాత్మ జ్యోతి) లేచి, బయటకు వచ్చి రెండుమూడు వీధులు దాటుకుంటూ వెళ్ళి, అక్కడెక్కడో ఉన్న ఆలయంలోని గర్భగుడిలోకి వెళ్ళి, ఆ విగ్రహంలో కలుస్తుంది. ఒకవేళ భగవంతుణ్ణి సాకారంగా, అంటే భక్తుని ముందు ప్రత్యక్షమైనట్టుగా చూపిస్తే, సాక్షాత్తూ భగవంతునిలో కలుస్తుంది. అంటే జీవాత్మ, పరమాత్మలో కలిసింది. వీటివల్ల మనకూ, భగవంతునికీ మధ్య దూరాన్ని పెంచుతున్నాము.

నిజానికి పరమాత్మ సర్వవ్యాపకుడు అంటుంది వేదాంతం. పరమాత్మ సర్వవ్యాపకుడు అయితే, పరమాత్మకూ నాకూ మధ్య దూరం ఉండే అవకాశం ఎక్కడుంది? అందువల్ల దూరం ఉంది అంటే అది మన మనస్సులో ఉంది. అది మన అపోహవల్ల ఏర్పడింది. దూరం అపోహవల్ల ఏర్పడితే, ఆ దూరాన్ని ఎలా పోగొట్టుకోవాలి? జ్ఞానంవల్ల పోగొట్టుకోవాలి. పరమాత్మను పొందుతాడు అంటే జ్ఞానం పొందుతాడని అర్థం. జ్ఞానం పొందాక చేసేదేమీ లేదు.

**యత్ గత్వా** – బ్రహ్మతో ఐక్యం పొందాక; ఇప్పుడే చూశాము ఐక్యం పొందటం అంటే బ్రహ్మకూ, నాకూ మధ్య దూరం ఉందనే అపోహను తొలగించుకోవటం. ఎప్పుడైతే ఆ అపోహ తొలుగుతుందో,

**న నివర్తంతే** – మళ్ళీ సంసారంలో పడే ప్రశ్నే లేదు. జ్ఞానంవల్ల పొందిన ఐక్యం శాశ్వతం. శారీరకంగా పొందిన ఐక్యం అశాశ్వతం. ప్రతి ఒక కలయిక, విడిపోవటంతో ముగుస్తుంది. అందువల్ల శరీరంతో ఎక్కడికో వెళ్ళి కలిసేది శాశ్వతం కాదు. మీరు గీతాబోధకు వెళితే ఆరుగంటలకు వెళతారు. అక్కడ స్వామీజీ బోధతో సంయోగం పొందుతారు. గీతాబోధ అవగానే బయటకు వచ్చేస్తారు. అంటే స్వామీజీ బోధతో వియోగం పొందుతారు. అదే సూత్రం స్వర్గలోకానికి కూడా వర్తిస్తుంది. మరణించాక ప్రయాణం చేసి స్వర్గలోకానికి వెళ్ళి పరమాత్మతో ఐక్యం పొందుతారు; కాని పుణ్యం క్షీణించగానే, అక్కణ్ణుంచి వెనక్కి రావాలి. అంటే వియోగం పొందాలి. కాని జ్ఞానంవల్ల పరమాత్మతో పొందిన ఐక్యం శాశ్వతం. ఎందుకంటే జ్ఞానం అజ్ఞానాన్ని పారద్రోలుతుంది. ఆ అజ్ఞానం ఒకసారిపోతే, మళ్ళీ రాదు. శాశ్వతంగా పోతుంది. అందువల్ల ఎవరైతే జ్ఞానం పొందుతారో, వారు మళ్ళీ తిరిగి రారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆ గమ్యం ఏమిటి?

**తద్ధామ పరమం మమ** – బ్రహ్మ అనే గమ్యం మరేదో కాదు, నా ఉన్నతస్వరూపం అంటున్నాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మే స్వయంగా అది నా ఉన్నతస్వరూపం అని చెపితే, నాకింకొక తక్కువస్థాయి స్వరూపం కూడా ఉందని కృష్ణపరమాత్మ చెప్పకనే చెప్పినట్టువుతోంది. ఈ విషయం నిజానికి కృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయంలోనే సుస్పష్టం చేశాడు.

అందులో పరమాత్మయొక్క ఉన్నతస్థాయి అయిన పరాప్రకృతి గురించి, తక్కువస్థాయి అయిన అపరాప్రకృతి గురించి వివరించాడు. అక్కడ ఈ రెండు పదాలకూ చూసిన నిర్వచనాలను గుర్తు తెచ్చుకుందాము.

**పరాప్రకృతి – నిర్గుణ, నిర్వికార, సత్య, చేతన తత్త్వము**
**అపరాప్రకృతి – సగుణ, సవికార, మిథ్యా, అచేతన తత్త్వము**

కృష్ణపరమాత్మ పరోక్షంగా చెబుతున్నాడు. ఓ అర్జునా! నన్ను ఏకరూప కృష్ణునిగా చూడకు. దేవకీసుతునిగా జన్మాష్టమి వేడుకలు చేయించుకునే కృష్ణునిగా చూడకు, అది నా తక్కువస్థాయి. నా ఉన్నతస్థాయి నిర్గుణచైతన్యం. ఈ నిర్గుణచైతన్యానికి చావు పుట్టుకలు లేవు, ప్రయాణం లేదు. అందువల్లనే కృష్ణుణ్ణి కృష్ణపరమాత్మ అంటారు. ఆ పరమాత్మ చైతన్యస్వరూపం, సర్వవ్యాపకం. ఇక్కడ్నుంచీ కృష్ణపరమాత్మ నేను అంటే అది **నిర్గుణబ్రహ్మచైతన్యం**.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. కృష్ణపరమాత్మ నేను అనే పదాన్ని మూడు అర్థాలతో వాడతాడు. సందర్భాన్నిబట్టి అర్థం చేసుకోవాలి.

**ఏకరూప ఈశ్వరుడు** – ఒక్కోసారి నేను అంటే కృష్ణునిగా రూపుదాల్చిన వ్యక్తి. పుట్టినరోజు, నిర్వాణం రోజు ఉండి, అర్జునుని కాలానికి చెంది, అర్జుననితో కలిసిమెలసి తిరిగిన సఖుడు.

సఖుడు కృష్ణుడు – సఖేతి మత్వా భక్తోసి మ సః చేతి రహస్యం హే తదుత్తమమ్

**వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్**
**దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్**

ఈ వర్ణన ఏకరూప ఈశ్వరునికి సరిపోతుంది.

**అనేకరూప ఈశ్వరుడు** – కొన్ని సందర్భాలలో నేను అంటే అనేకరూప ఈశ్వరునిగా తన గురించి చెబుతాడు. పదకొండవ అధ్యాయం మొత్తంలో నేను అంటే అనేకరూప ఈశ్వరుడు.

**అనేకబాహూదరవక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్ ।**
**నాంతం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥** – 11.16

అనంతరూపం అంటే ఏకరూపం కాదు, అనేకరూపం లేదా విశ్వరూపం.

**అరూప ఈశ్వరుడు** – కొన్ని అరుదైన సందర్భాలలో నేను అంటే ఏకరూప ఈశ్వరుడు కాదు, అనేకరూప ఈశ్వరుడు కాదు, అరూప ఈశ్వరుడు. అరూప ఈశ్వరుడు అంటే నిర్గుణచైతన్యము.

**అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మామబుద్ధయః ।**
**పరం భావమజానంతో మమావ్యయమనుత్తమమ్ ॥** – 7.24

నేను శాశ్వతుణ్ణి, సర్వోత్తముణ్ణి, ఇంద్రియ అగోచరము. ఇది తెలియని అజ్ఞానులు నేను సాధారణమైన మనిషిని అనుకుంటారు అన్నాడు కృష్ణపరమాత్మ.

**మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా** – 9.4

నేను అవ్యక్తరూపంలో జగత్తునంతటా వ్యాపించి ఉన్నాను. ఇటువంటి సందర్భాలలో నేను అంటే అరూప ఈశ్వరుడు. ఆ విధంగా కృష్ణపరమాత్మ నేను అంటే మూడు అర్థాలలో ఏదైనా కావచ్చు. అవి ఏకరూప

ఈశ్వరుడు అంటే కృష్ణుడు; అనేకరూప ఈశ్వరుడు అంటే విరాట్; అరూప ఈశ్వరుడు అంటే నిర్గుణబ్రహ్మ. అందువల్ల కృష్ణపరమాత్మ అహం, మయా, మమ అనే పదాలను వాడినప్పుడు వాటిని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఈ మూడింటిలో ఏ రూపాన్ని గురించి చెబుతున్నాడో తెలుసుకోవాలి.

కాని చాలామంది అయోమయంలో పడిపోతారు. అనేకరూప ఈశ్వరునిగా తీసుకోవాల్సిన చోట ఏకరూపునిగా, ఏకరూపునిగా తీసుకోవాల్సిన చోట అనేకరూపునిగానూ తీసుకుంటారు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ** – 18.66

నన్నే శరణు వేడు అంటే ఏ నన్ను? ఇక్కడ చాలామంది పొరపాటు పడతారు. కృష్ణభక్తులు అదుగో నన్నే శరణు వేడమన్నాడు కృష్ణపరమాత్మ, అంటే వేరే భగవంతునికి పూజ చేయకూడదు అంటారు. దీనికి శంకరాచార్యుల వారు చాలా వివరంగా భాష్యం రాశారు. ఆ అధ్యాయంలో, ఆ శ్లోకానికి వచ్చినప్పుడు వివరంగా చూద్దాము. ఇప్పుడు, అక్కడ 'నన్నే' అంటే ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు కాదు; అరూపఈశ్వరుడు అని అర్థం చేసుకుంటే చాలు.

ఆ విధంగా ఈ అధ్యాయంలో తద్ధామం పరమం మమ అంటే నా నిర్గుణస్వరూపాన్ని అర్థం చేసుకున్నవారు బ్రహ్మలో ఐక్యం అవుతారని అర్థం.

ఇక్కడితో రెండవ అంశం అయింది. ఇందులో ఎలా ఒక సాధకుడు నాలుగు సాధనలను పాటిస్తే మోక్షాన్ని పొందుతాడో చూశాము. మోక్షం పొందటం అంటే ఐక్యజ్ఞానం పొందటం అనికూడా చూశాము. దీన్నే రెండవ అధ్యాయంలో బ్రహ్మనిర్వాణం పేరుతో చూశాము. నిర్వాణం అంటే ఐక్యం. దీనితో ఈ అధ్యాయంలో రెండవ అంశం అయిన **మోక్షసాధనాని** అయిపోయింది.

### 3. బ్రహ్మణః సర్వాత్మకత్వమ్ – శ్లోకాలు 7-15: ఉపోద్ఘాతం

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ ఇంకొక ముఖ్యమైన అంశాన్ని చర్చించబోతున్నాడు. అది బ్రహ్మ సర్వాత్మకత్వం. బ్రహ్మే మొత్తం జగత్తురూపంలో ఉన్నాడు అంటే బ్రహ్మ లేకుండా, బ్రహ్మకు భిన్నంగా జగత్తు లేదని అర్థం. ఆభరణాలు–బంగారం ఉదాహరణ చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. బంగారం లేకుండా ఆభరణాలకు విడిగా ఉనికి లేదు. గాజుకి విడిగా ఉనికి లేదు; గాజులో ఉన్నదంతా బంగారమే. అలాగే చెక్క–కుర్చీ ఉదాహరణ చూసినా, కుర్చీకి విడిగా ఉనికి లేదు. ఎందుకు? చెక్క లేకుండా కుర్చీకి విడిగా ఉనికి లేదు.

ఈ సూత్రాన్ని జగత్తుకు అన్వయిస్తే జగత్తు అంతటా బ్రహ్మ ఉన్నాడు. అందువల్ల జగత్తుకు బ్రహ్మ లేకుండా విడిగా ఉనికి లేదు. బ్రహ్మనే జగత్తుగా పిలుస్తున్నాము. ఈ భావన అంతర్లీనంగా ఉంది నాలుగవ అధ్యాయంలో.

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**

**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥** – 4.24

ఇది చాలా ప్రసిద్ధిచెందిన శ్లోకం. భోజనం చేసేముందు పఠించే శ్లోకం. కాని దీని సారాంశం – బ్రహ్మే అన్నింటా సర్వవ్యాపకంగా ఉన్నాడు.

ఇప్పుడు ఈ అధ్యాయంలో ఈ సర్వవ్యాపకత్వాన్ని చూపించటానికి కృష్ణపరమాత్మ విశ్వాన్ని రెండుభాగాలుగా విభజిస్తున్నాడు. అవి జీవుడు, జగత్తు అంటే చైతన్యం ఉన్న జీవుడు; జడమైన విషయవస్తువులు. విశ్వం అంటే జీవుడు+జగత్తు అంటే కర్తా+భోగ్యవస్తువు. మాండూక్యోపనిషత్తు పరిభాషలో చెప్పాలంటే ప్రమాతా+ప్రమేయం. ఇక్కడ జీవుడు+జగత్తు అని తీసుకుందాము. కృష్ణపరమాత్మ ఒకే నిర్గుణబ్రహ్మ జీవ, జగత్తులుగా అంటే చైతన్యం, జడాలుగా భాసిల్లుతున్నది అంటున్నాడు.

ఇది అర్థం చేసుకోవటానికి, జీవునియొక్క నిర్వచనం తెలుసుకోవాలి. ఆ నిర్వచనం తెలుసుకోవాలంటే తత్త్వబోధ గుర్తుతెచ్చుకోవాలి. తత్త్వబోధలో పరమాత్మను బింబచైతన్యం అనీ, జీవాత్మను ప్రతిబింబచైతన్యం లేదా చిదాభాస అనీ అంటారు. ఈ బింబచైతన్యాన్ని బ్రహ్మ అనీ, చిత్ అని కూడా అంటారు. ఈ బింబచైతన్యాన్ని మనస్సు ప్రతిబింబింపజేస్తుంది. అందువల్ల మనస్సుని ప్రతిబింబమాధ్యమం అనీ, అలా ఏర్పడిన ప్రతిబింబాన్ని ప్రతిబింబచైతన్యం అనీ అంటారు. వీటికి ఇంగ్లీషులో పేర్లు చూద్దాము.

| | | |
|---|---|---|
| OC – Original Consciousness | – బింబచైతన్యం | – చిత్ |
| RC – Reflected Consciousness | – ప్రతిబింబచైతన్యం | – చిదాభాస |
| RM – Reflecting Medium | – ప్రతిబింబమాధ్యమం | – మనస్సు |

ఇది అర్థం చేసుకోవటానికి అద్దం ఉదాహరణ చూద్దాము. ఇది అంతకుముందు కూడా చూశాము. ఆకాశంలో పట్టపగలు సూర్యుడు దేదీప్యమానంగా ప్రకాశిస్తాడు. దాన్ని బింబసూర్యకాంతి అంటాము. కింద ఒక చీకటిగది ఉందనుకుందాము. ఆ చీకటిగదిలోకి సూర్యకాంతి చొరబడే అవకాశం లేదు. ఆ కాంతిని అడ్డుకుంటున్నాయి పైకప్పు భాగం, మూసుకున్న తలుపులు. అందువల్ల సూర్యకాంతి ఆ గదిని ప్రత్యక్షంగా కాంతివంతం చెయ్యలేకపోతున్నది. అప్పుడు మీరు ఆ గది కిటికీతలుపు తీసి, ఒక అద్దాన్ని ఒక ప్రత్యేకమైన కోణంలో పెట్టారనుకోండి, ఏమవుతుంది? బింబసూర్యకాంతిని ఈ అద్దం ప్రతిబింబింపజేస్తుంది. అందువల్ల అద్దాన్ని ప్రతిబింబమాధ్యమం అనీ, అలా ఏర్పడిన సూర్యప్రతిబింబాన్ని ప్రతిబింబసూర్యకాంతి అనీ అంటారు.

అద్దం జడం. దానికి విడిగా కాంతిలేదు. కాని సూర్యకాంతికి ఎదురుగా పెడితే, అది సూర్యకాంతిని ప్రతిబింబింపజేసింది. అద్దం సూర్యకాంతిని ప్రతిబింబింపజేయటంవల్ల, అది కాంతవంతమవటమే కాకుండా, చీకటిగదిని కూడా ప్రకాశవంతంగా చేసింది.

ఇప్పుడు చెప్పండి, చీకటిగదిని ప్రకాశింపజేస్తున్నది అద్దమా, బింబసూర్యకాంతా? ఒకవేళ మీరు బింబసూర్యకాంతి ప్రకాశింపజేస్తోంది అంటే, అయితే అద్దాన్ని తీసేయండి అంటాము. అప్పుడేమవుతుంది? గది చీకటిగా మారిపోతుంది. అయితే సూర్యకాంతి కాదు గదిని ప్రకాశవంతం చేస్తున్నది, అద్దం చేస్తోంది అన్నారనుకోండి; ఆ గది కిటికీ మూసేయమంటాము. అప్పుడు కూడా గది చీకటైపోతుంది. అంటే దీన్నిబట్టి అర్థమయిందేమిటి? చీకటిగదిని కేవలం సూర్యకాంతి ప్రకాశింపజేయలేదు, కేవలం అద్దం ప్రకాశింపజేయలేదు; వాటి రెండింటి మేలుకలయిక ప్రకాశింపజేస్తుంది.

కాని సందర్భాన్నిబట్టి ఒకదాని గురించి ఎక్కువగా చెబుతాము. ఒక పసికందు ఈ భూమ్మీదకు రావటానికి కారణం ఎవరు? తల్లా, తండ్రా? ఇద్దరూనూ! ఇద్దరూ కలిస్తేనే, ఒక ప్రాణం ఊపిరిపోసుకుంటుంది. కాని ఒక సందర్భంలో తల్లిని కీర్తిస్తారు, ఇంకో సందర్భంలో తండ్రిని మెచ్చుకుంటారు. కాని ఇద్దరికీ సమానంగా బాధ్యత ఉంది.

మళ్ళీ అద్దం ఉదాహరణకు వెళితే, ఆ విషయాన్ని రెండు కోణాల్లోంచి చెప్పవచ్చు. చీకటిగదిని ఏది ప్రకాశవంతం చేస్తోంది అంటే, అద్దం ప్రకాశింపజేస్తోందని చెప్పి, చిన్నగా సూర్యబింబకాంతి సహాయంతో అని కలుపుతాము. కాని అద్దానికి ప్రాముఖ్యతను ఇస్తున్నాము. ఇంకో సందర్భంలో చీకటిగదిని సూర్యుడు ప్రకాశింపజేస్తున్నాడు అని చెప్పి, చిన్నగా ప్రత్యక్షంగా కాదు, అద్దం సహాయంతో అంటాము. అంటే ఇక్కడ సూర్యునికి ప్రాముఖ్యతను ఇస్తున్నాము.

అదే విధంగా, మన మనశ్శరీరాల విషయానికొస్తే, మనస్సు అద్దంలాంటిది. మనస్సు ప్రతిబింబమాధ్యమం. దానంతట దానికి చైతన్యం లేదు; మనస్సు పంచభూతాలతో చేయబడింది కాబట్టి మనస్సు కూడా జడం. కాని జడమైన అద్దం సూర్యకాంతిని ప్రతిబింబింపజేసినట్టుగా, మనస్సు బ్రహ్మ అనే బింబచైతన్యాన్ని ప్రతిబింబింపజేస్తుంది. దాన్ని చిదాభాస అంటారని చూశాము.

చీకటిగదిలో అద్దాన్ని తీసేస్తే ఏమవుతుంది? గది మళ్ళీ చీకటిగా అవుతుంది. ఎందుకు? సూర్యకాంతిని ప్రతిబింబింపజేసే మాధ్యమమైన అద్దం లేదుకాబట్టి. అలాగే సుషుప్తిలో చైతన్యాన్ని ప్రతిబింబింపజేసే మనస్సు పడుకుంటుంది కాబట్టి, ప్రతిబింబచైతన్యం అందుబాటులో ఉండదు. ప్రతిబింబచైతన్యం లేకపోయేసరికి, చీకటిగా అనిపిస్తుంది. అంటే జగత్తు ఉన్నట్టు తెలియదు.

నిర్గుణబ్రహ్మ, మాయాశక్తి సహాయంతో, జీవునిగానూ, జగత్తుగానూ ప్రకటితమవుతున్నది. కర్త అయిన జీవుడు, భోగ్యవస్తువు అయిన ప్రపంచం రెండూ నా వ్యక్తరూపాలే అంటున్నాడు కృష్ణపరమాత్మ ఈ శ్లోకాల్లో. ఈ విషయం స్వప్నదృష్టాంతాన్ని చూస్తే అర్థమవుతుంది. నేను, నా నిద్రాశక్తితో స్వప్నప్రపంచాన్ని, దానితో వ్యవహారం నడిపే స్వాప్నికుణ్ణి కూడా సృష్టిస్తాను. అలాగే నిర్గుణబ్రహ్మ భోక్తగా, భోగ్యంగా విభజించుకుంటుంది.

**అహమేవ జీవరూపేణ భవిష్యామి, అహమేవ జగద్రూపేణ అభిభవామి**

దీన్నే సర్వాత్మభావన లేదా సర్వ ఈశ్వరభావన అంటారు.

జీవుని గురించి ఇంకొంచెం వివరంగా చూద్దాము. జీవుడు అంటే శరీరపరంగా చూస్తే మూడు శరీరాలు చెబుతారు. అవి స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం. ఇప్పుడు మనకు కారణశరీరంతో పనిలేదు. అందువల్ల కారణశరీరాన్ని పక్కనపెడితే, రెండు శరీరాలు ఉన్నాయి. రెండు శరీరాలు కూడా జడమే. ఎందుకంటే అవి పంచభూతాలతో చెయ్యబడ్డాయి. స్థూలశరీరంలో ఇంద్రియాలయొక్క గోళకాలు ఉంటాయి; సూక్ష్మశరీరంలో 19 అంశాలు ఉంటాయి. అవి పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, చత్వారి అంతఃకరణాని, తత్త్వబోధలో ఇవన్నీ వివరంగా వస్తాయి.

**సూక్ష్మశరీరం కిమ్?**
సూక్ష్మశరీరం అంటే ఏమిటి?

**అపంచీకృత సూక్ష్మమహాభూతైః కృతం సత్కర్మజన్యం**
**సుఖదుఃఖాది భోగసాధనమ్, పంచజ్ఞానేంద్రియాణి, పంచకర్మేంద్రియాణి**
**పంచప్రాణాదయో మనశ్చైకమ్ బుద్ధిశ్చైకా ఏవం**
**సప్తదశకలాభిః సహ యత్ తిష్ఠతి తత్ సూక్ష్మశరీరమ్. – తత్త్వబోధ**

పంచీకృతములు కాని పంచసూక్ష్మభూతాలతో ఏర్పడునది, పూర్వజన్మపుణ్యంవల్ల కలిగేది, సుఖదుఃఖాలవంటి భోగాలకు సాధనమైనది, ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ఐదు ప్రాణాలు, మనస్సు, బుద్ధి అను పదిహేడు కళలతో కూడినది సూక్ష్మశరీరము.

కొన్నిచోట్ల మనస్సును నాలుగుగా వర్ణిస్తారు (చత్వారి అంతకరణాని అంటే మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం). అప్పుడు 19 అంశాలు అవుతాయి.

ఇప్పుడు ఈ 19 అంశాల్లో మనస్సును తీసుకుంటాము. మనస్సు స్వయంగా జడం అయినా దానికి చైతన్యాన్ని అరువు తీసుకునే శక్తి ఉంది. అది అరువు తీసుకోవటమే కాక, శరీరానికి, ఇంద్రియాలకు కూడా చైతన్యాన్ని అరువు ఇస్తుంది. అందువల్ల కార్యకరణసంఘాతమైన మన మనశ్శరీరాలు చైతన్యవంతంగా ఉన్నాయంటే వాటికి చైతన్యం స్వతఃసిద్ధంగా లేదు. మనస్సనే మాధ్యమం, బింబచైతన్యాన్ని ప్రతిబింబించడంవల్ల చైతన్యవంతం అవుతాయి. మనస్సు బింబచైతన్యంనుంచి చైతన్యాన్ని అరువు తెచ్చుకుని, శరీరాన్ని చైతన్యవంతం చేస్తుందని చూశాము కదా. ఈ జీవుడు మరణించినప్పుడు ఏమవుతుంది?

చైతన్యం వెళ్ళిపోతుంది అనకూడదు. చైతన్యం సర్వవ్యాపకం. దానికి ప్రయాణం లేదు. మనస్సు స్థూలశరీరాన్ని వదిలివెళుతుంది. శాస్త్రంలో మరణాన్ని సూక్ష్మశరీరం, స్థూలశరీరంనుంచి విడిపోవటంగానూ, జన్మను సూక్ష్మశరీరం వెళ్ళి కొత్త స్థూలశరీరంతో సంయోగం చెందటంగానూ నిర్వచిస్తారు. సూక్ష్మశరీరం అంటే ముందు చెప్పుకున్న 19 అంశాలూ వస్తాయి. వాటన్నిటినీ కలిపి మనస్సుగా వ్యవహరిస్తారు.

మరణం సంభవించినప్పుడు చైతన్యాన్ని ప్రతిబింబింపజేసే మనస్సు వెళ్ళిపోతుంది కాబట్టి, బింబచైతన్యం ఉన్నట్టు తెలియదు. బింబచైతన్యం, శరీరానికి ఎందుకు ప్రత్యక్షంగా చైతన్యం ఇవ్వదు? శరీరానికి ప్రత్యక్షంగా చైతన్యాన్ని ఇస్తే, శరీరానికి మరణం ఉండదు. మరణం లేకపోతే నష్టమేమిటంటే, పెరిగే జనాభాకి చోటు ఉండదు. మనస్సు వెళ్ళిపోగానే, శరీరానికి చైతన్యం ఉండదు; బింబచైతన్యం ఉన్నట్టు తెలియదు.

దీన్నిబట్టి చైతన్యం మనస్సును చైతన్యవంతం చేస్తుందనీ, మనస్సు శరీరాన్ని చైతన్యవంతం చేస్తుందనీ అర్థమవుతున్నది. అందువల్ల జీవించి ఉన్నవారిని చూస్తే, వారి వెనక మనస్సు ఉందని తెలుసుకోవాలి. వారి మనస్సు మనకు కనబడదు, అర్థంకాదు కాని, శరీరం చేసే ప్రతి పని వెనక మనస్సు ఉందని తెలుస్తుంది. మనస్సు ఉందని తెలిస్తే, బింబచైతన్యం ఉన్నట్టు అర్థం. ఎందుకంటే బింబచైతన్యం లేకుండా మనస్సు చైతన్యవంతం

అవలేదు. ఆ విధంగా శరీరం మనస్సు ఉందని తెలుసుకోవటానికి తోడ్పడితే, మనస్సు బింబచైతన్యం ఉందని తెలుసుకోవటానికి తోడ్పడుతుంది. ఆ బింబచైతన్యమే బ్రహ్మ.

ఉదాహరణకు ఈ గదిలో కరెంటు ఉందా అని ఎవరైనా అడిగితే ఏంచేస్తారు? లైటు వేసి చూస్తారు. బల్బు వెలిగితే కరెంటు ఉన్నట్టు అర్థం. బల్బును స్థూలశరీరంతో పోల్చవచ్చు. ఎందుకంటే బల్బుకు స్వతహాగా కాంతిలేదు. స్థూలశరీరంలో సూక్ష్మశరీరం ఉన్నట్టుగా, దానిలో ఫిలమెంటు ఉంటుంది. ఆ ఫిలమెంటువల్ల బల్బు వెలుగుతుంది. ఆ ఫిలమెంటును మనస్సుతో పోల్చవచ్చు.

ఇప్పుడు ఇంకో ప్రశ్న. ఫిలమెంట్ ఎలా వెలుగుతుంది? ఆ ఫిలమెంట్‌కు స్వంతంగా కాంతిలేదు. దానికి వెనక విద్యుచ్ఛక్తి ఉందని తెలుసు. ఒక్కోసారి బల్బు ఉంటుంది, విద్యుచ్ఛక్తి కూడా ఉంటుంది; అయినా బల్బు వెలగదు. ఎందుకు? అంటే అందులో ఫిలమెంట్ లేదు. స్థూలశరీరమనే బల్బులో సూక్ష్మశరీరమనే ఫిలమెంట్ లేదు. అదేవిధంగా నిన్న మాట్లాడుతూ, తిరుగుతూ ఉన్నవ్యక్తి ఇవాళ ఇంకలేదు అంటే ఆశ్చర్యపోతాము. అంటే అతని మనస్సు అనే సూక్ష్మశరీరం అతని స్థూలశరీరాన్ని వదిలి వెళ్ళిపోయిందన్నమాట.

ఎవరైనా మనిషి హుషారుగా ఉన్నాడంటే, అది సర్వవ్యాపకమైన భగవంతుని కృప అని అర్థం చేసుకోవాలి. భగవంతుని దర్శనంకోసం ఒంటికాలిమీద నిలబడి తపస్సు చెయ్యనవసరం లేదు. పరిపక్వత చెందిన మనస్సు ఉంటే భగవంతుడు మన ప్రతిచర్యలోనూ తెలుస్తాడు. మనం మాట్లాడగలుగుతున్నాము అంటే అది భగవంతుని కృప. చైతన్యం మనస్సును ప్రకాశింపజేస్తే, మనస్సు వాక్కును ప్రకాశింపజేస్తే, వాక్కు మాట్లాడుతుంది. మీరు మాట్లాడుతున్నది ఎదుటివారు వినగలుగుతున్నారంటే భగవంతుని ఉనికికి అది నిదర్శనం. ఇంత స్పష్టమైన నిదర్శనం ఉన్నా కూడా భగవంతుడు ఉన్నాడని ఏమిటి నిదర్శనం అంటారు. భగవంతుడు ఉన్నాడు కాబట్టి మీరు ప్రశ్న వెయ్యగలుగుతున్నారని ఎదురు చెప్పగలగాలి మీరు. అందువల్ల బ్రహ్మే జీవునిగా భాసిల్లుతున్నాడని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. బ్రహ్మే జగత్తుగా కూడా భాసిల్లుతున్నాడు.

**జీవః అపి బ్రహ్మైవ జగత్ అపి బ్రహ్మైవ సర్వం బ్రహ్మమయం జగత్**

ఈ భావన ప్రతి ఉపనిషత్తులోనూ వస్తుంది, ముఖ్యంగా ముండకోపనిషత్తులో.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాద్ బ్రహ్మ పశ్చాద్ బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ**
**అధశ్చోర్ధ్వం చ ప్రసృతం బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్** – ముండకం 2.2.11

ముందు, వెనక, కుడిపక్క, ఎడమపక్క, కింద, పైన, అంతటా ఉన్నది సర్వోత్కృష్టమైన బ్రహ్మే.

7–11 శ్లోకాల వరకు బ్రహ్మ జీవరూపంలో ఉన్నాడని వస్తే, 12–15 శ్లోకాల వరకు బ్రహ్మ జగత్‌రూపంలో కూడా ఉన్నాడని వస్తుంది. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలను చూద్దాము.

శ్లో. 7 **మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః ।**
**మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥**

మమ, ఏవ, అంశః, జీవలోకే, జీవభూతః, సనాతనః,
మనఃషష్ఠాని ఇంద్రియాణి, ప్రకృతిస్థాని, కర్షతి ॥

| | | | |
|---|---|---|---|
| జీవలోకే | = సర్వప్రాణుల దేహములలో ఉన్న | మనఃషష్ఠాని, | = మనస్సును, |
| సనాతనః | = సనాతనమైన | ఇంద్రియాణి | ఐదు ఇంద్రియములను |
| జీవభూతః | = జీవాత్మ | కర్షతి | = శబ్దాది విషయముల |
| మమ, ఏవ, అంశః | = నా అంశయే | | ద్వారా తన వైపునకు |
| ప్రకృతిస్థాని | = ప్రకృతియందు స్థితములైన | | ఆకర్షించును |

**(అస్మిన్) జీవ–లోకే మమ ఏవ సనాతనః అంశః జీవ–భూతః**
**(అస్తి, సః) ప్రకృతి–స్థాని మనః–షష్ఠాని–ఇన్ద్రియాణి కర్షతి ॥**

తా: సర్వప్రాణుల దేహములలో ఉన్న సనాతనమైన జీవాత్మ నా అంశయే. అదియే ప్రకృతియందు స్థితములైన మనస్సును, ఐదు ఇంద్రియములను, శబ్దాది విషయములద్వారా తన వైపునకు ఆకర్షించును.

**మమ ఏవ అంశః** – మమ అంటే మూడు రూపాల్లో ఏదన్నా కావచ్చు అని చూశాము. ఆ మూడు రూపాలు ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు. ఇక్కడ మమ అంటే అరూప ఈశ్వరుడు లేదా నిర్గుణబ్రహ్మ. అంశ అంటే ప్రతిబింబం. నా ప్రతిబింబమే ప్రతి ఒక్కజీవిలోని జడమైన మనస్సులో పడుతున్నది. ఎలాగైతే బల్బు విద్యుచ్ఛక్తివల్ల వెలుగుతుందో, అలా మనస్సు బింబచైతన్యంవల్ల చైతన్యాన్ని పొందుతున్నది. మమైవాంశః అంటే ప్రతిబింబచైతన్యం.

**జీవలోకే** – జీవులందరిలోని ప్రతిబింబచైతన్యాన్ని జీవుడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. జీవుడు అంటే ప్రతిబింబ చైతన్యం లేదా ఆభాసచైతన్యం. ఒక్క సూర్యకాంతియొక్క ప్రతిబింబాలు అనేకం ఏర్పడినట్టుగా, ఒక్క బింబచైతన్యం అనేక జీవులుగా కనిపిస్తున్నది.

**జీవభూతః** – బింబచైతన్యం పరమాత్మ అయితే, ప్రతిబింబచైతన్యం జీవాత్మ. ఈ జీవాత్మ ఎన్నాళ్ళు జీవిస్తుంది?

**సనాతనః** – ఈ జీవాత్మకు మరణం లేదు. అది శాశ్వతం. మరణం సంభవించింది అనేది స్థూలశరీరానికే కాని, సూక్ష్మశరీరానికి కాదు. జీవాత్మ అంటే మనస్సు+చిదాభాస. చిదాభాస అంటే ప్రతిబింబచైతన్యం. అందువల్ల ఈ జీవాత్మ స్థూలశరీరంనుంచి విడివడి ప్రయాణం చేస్తుంది. కాబట్టి జీవాత్మ సనాతనం. ఈ జీవుడు ఎప్పుడు పుట్టాడు? **అనాదికాల ప్రవృత్తః**. ఈ జీవునికి ఆదిలేదు, అంతము లేదు. జీవాత్మకు మరణం లేదు. ప్రళయంలో కూడా జీవాత్మ అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. అంటే చిదాభాసతో కూడిన మనస్సు అవ్యక్తంలోకి వెళుతుంది. ఆ అనుభవం మనం ప్రతిరోజూ సుషుప్తిలో పొందుతాము.

సుషుప్తిలో మనస్సు మరణించదు, అవ్యక్తంలోకి వెళుతుందని ఎలా చెప్పగలము? ఎందుకంటే పొద్దున్న లేస్తూనే మనస్సు రాత్రి దేనిగురించి బాధపడిందో, దాన్ని గుర్తు తెచ్చుకుంటుంది. వేరే దేనిగురించైనా బాధపడితే మనస్సు మారిందని చెప్పవచ్చు. కాని అలా జరగటంలేదు, మనస్సు అవ్యక్తంలోకి వెళుతుంది అంతే. ఆ విధంగా మనస్సుతో కూడిన చిదాభాసకు మరణం లేదు. అందువల్ల అది సనాతనం. ఈ జీవాత్మ మరణకాలంలో ఏమవుతుంది? దీనికి జవాబు మనం ఎనిమిదవ శ్లోకంనుంచి అరువు తెచ్చుకోవాలి.

**యచ్చాప్యుత్క్రామతీశ్వరః** – ఈ జీవుడు శరీరాన్ని వదిలినప్పుడు. ఏ జీవుడు? ప్రతిబింబచైతన్యం. ఏం చేస్తాడు జీవుడు?

**ఇంద్రియాణి కర్షతి** – చిదాభాస తను వెళ్ళటమే కాదు, తనతోపాటు మొత్తం సూక్ష్మశరీరాన్ని కూడా తీసుకువెళుతుంది. సూక్ష్మశరీరంలో ఏమున్నాయి? ఇంద్రియాలు ఉన్నాయి. ఇంద్రియాలు అంటే కనిపించని ఇంద్రియాలు; స్థూలశరీరంలో కనిపించే ఇంద్రియాలను గోళకాలు అంటారు. అవి జీవుడు మరణించాక కూడా ఉంటాయి కాని వాటిలో చైతన్యం ఉండదు. అందువల్ల కన్ను ఉంటుంది కాని చూపు ఉండదు. చైతన్యభాగాన్ని ఇంద్రియాలు అంటారు.

**ఏకీభవతి న పశ్యతీత్యాహుః ఏకీభవతి న జిఘ్రతీత్యాహుః ఏకీభవతి న రసయతేత్యాహుః ఏకీభవతి న వదతీత్యాహుః ఏకీభవతి న శృణోతీత్యాహుః ఏకీభవతి న మనుత ఇత్యాహుః ఏకీభవతి న స్పృశతీత్యాహుః ఏకీభవతి న విజ్ఞానాతీత్యాహుః॥** – బృహదారణ్యకం

చూడలేదు, వాసన చూడలేదు, రుచి చూడలేదు, వినలేదు అంటూ వర్ణిస్తారు మరణించినవ్యక్తిని. అంటే అతని శరీర అంగాలు అలాగే ఉంటాయి కాని, వాటి శక్తి వెళ్ళిపోతుంది. ఇంద్రియాలశక్తి చిదాభాసతో వెళ్ళిపోతుంది. కర్షతి అంటే లాక్కువెళతాయి.

**మనఃషష్ఠాని** – ఇంద్రియాలనే కాదు, వాటి వెనకనున్న మనస్సును కూడా లాగుతుంది చిదాభాస. మరణించేముందు వరకూ ఈ ఇంద్రియాలు ఎక్కడ ఉన్నాయి?

**ప్రకృతిస్థాని** – స్థూలశరీరంలో ఉన్నాయి. ప్రకృతికి అనేక అర్థాలున్నాయి కాని ఇక్కడ ప్రకృతి అంటే స్థూలశరీరం. స్థూలశరీరంనుంచి, ఇంద్రియాలశక్తిని జీవుడు తీసుకువెళతాడు. జీవుడు అంటే ప్రతిబింబచైతన్యం అని మర్చిపోకూడదు. ఎప్పుడు తీసుకువెళతాడు? తర్వాత వచ్చే శ్లోకంనుంచి చూస్తాము. యచ్చాప్యుత్క్రామతి, అంటే శరీరాన్ని వదిలి వెళ్ళేటప్పుడు. జీవుడు ఎప్పుడు వదిలివెళతాడు? ఈ ప్రశ్నకు జవాబు ఈ సందర్భంలో రాదు, కాని ఈ ప్రశ్న అందరినీ వేధిస్తుంది. జీవుని ఇష్టప్రకారం వెళతాడా, భగవంతుడు నిర్ణయిస్తాడా, కుటుంబసభ్యులు నిర్ణయిస్తారా? మరణం ఎప్పుడు సంభవించాలో నిర్ణయించేదెవరు? పైన పేర్కొన్నవాటిల్లో ఏవీ నిర్ణయించవు. మనం చేసుకున్న కర్మ నిర్ణయిస్తుంది. కర్మ సిద్ధాంతం గుర్తుతెచ్చుకోవాలి.

మన కర్మలను మూడుగా విభజిస్తారు. అవి సంచితకర్మలు, ప్రారబ్ధకర్మలు, ఆగామికర్మలు. సంచితకర్మలు అంటే మనం జన్మజన్మలనుంచి ప్రోగేసుకున్న పుణ్యపాపకర్మఫలాలు. వాటిని ఒక సంచిలో ఈ జన్మకు మోసుకువస్తాము. అందులో కొన్ని ఫలించి, ఈ మానవజన్మ వచ్చింది. ఇప్పుడు అనుభవించే కర్మను ప్రారబ్ధకర్మ అంటారు. అది క్షయమయిపోయిన క్షణమే ఈ జన్మ ముగిసిపోతుంది. ఆగామికర్మలు మనం ఈ జన్మలో చేసే కర్మలు. వాటిలో కొన్ని కర్మల ఫలాలను ఈ జన్మలోనే అనుభవిస్తాము, కొన్ని సంచితకర్మల్లో కలుస్తాయి. అందువల్ల ఈ జన్మ ప్రారబ్ధకర్మ ముగియగానే ముగుస్తుంది. అంటే ఈ స్థూలశరీరాన్ని వదిలి, సూక్ష్మశరీరం వెళ్ళిపోతుంది.

సూక్ష్మశరీరం పరిస్థితి ఏమిటి? సంచితకర్మలు ఇంకా ఉంటాయని చూశాము కదా. మళ్ళీ అందులో కొన్ని కర్మలు పండి, అవి వచ్చే జన్మ ఏదో నిశ్చయిస్తాయి. జీవుడు ఉత్తమశరీరం పొందుతాడా, మధ్యమశరీరం పొందుతాడా, అధమశరీరం పొందుతాడా అనేది ఆ సంచితకర్మలమీద ఆధారపడివుంటుంది. ఇదీ సూక్ష్మంగా సూక్ష్మశరీరంయొక్క ప్రయాణం.

శ్లో. 8 **శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।**
**గృహీత్వైతాని సంయాతి వాయుర్గన్ధానివాశయాత్ ॥**
శరీరమ్, యత్, అవాప్నోతి, యత్, చ, అపి, ఉత్క్రామతి, ఈశ్వరః,
గృహీత్వా, ఏతాని, సంయాతి, వాయుః, గంధాన్, ఇవ, ఆశయాత్ ॥

| | | | |
|---|---|---|---|
| వాయుః | = వాయువు | (తస్మాత్) | = దాన్నుంచి |
| ఆశయాత్ | = గంధస్థానమునుంచి | ఏతాని | = ఈ మనస్సును, ఇంద్రియములను |
| గంధాన్ ఇవ | = వాసనలను గ్రహించి, తీసికొని పోయినట్లుగా | గృహీత్వా | = గ్రహించి |
| | | చ | = ఇంకా |
| ఈశ్వరః, అపి | = ప్రాణుల దేహములందున్న జీవాత్మయు | యత్, శరీరమ్ | = ఏ శరీరమును |
| | | అవాప్నోతి | = పొందునో |
| యత్ | = ఏ శరీరమును | (తస్మిన్) | = ఆ శరీరమునందు |
| ఉత్క్రామతి | = త్యజించునో | సంయాతి | = చేరును |

**యత్ (ఏషః) ఈశ్వరః శరీరమ్ అవాప్నోతి, అపి చ యత్ ఉత్క్రామతి**
**(తత్) వాయుః ఆశయాత్ గన్ధాన్ ఇవ, ఏతాని గృహీత్వా సంయాతి ॥**

తా: వాయువు గంధస్థానమునుంచి వాసనలను గ్రహించి, తీసికొని పోయినట్లుగా ప్రాణుల దేహములయందున్న జీవాత్మయు ఏ శరీరమును త్యజించునో, దానినుంచి ఈ మనస్సును, ఇంద్రియములను గ్రహించి ఇంకా ఏ శరీరమును పొందునో ఆ శరీరమునందు చేరును.

**యచ్చాప్యుత్క్రామతి** – ఈ పదాన్ని ముందు శ్లోకంలోనే చూశాము. యచ్చ అంటే యత్ చ, ఎప్పుడైతే. ఉత్క్రామతి– ఈ శరీరాన్ని జీవాత్మ వదిలి వెళుతుందో. ఈ వాక్యాన్ని ఎలా పూరించాలి? ఇంతకుముందు శ్లోకంలోని పదాలను తెచ్చుకోవాలి. ఇంద్రియాలను, మనస్సును తీసుకువెళుతుంది. ఈ రెండు వాక్యాలను కలిపి అన్వయం చూస్తే ఇలా ఉంటుంది.

**యదా, జీవః, ఉత్క్రామతి, తదా, ప్రకృతిస్థాని, మనః షష్ఠాని ఇంద్రియాణి కర్షతి**

ఎప్పుడు జీవాత్మ బయటకు వెళుతుందో అప్పుడు స్థూలశరీరంనుంచి మనస్సును, ఇంద్రియాలను తీసుకు వెళుతుంది.

దాని తర్వాత జీవుడు ఏంచేస్తాడు? మనకు తెలిసినవారు ఎవరిదైనా మరణం సంభవించగానే, మనను వెంటనే పట్టి పీడించే సమస్య ఈ జీవుడు ఎక్కడికి వెళతాడు? ఏమవుతాడు? ఎలా వెళతాడు? అతని పరిస్థితి ఏమిటి? ఈ సందేహాలకు కృష్ణపరమాత్మ జవాబు చెబుతున్నాడు.

**శరీరమ్ అవాప్నోతి ఈశ్వరః** – ఇక్కడ ఈశ్వరః అంటే జీవుడు. ఈశ్వరుడంటే ఈశ్వరుడు కాదు, జీవుడు. ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి. జీవుణ్ణి ఈశ్వరుడు అని ఎందుకన్నాడు? దానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి జీవుడు ఎవరో కాదు, ఈశ్వరుడే ప్రతిబింబచైతన్యరూపంలో ఉన్నాడు. చిదాభాస అంటే ప్రతిబింబచైతన్యం అని చూశాము. అందువల్ల జీవుడు కూడా చైతన్యమే అంటే ఈశ్వరుడే.

రెండవ అర్థం – ఈశ్వరుడు అంటే అధిపతి, రాజు. జీవాత్మ ఈ శరీరానికి అధిపతి లేదా రాజు. ఎందుకంటే జీవాత్మ ఉంటేనే శరీరంలో జీవం ఉంటుంది; లేకపోతే జీవం ఉండదు. జీవం ఉంటే శివం, లేకపోతే శవం. అందువల్ల ఈశ్వరుడు అంటే శరీరస్య స్వామి – శరీరంయొక్క స్వామి. ఈ స్వామి శరీరాన్ని వదిలాక ఏమవుతాడు? శరీరం అవాప్నోతి అంటే ఇంకొక శరీరాన్ని తీసుకుంటాడు.

ఇంతకుముందు చూసినట్టుగా అది ఏ శరీరమైనా కావచ్చు. అంటే ఉత్తమశరీరం కాని, మధ్యమశరీరం కాని, అధమశరీరం కాని అవచ్చు. మనిషిగానే పుట్టాలనిలేదు. ఉన్నతలోకాల్లో దేవతల శరీరాన్ని పొందవచ్చు; లేదా ఏ జంతువు శరీరాన్నో పొందనచ్చు. కొంతమంది డార్విన్ చెప్పిన పరిణామసిద్ధాంతం ప్రకారం ఎదుగుతూ వస్తాడు, కోతినుంచి మనిషిగా మారతాడు అంటారు. కాని శాస్త్రం అది ఒప్పుకోదు. ప్రయాణం ఊర్ధ్వముఖంగానే ఉండాలని లేదు అంటుంది. అందువల్లనే వైకుంఠపాళి ఉదాహరణను చూశాము.

ఏ జన్మ పొందాలో ఎవరు నిర్ణయిస్తారు? ఎంతసేపూ తప్పు ఎదుటివారిమీద తొయ్యాలని చూస్తాము. శాస్త్రం ఎవరినీ నిందించకండి, మీ కర్మకు మీరే బాధ్యులు అంటుంది. కర్మఫలం కర్త చేసిన కర్మవల్ల వస్తుంది. కర్త అంటే ఎవరు? మీరే! ఈ జన్మలో మీరు చేసిన కర్మ మీ వచ్చే జన్మను నిర్ణయిస్తుంది. కాకపోతే గీతాబోధ వినే శిష్యులకు కృష్ణపరమాత్మ గొప్ప ధైర్యాన్ని ఇస్తున్నాడు. గీతాబోధ వినే శిష్యులు ఎన్నడూ అధమజన్మ పొందరు. అందువల్ల గీతను మానకుండా వినండి. అసలు గీతాసారాన్ని జీర్ణించుకుంటే మోక్షమే వస్తుంది, పునర్జన్మ ఉండదు. గీత ఉపనిషత్తుల సారమని చూశాము. అందువల్ల ఉపనిషత్తులలాగా, గీతకూడా **మోక్షశాస్త్రము**. ఒకవేళ ఈ మోక్షశాస్త్రాన్ని సరిగ్గా జీర్ణించుకోకపోతే, మళ్ళీ జన్మ ఎత్తాల్సివస్తే అది ఖచ్చితంగా మనుష్యజన్మే అవుతుంది. ఈ హామీని సాక్షాత్తూ కృష్ణపరమాత్మే ఇచ్చాడు.

**న హి కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి** – 6.40

ఆ విధంగా జీవుడు ఇంకొక శరీరాన్ని చేరుకుంటాడు. ముందు శరీరంలోంచి ఇంద్రియాలను, మనస్సును తీసుకువెళతాడని చూశాము. ఇంద్రియాలంటే ఇంద్రియశక్తి అనికూడా చూశాము. ఉదాహరణకు బాహ్యంగా కనపడే కన్నును గోళకం అంటారు; కన్నుకు ఉన్న చూసే శక్తిని ఇంద్రియం అంటారు. ఇప్పుడు ఈ జీవాత్మ మళ్ళీ కొత్తశరీరంలోకి వెళ్ళినప్పుడు, ఆ శరీరంలో గోళకాలు ముందే ఉంటాయి. ఆయా గోళకాల్లో ఆయా

ఇంద్రియశక్తులను పెడుతుంది. ఇల్లు మారినట్టే ఇది కూడా. మనం ఒక ఇంటినుంచి ఇంకో ఇంటికి మారినప్పుడు ఏం చేస్తాము? మనం తీసుకువెళ్ళిన పెట్టెలు విప్పాక, వంటింటి సామాన్లు వంటింట్లో, పూజగది సామాన్లు పూజగదిలో, పడకగది సామాన్లు పడకగదిలో సర్దుకుంటాము. అలాగే జీవుడు తను తీసుకువెళ్ళిన పెట్టెల్ని విప్పాక, ఏ ఇంద్రియాన్ని ఆ గోళకంలో ప్రవేశపెడతాడు. ఆ విధంగా పునర్జన్మ అంటే వేరే ఏమీకాదు, ఒక ఊరునుంచి ఇంకొక ఊరికి మారినట్టే అర్థం. అందువల్ల మరణం గురించి బాధపడనవసరం లేదు.

**గృహీత్వైతాని సంయాతి** – ఏతాని అంటే ఈ మనస్సును, ఇంద్రియాలను తీసుకుని; సంయాతి – ప్రయాణం చేస్తుంది జీవాత్మ. దీనికొక ఉదాహరణను ఇస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**వాయుర్గన్ధానివాశయాత్** – వాయువును జీవాత్మతో పోలుస్తున్నాడు. ఒక పువ్వు ఉందనుకోండి, అది కంటికి కనబడుతుంది. దాన్ని స్థూలశరీరంతో పోల్చవచ్చు. దానికి ఉండే సువాసన తెలుస్తుంది కాని కంటికి కనబడదు. దాన్ని సూక్ష్మశరీరంతో పోల్చవచ్చు. కంటికి కనబడని వాయువు, కంటికి కనబడే పువ్వునుంచి సువాసనను మోసుకుని ప్రయాణం చేస్తుంది. వాయువు సువాసనను మోసుకువస్తోందని ఎలా తెలుసు? వాయువు వీస్తే దానితోపాటు ఆ పరిమళం కూడా మనను తాకుతుంది. అలాగే కంటికి కనబడని జీవాత్మ, కంటికి కనబడే స్థూలశరీరంనుంచి, కంటికి కనబడని మనస్సును (సూక్ష్మశరీరాన్ని) తీసుకువెళుతుంది. ఆశయాత్ అంటే పువ్వు; గంధాన్ అంటే పరిమళం; వాయుః అంటే గాలి. గాలి పువ్వుయొక్క పరిమళాన్ని మోసుకువచ్చినట్టుగా.

పునర్జన్మ ఎప్పుడు పొందుతుంది ఈ జీవాత్మ? వెంటనే పుట్టేసేటట్టయితే శ్రాద్ధకర్మలు చెయ్యనవసరం లేదని ఆశ ఈ మనుష్యులకు. దీనికి జవాబు అందరికీ ఒక్కలాగా ఉండదు. కొందరు ఒక్కరోజులో పుట్టవచ్చు, కొందరు ఒక సంవత్సరంలో పుట్టవచ్చు, కొందరు లక్షసంవత్సరాలయ్యాక పుట్టవచ్చు. అందువల్ల ఒకటే సూత్రం అందరికీ చెల్లదు.

అంతేకాదు, ఇంకొక కారణం కూడా ఉంది. ఈ జన్మలో మరణించిన జీవాత్మ వెళ్ళిన లోకాలలో దేశం, కాలాల కొలతలు వేరేగా ఉంటాయి. మనం చూస్తున్న దేశకాలాల పరిమితులు ఈ జగత్తులో, అది కూడా జాగ్రదావస్థలో ఉన్నంతవరకే, వర్తిస్తాయి. స్వప్నంలో దేశకాలాలు వేరు. స్వప్నకాల పరిమితి ఒకటిన్నర నిముషాలు మాత్రమే అంటారు. కాని అందులో అనేక ప్రాంతాలను చూస్తాము, పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కూడా కంటాము. అలా స్వప్నప్రపంచం దేశకాలాలే జాగ్రదావస్థకు భిన్నంగా ఉంటే, ఇంక మూడులోకాల మాటేమిటి? పితృలోకంలో ఒకరోజు, మన ఒక సంవత్సరంతో సమానం. అలా లోకాన్నిబట్టి కాలం మారుతూ ఉంటుంది. అందువల్లనే శాస్త్రం మూడు తరాలకు శ్రాద్ధకర్మలు చెయ్యమంటుంది. మనం శాస్త్రం చెప్పింది శ్రద్ధగా వినాలి అంతే. జీవాత్మ ఎప్పుడు పునర్జన్మ తీసుకుంటుందని ఆలోచించకూడదు. శాస్త్రంమీద శ్రద్ధనుంచి వచ్చినదే శ్రాద్ధకర్మ పేరు.

ఇంతకీ వాయువు సువాసనను మోసుకువెళ్ళినట్టుగా జీవాత్మ సూక్ష్మశరీరాన్ని మోసుకువెళుతుంది. మనం ఇక్కడ చూస్తున్న ప్రాథమిక అంశాన్ని మర్చిపోకూడదు. ఏమిటది? శరీరం చైతన్యవంతంగా ఉందంటే, దాన్ని చైతన్యవంతం చేసిన మనస్సు ఉందనీ, మనస్సు ఉందంటే దానికి చైతన్యాన్ని అప్పు ఇచ్చిన పరమాత్మ ఉన్నాడనీ నిదర్శనం తెలుస్తున్నది. **జీవించివుండటం భగవంతుని ఉనికికి నిదర్శనమయితే, మరణం భగవంతుని ఉనికికి**

**ఇంకా పెద్ద నిదర్శనం.** ఎందుకు? శివంలా ఉన్న శరీరం కాస్తా శవమైపోయింది. అంటే చిదాభాసరూపంలో ఉన్న ఈశ్వరుడు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోయాడు. చిదాభాస లేకపోతే శరీరం శవమైపోతుంది. ఆ విధంగా జీవితం భగవంతుని ఉనికికి నిదర్శనం, మరణం కూడా భగవంతుని ఉనికికి గొప్ప నిదర్శనం. వచ్చే శ్లోకంలో పుట్టుకకూ–మరణానికీ మధ్య ఉన్న జీవితం కూడా భగవంతుని ఉనికికి గొప్ప నిదర్శనం అని వస్తుంది.అంటే జీవితంలో మనం ఆడినా, పాడినా, ఏంచేసినా, అది భగవంతుని ఉనికిని చాటిచెబుతుంది. అటువంటి భగవంతుణ్ణి చూడకుండా ఎలా ఉండగలము?

ఇదెలా ఉంటుందంటే, విద్యుచ్ఛక్తి ఉందని ఎలా నిరూపించగలము అని అడిగినట్టు ఉంటుంది. ట్యూబ్‌లైటు కాంతిలో కూర్చుని, ఫ్యానుగాలిని అనుభవిస్తూ విద్యుచ్ఛక్తి ఏది అంటే ఏంచెప్పాలి? ట్యూబ్‌లైటు కాంతి, ఫ్యానుగాలి ఎక్కడివి? విద్యుచ్ఛక్తి ఉండటంవల్లనే అవి వస్తున్నాయి. ఫ్యాను తిరుగుతున్నా, లైటు వెలుగుతున్నా, భిన్నమైన ఆకారాల్లో కనిపిస్తున్నా, వాటివెనకనున్నది ఒకటే తత్త్వం. అది కనబడని విద్యుచ్ఛక్తి.

బల్బు కంటికి కనిపిస్తుంది. దానిలో ఉన్న ఫిలమెంటు కంటికి కనిపిస్తుంది. విద్యుచ్ఛక్తి కనబడదు. అలాగే మన స్థూలశరీరం బల్బులాగా కంటికి కనిపిస్తుంది; సూక్ష్మశరీరం ఫిలమెంట్‌లాంటిది, కనబడకపోయినా తెలుస్తుంది. దానికి శక్తినిచ్చే ఆత్మ లేదా బ్రహ్మ విద్యుచ్ఛక్తివంటిది. బ్రహ్మను విద్యుచ్ఛక్తి అనకూడదు – బ్రహ్మ విద్యుచ్ఛక్తిలాగా శక్తిని ఇస్తుంది. ఎలాగైతే కనబడే బల్బు, ఫ్యాను, మైకు, రేడియో, టెలివిజన్‌వంటి వస్తువుల్లో విద్యుచ్ఛక్తియొక్క ఉనికిని తెలుసుకుంటున్నామో, అలా కనబడే ఈ జీవుల కదలికల్లో భగవంతునియొక్క ఉనికిని తెలుసుకుంటాము.

మనం ఊపిరి తీసుకుని, వదులుతున్నామంటేనే చిదాభాసవల్ల చెయ్యగలుగుతున్నాము; చిదాభాస ఉందంటేనే చిత్ ఉందని అర్థం. ఎందుకంటే చిత్ లేనిదే చిదాభాసకు ఉనికి లేదు. ఆ విధంగా ప్రతియొక్క ఇంద్రియంయొక్క పని బ్రహ్మ ఉనికిని చాటి చెబుతున్నాయి. ఈ భావనను కేనోపనిషత్తు అద్భుతంగా చెబుతుంది.

**శ్రోత్రస్య శ్రోతం మనసో మనో యద్ వాచో హ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః** – కేన

ఉదాహరణకు శ్రోత్రస్య శ్రోతం అర్థం చూద్దాము. దీనిద్వారా మూడు విషయాలు అర్థమవుతాయి.

1. ఆత్మ వేరు, చెవి వేరు.
2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది.
3. ఆత్మ ఉండటం వల్లే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము.

ఆ విధంగా ప్రాణానికి ప్రాణశక్తి ఆత్మవల్లనే ఉంది; కన్నుకు కంటిచూపు ఆత్మవల్లనే ఉంది. అందువల్ల చిదాభాస వెళ్ళిపోగానే ఈ గోళకాలకు ఆ శక్తి కూడా వెళ్ళిపోతుంది. చిదాభాస ఉండగా శరీరానికి ఎంతో విలువనిస్తాము. దానికి అలంకరణలు చేసి, సెంట్లు పూసి, నానా హడావుడి చేస్తాము. కాని చిదాభాస మనస్సుతో పాటు బయటకు వెళ్ళిపోతే, ఈ అద్భుతమైన శరీరం కాస్తా శవం అవుతుంది. దుర్గంధం వెదజల్లుతుంది. భార్య కూడా ఎంత త్వరగా ఈ శరీరాన్ని సాగనంపుదామా అని చూస్తుంది.

**యావత్పవనో నివసతి దేహే, తావత్పృచ్ఛతి కుశలం గేహే।**
**గతవతి వాయౌ దేహాపాయే, భార్యా బిభ్యతి తస్మిన్కాయే॥** – భజగోవిందం 6

ఊపిరి పోయిన తర్వాత ప్రియాతిప్రియమైన భార్య కూడా భర్తశవాన్ని చూసి జడుసుకుంటుంది. అలా ఈ జీవాత్మ సూక్ష్మశరీరాన్ని తీసుకువెళుతుంది అంటే పంచజ్ఞానేంద్రియాలను, పంచకర్మేంద్రియాలను, పంచప్రాణాలను, మనస్సును తీసుకువెళుతుంది. తర్వాత ఇంకో శరీరంలోకి వెళుతుంది. ఆ శరీరానికి మనం ఇచ్చే అద్దె కర్మ అంటే పుణ్యపాప ప్రారబ్ధకర్మ. అది వాయువు పుష్పాలయొక్క సుగంధాన్ని మోసుకువెళ్ళినట్టుగా మోసుకువెళుతుందని చూశాము. జీవితంయొక్క సుగంధం ఏమిటి? ఈ పుణ్యపాపాలు. ఆ కొత్తశరీరంలో మళ్ళీ జీవితం కొత్తగా మొదలుపెడుతుంది. అంటే ఎల్.కె.జీ.నుంచి మొదలుపెట్టి, కాలేజీ చదువులు ముగించుకుని, పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కని, మనవళ్ళని కని, ఎప్పుడో ఒక శుభముహూర్తాన మళ్ళీ ఈ శరీరాన్ని వదిలివెళ్ళిపోతుంది. మళ్ళీ ఇంకో చోటికి ప్రయాణం. ప్రయాణం ముగియలేదు, ఇది ఒక అంతులేనికథ.

శ్లో. 9 **శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ।**
**అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే ॥**

శ్రోత్రమ్, చక్షుః, స్పర్శనమ్, చ, రసనమ్, ఘ్రాణమ్, ఏవ, చ,
అధిష్ఠాయ, మనః, చ, అయమ్, విషయాన్, ఉపసేవతే ॥

| | | | |
|---|---|---|---|
| అయమ్ | = ఈ జీవాత్మ | ఘ్రాణమ్ | = ముక్కును |
| శ్రోత్రమ్ | = చెవిని | చ | = ఇంకా |
| చక్షుః | = కంటిని | మనః | = మనస్సును |
| చ | = ఇంకా | అధిష్ఠాయ | = అధిష్ఠించి |
| స్పర్శనమ్ | = చర్మమును | ఏవ | = వీటిద్వారా |
| చ | = అలాగే | విషయాన్ | = శబ్దాది విషయములను |
| రసనమ్ | = నాలుకను | ఉపసేవతే | = అనుభవించును |

**అయమ్ (జీవః) శ్రోత్రమ్ చక్షుః స్పర్శనమ్ చ, రసనమ్**
**ఘ్రాణమ్ మనః చ ఏవ అధిష్ఠాయ విషయాన్ ఉపసేవతే ॥**

తా: ఈ జీవాత్మ చెవిని, కంటిని ఇంకా చర్మమును, అలాగే నాలుకను, ముక్కును ఇంకా మనస్సును అధిష్ఠించి వీటిద్వారా శబ్దాది విషయములను అనుభవించును.

ఈ కంటికి కనబడని ఈ చిదాభాస సూక్ష్మశరీరంలోని 19 అంగాలను తీసుకుని వెళుతుందని చూశాము. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఇంద్రియాలు వేరు, గోళకాలు వేరు. స్థూలశరీరంలో బయటకు కనబడే కన్ను, ముక్కు, చెవివంటివి గోళకాలు. వాటికి చూసే శక్తి, వాసనచూసే శక్తి, వినేశక్తి అసలు ఇంద్రియాలనుంచి వస్తాయి. గోళకాలు ప్రయాణం చెయ్యవు. కొత్త శరీరంలో దాని గోళకాలు దానికి ఉంటాయి.

మళ్ళీ ఆ కొత్త శరీరం మనుష్యశరీరం అయితేనే ఐదు గోళకాలూ ఉంటాయి. ఒకవేళ అది వృక్షశరీరం అయితే, వృక్షానికి పంచజ్ఞానేంద్రియాలు ఉండవు; చర్మం మాత్రమే ఉంటుంది; అంటే స్పర్శశక్తి మాత్రమే ఉంటుంది. అందువల్ల ఆ వృక్షశరీరంలో ఐదు ఇంద్రియాలశక్తీ ఉంటుంది కాని, వాటిని వాడటానికి అవసరమైన గోళకాలు ఉండవు.

ఇక్కడ కృష్ణపరమాత్మ ఈ జీవాత్మ మానవశరీరంలోకి వెళుతుందని తీసుకుని, దానికి తగ్గట్టుగా వివరిస్తున్నాడు. చక్షురింద్రియం చక్షుర్ గోళకంలోకి; శ్రోత్ర ఇంద్రియం శ్రోత్రగోళకానికి వెళతాయి.

**శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ** – అంటే ఈ వినికిడిశక్తి, చూసేశక్తి, స్పర్శ తెలుసుకునే శక్తి, రుచిచూసే శక్తి, వాసనచూసే శక్తిని ఆయా గోళకాల్లో పెడుతుంది.

**అధిష్ఠాయ మనః చ** – ఈ ఇంద్రియాలకు శక్తి మనస్సువల్ల వస్తుంది. అందువల్ల మనస్సు కూడా దానికి సంబంధించిన ప్రదేశంలో ఉండాలి. విజ్ఞానశాస్త్రం మనస్సు మెదడులో ఉంటుంది అంటుంది కాని శాస్త్రం ప్రకారం మనస్సు హృదయంలో ఉంటుంది. ఏ హృదయం? ఆపరేషను చేస్తే కనబడే హృదయమే. హృదయం మనస్సుకు గోళకం అంటే ఆ గోళకం కనబడేదిగా ఉండాలి. హృదయమనే గోళకానికి మనస్సు ఇంద్రియం. అధిష్ఠాయ అంటే ఈ పంచజ్ఞానేంద్రియాలకు, మనస్సుకు జీవాత్మ అధిష్ఠానం. వీటితో కలిసి కొత్త శరీరాన్ని అనుభవిస్తుంది.

కొత్త శరీరానికి ఉన్న తల్లిదండ్రులు మంచివారైతే జీవితం అద్భుతంగా సాగుతుంది. లేకపోతే చాలా అవస్థలు పడాలి. చిన్నప్పటినుంచే చాలా గడ్డురోజులను అనుభవించాల్సి ఉంటుంది కొత్తజన్మలో. కాని ఇటువంటి జీవితాన్ని ఎన్నుకునే హక్కు ఆ పిల్లవానికి ఉండదు; పిల్లవానిని అడిగి అతనికి కావాల్సిన తల్లిదండ్రులను ఇవ్వరు. భార్యను ఎన్నుకునే హక్కు ఉంటుంది కాని తల్లిదండ్రులను ఎన్నుకునే హక్కు ఉండదు. నిజానికి పుట్టటమే వారిద్వారా పుడతాడు. అయితే భగవంతుడు నిర్ణయిస్తాడా అంటే అతని పూర్వజన్మ పుణ్యపాపాలు నిర్ణయిస్తాయని చూశాము. పుణ్యం ఎక్కువుంటే లాలించే తల్లిదండ్రులు, ప్రేమించే అక్కచెల్లెళ్ళు, ఆదుకునే ఇరుగుపొరుగు, మంచి వాతావరణం– అన్నీ చక్కగా అమరుతాయి. అతని అదృష్టం బాగుండకపోతే, పిల్లలను హింసించేవారి మధ్యలో పుడతాడు. మంచి జరిగినా, చెడు జరిగినా పూర్వజన్మే దానికి కారణం.

**విషయాన్ ఉపసేవతే** – ఆ పూర్వజన్మ పుణ్యపాపాలనుబట్టి ఈ జన్మలో అనేకమైన విషయవస్తువులను అనుభవిస్తాడు. కొంతమందిని పెట్టిపుట్టాడు అంటారు, కొంతమంది అష్టదరిద్రంలో పుడతారు. ఏ అనుభవం పొందినా, అది చిదాభాస వల్లనే పొందగలడు. మరణించిన స్థూలశరీరానికి ఏ అనుభవమూ ఉండదు. ఏ అనుభవం పొందినా, అది చిదాభాస ఉనికినీ, తద్వారా చిత్ ఉనికినీ వెల్లడిస్తుంది.

అందువల్ల గ్రహించే మనస్సు ఉంటే, జీవితంలోని ప్రతిఒక్క అనుభవమూ బ్రహ్మను వెల్లడిస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ పుస్తకంలో మీరు చదివే ప్రతిఅక్షరమూ దానిమీద పడుతున్న కాంతిని చూపించకనే చూపిస్తున్నది. కాంతి ఉందని ఏదో ఒకక్షణంలో తెలియటం కాదు, కాంతియొక్క ఉనికివల్లనే మీరు ప్రతిఒక్క అక్షరాన్నీ

చదవగలుగుతున్నారు. మీరు ఎవరితోనైనా సంభాషణ జరిపితే, మీరు మాట్లాడే ప్రతిమాట, మీ మాటను వినే వ్యక్తియొక్క వినికిడిశక్తి అన్నీ బ్రహ్మవల్లనే జరుగుతున్నాయి. కొంతమంది బ్రహ్మ ఉన్నాడని ఏమిటి నిదర్శనం అంటారు. ఏం చెప్పాలి వారికి?

తల్లి తన పిల్లవాణ్ణి 'మన ఇంట్లో కరెంటు లేదు, ఎదురింట్లో ఉందో లేదో అడిగిరా,' అని పంపిందనుకోండి. ఎదిరింట్లో టీవీ మ్రోగుతోంది, ఫ్యాను తిరుగుతోంది, లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. అయినా ఆ పిల్లవాడు, 'ఆంటీ, మీ ఇంట్లో కరెంటు ఉందో లేదో అడిగిరమ్మంది అమ్మ,' అన్నాడనుకోండి; ఎలా ఉంటుంది? కనీసం అలా పిల్లవాడు చేస్తే అర్థం చేసుకోవచ్చు కాని పెద్దలు అడిగితే హాస్యాస్పదంగా ఉంటుంది. అలాగే పరిపక్వత లేనివ్యక్తి దేవుడు ఉన్నాడని ఏమిటి నిదర్శనం అని అడిగితే అర్థం చేసుకోవచ్చు కాని, పరిణితి చెందినవ్యక్తి అడిగితే హాస్యాస్పదంగా ఉంటుంది. అదే చెబుతున్నాడు తర్వాత వచ్చే శ్లోకంలో.

శ్లో. 10 **ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।**
**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥**

ఉత్క్రామంతమ్, స్థితమ్, వా, అపి, భుంజానమ్, వా, గుణాన్వితమ్,
విమూఢాః, న, అనుపశ్యంతి, పశ్యంతి, జ్ఞానచక్షుషః ॥

| | | | |
|---|---|---|---|
| ఉత్క్రామంతమ్ | = జీవుడు శరీరమును వదులుచున్నప్పుడును | గుణానిత్వమ్, అపి | = అలాగే త్రిగుణములతో కూడియున్నప్పుడును |
| వా | = లేక | విమూఢాః | = అజ్ఞానులు |
| స్థితమ్ | = శరీరమందు స్థితుడైయున్నప్పుడును | న, అనుపశ్యంతి | = తెలిసికొనలేరు |
| వా | = లేక | జ్ఞానచక్షుషః | = కేవలము జ్ఞానులే తమ జ్ఞాననేత్రములద్వారా |
| భుంజానమ్ | = భోగములను అనుభవించుచున్నప్పుడును | పశ్యంతి | = స్వస్వరూపమును తెలిసికొందురు |

**ఉత్క్రామన్తమ్ స్థితమ్ వా, భుఞ్జానమ్ గుణ-అన్వితమ్ వా అపి**
**విమూఢాః న అనుపశ్యన్తి, జ్ఞాన-చక్షుషః పశ్యన్తి ॥**

తా: జీవుడు శరీరమును వదులుచున్నప్పుడును లేక శరీరమందు స్థితుడైయున్నప్పుడును లేక భోగములను అనుభవించుచున్నప్పుడును అలాగే త్రిగుణములతో కూడియున్నప్పుడును అజ్ఞానులు తెలిసికొనలేరు. కేవలము జ్ఞానులే తమ జ్ఞాననేత్రములద్వారా స్వస్వరూపమును తెలిసికొందురు.

ఇంతవరకూ వచ్చిన శ్లోకాలు మనస్సును సంసిద్ధం చేసే శ్లోకాలు. ఈ శ్లోకం ముఖ్యమైన శ్లోకం. పరిణితి చెందిన మనస్సు ఉన్నవ్యక్తి ప్రతిఒక్క చర్యలోనూ బ్రహ్మను అర్థం చేసుకుంటాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎలాగైతే కనబడని విద్యుచ్ఛక్తి పనిచేస్తున్న ప్రతి ఒక్క పరికరంలోనూ తెలుస్తుందో, అలా కనబడని బ్రహ్మ, జీవాత్మ చేస్తున్న ప్రతిపనిలోనూ తెలుస్తాడు. ప్రత్యక్షంగా తెలియదు కాని, ఇంతకుముందు చూసినట్టుగా ఒకవ్యక్తి

చేసే ప్రతిఒక్క చర్య అతనిలో ఉన్న చిదాభాసవల్లనే సాధ్యం; చిదాభాస చిత్‌వల్లనే సాధ్యం. ఎందుకంటే చిత్తే చిదాభాసగా భాసిల్లుతున్నది.

మీరు కుంకుమో, విభూతో పెట్టుకోవాలనుకుంటే ఏంచేస్తారు? అద్దంలో మీ మొహాన్ని చూస్తారు ముందు. తర్వాత ఆ కుంకుమనో, విభూతినో అద్దానికి పెడతారా, మీ మొహానికి పెట్టుకుంటారా? నిస్సందేహంగా మీ మొహానికే పెట్టుకుంటారు. ఎందుకంటే అద్దంలో కనబడే మొహానికీ, మీ మొహానికీ మధ్య భేదం లేదని మీకు తెలుసు కాబట్టి. అంటే మీరు చూస్తున్నది మీ ప్రతిబింబమొహాన్ని కాని తెలుసుకుంటున్నది మీ అసలు మొహాన్ని. అంతేకాదు, మొహంమీద ఏదైనా నల్లగా కనబడితే, అద్దంలో మొహాన్ని తుడవకుండా, మీ మొహాన్నే తుడుచుకుంటారు. అంటే ఏమిటి అర్థం? ఆభాస మొహాన్ని చూస్తే బింబమొహాన్ని గుర్తిస్తున్నారు. అదేవిధంగా ఆభాస చైతన్యంతో అనుభవాలు పొందుతూ, ప్రతిక్షణమూ బింబచైతన్యంయొక్క ఉనికిని అనుభవిస్తారు. అందువల్ల పరిణితి చెందిన వ్యక్తులు ప్రతి ఒక్క ఊపిరిలోనూ భగవంతుణ్ణి గుర్తిస్తారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**జ్ఞానచక్షుషః** – జ్ఞానచక్షువులు ఉన్న మేధావులు. అంటే జ్ఞానులు. ఎందుకంటే విద్యుచ్ఛక్తిని మామూలు కళ్ళు చూడలేవు. మామూలు నేత్రాలు తిరిగే ఫ్యానుని చూస్తే, జ్ఞాననేత్రం దాని వెనకనుండి దాన్ని నడిపించే విద్యుచ్ఛక్తిని చూస్తుంది. ఎందుకంటే తెలివైనవ్యక్తికి ఫ్యాను అదంతట అది తిరగదని తెలుసు. ఫ్యాను అదంతట అది తిరిగితే, మనకు కరెంటు బిల్లు పెరగదు.

అదేవిధంగా, ఈ శరీరం ఫ్యానులాంటిది. శరీరం జడం. కాని అది పనులు చేస్తున్నదంటే, దాన్ని వెనకనుంచి నడిపిస్తున్న చైతన్యం ఒకటి ఉంది. అది జ్ఞానచక్షువు ఉన్నవ్యక్తి మాత్రమే అర్థం చేసుకోగలడు; అంటే జ్ఞాని మాత్రమే అర్థం చేసుకోగలడు. ఇంకోవిధంగా చెప్పాలంటే ఆత్మానాత్మవివేకం చెయ్యగలిగిన వ్యక్తి మాత్రమే తెలుసుకోగలడు.

**పశ్యంతి** – తెలుసుకుంటాడు, మామూలు నేత్రాలతో కాదు, జ్ఞాననేత్రంతో. ఏం తెలుసుకుంటాడు? ఈ జీవాత్మ వేరే ఎవరో కాదు, పరమాత్మే. బ్రహ్మయొక్క అవతారమే జీవాత్మ. అద్దంలో కనబడేది ఏమిటి? అసలైన మొహం. అదేవిధంగా చిదాభాసగా (జీవాత్మగా) ప్రతిబింబించేది ఏమిటి? చిత్ లేదా బ్రహ్మ. ఈ చిదాభాస శరీరంలో ఎలా పనిచేస్తుంది?

**స్థితమ్** – ముందు ఈ పదాన్ని చూద్దాము. స్థితమ్ అంటే శరీరంలో నెలకొనివున్నది. శరీరంలో ఉందని ఏమిటి నిదర్శనం? ఏమిటి నిదర్శనం అనే ప్రశ్న మీరు అడగగలగటమే చిదాభాస ఉందని చూపించే నిదర్శనం. అది లేకపోతే మీరు ప్రశ్నే వేయలేరు.

**భుంజానమ్** – ఈ జీవాత్మే అన్నిటినీ అనుభవిస్తున్నది. అంటే ఈ ప్రపంచంలోని శబ్దస్పర్శరసరూపగంధాలను అనుభవిస్తుంది. ఎలా చెప్పగలము? నేను చూస్తున్నాను, నేను వింటున్నాను, నేను వాసన చూస్తున్నాను, నేను రుచి చూస్తున్నాను, నేను స్పర్శను తెలుసుకుంటున్నాను అని చెప్పేది చిదాభాస. ఆవిధంగా జీవాత్మ శరీరంలో ఉండి, అన్నిటినీ అనుభవిస్తున్నది. ప్రతి అనుభవమూ ఒక స్పందనను చూపిస్తుంది. దీపావళి టపాకాయల

శబ్దం వింటే ఆనందమే ఆనందం. అంత డబ్బు ఖర్చుపెట్టి కొన్నందుకు అవి సరిగ్గా కాలుతున్నాయనే ఆనందం. ఏ చిచ్చుబుడ్డో తుస్సుమంటే, మీరు కూడా గాలితీసిన బెలూన్‌లా అయిపోతారు.

శబ్దం ఒకటే కాని దానికి మీ స్పందన మారుతుంది. సాధారణంగా ఈ స్పందనలను మూడు రకాలుగా విభజించవచ్చు. వాటిని సాత్త్విక, రాజసిక, తామసిక స్పందనలు అంటారు. వీటినే వరుసగా శంకరాచార్యులవారు సుఖ, దుఃఖ, మోహ స్పందనలు అంటారు. అదే చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

**గుణాన్వితమ్** – ఇక్కడ గుణం అంటే స్పందన. మూడు రకాల స్పందనలను చూశాము. అన్వితమ్ అంటే జీవాత్మలో ఈ మూడురకాల స్పందనలు ఉన్నాయి. ప్రతి ఒక్క స్పందన కూడా శరీరంలో బ్రహ్మయొక్క ఉనికిని నిరూపిస్తుంది. ఎందుకంటే ప్రాణంపోయిన శరీరంలో ఈ స్పందనలు ఉండవు. దాన్ని కాయం అనీ, కట్టె అనీ అంటారు. ఆ శవాన్ని తాళ్ళువేసి కడతారు, అగ్నిలో దహనం చేస్తారు కాని ఏమీ స్పందన ఉండదు. ఎందుకు? అందులో జీవాత్మ లేదుకాబట్టి. అందువల్ల ప్రతిఒక్క స్పందన కూడా జీవాత్మయొక్క ఉనికిని సూచిస్తుంది. గుణాన్వితం పదం జీవాత్మకు విశేషణం. అది బ్రహ్మయొక్క ప్రతిబింబం. జ్ఞానచక్షుషః పశ్యంతి – జ్ఞానులు మాత్రమే ఆ విషయాన్ని తెలుసుకుంటారు.

**విమూఢాః** – కాని పరిణితిలేని వ్యక్తులు, అజ్ఞానులు,

**నానుపశ్యంతి** – చిదాభాస గురించి తెలుసుకోలేరు. వారు శరీరానికే చైతన్యం ఉంది అనుకుంటారు. ఇది చార్వాక సిద్ధాంతం. చార్వాకులు భగవంతుడు లేడు అంటారు. వారు శరీరమే ఆత్మ అంటారు. శరీరానికి దానంతట అది చైతన్యం ఉంది; దానికి చైతన్యాన్ని భగవంతుడు ఇవ్వనవసరం లేదు అంటారు. కాని శాస్త్రం అది ఒప్పుకోదు. శరీరానికి స్వంతంగా చైతన్యం లేదు. శరీరం చైతన్యవంతంగా ఉందంటేనే అది భగవంతుని కృప. కాని విమూఢులు ఈ విషయం తెలుసుకోలేరు.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ రెండురకాల వ్యక్తుల గురించి చెబుతున్నాడు. జ్ఞాని గురించీ, అజ్ఞాని గురించీ. జ్ఞాని ఒక ఫ్యానునే చూస్తున్నా అందులో రెండు అంశాలు ఉన్నాయని తెలుసుకుంటాడు. అవి కనబడే ఫ్యాను, కనబడని విద్యుచ్ఛక్తి. అవి ఒకదానితో ఒకటి కలిసివున్నట్టుగా ఉన్నా, అవి ఒకటి కాదు, రెండు భిన్నవస్తువులు. కనిపించే ఫ్యాను పాడయినా కూడా, కనబడని విద్యుచ్ఛక్తి ఉంటుంది. అలా ఫ్యానులో రెండు ఉన్నాయి.

శ్లో. 11 **యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్ ।**
**యతంతోఽప్యకృతాత్మానో నైనం పశ్యంత్యచేతసః ॥**
యతంతః, యోగినః, చ, ఏనమ్, పశ్యంతి, ఆత్మని, అవస్థితమ్,
యతంతః, అపి, అకృతాత్మానః, న, ఏనమ్, పశ్యంతి, అచేతసః ॥

| | | | |
|---|---|---|---|
| యోగినః | = యోగులు | చ | = కాని |
| ఆత్మని | = తమ హృదయమందు | అకృతాత్మానః | = అంతఃకరణశుద్ధి లేనివారైన |
| అవస్థితమ్ | = స్థితమైయున్న | అచేతసః | = అజ్ఞానులు |
| ఏనమ్ | = ఈ ఆత్మతత్త్వమును | యతంతః, అపి | = గట్టిగా ప్రయత్నించినను |
| యతంతః | = ప్రయత్నశీలురై | ఏనమ్ | = ఈ ఆత్మను |
| పశ్యంతి | = తెలుసుకొంటారు | న పశ్యంతి | = తెలిసికొనజాలరు |

**యతన్తః యోగినః ఆత్మని అవస్థితమ్ ఏనమ్ పశ్యన్తి, అచేతసః**
**అకృత–ఆత్మానః చ యతన్తః అపి ఏనమ్ న పశ్యన్తి ॥**

తా: యోగులు తమ హృదయమందు స్థితమైయున్న ఈ ఆత్మతత్త్వమును ప్రయత్నశీలురై తెలుసుకొంటారు. కాని, అంతఃకరణశుద్ధి లేనివారైన అజ్ఞానులు గట్టిగా ప్రయత్నించినను ఈ ఆత్మను తెలిసికొనజాలరు.

అదేవిధంగా ఒకే వ్యక్తి కనబడుతున్నా, వేదాంతం నేర్చుకుంటే అతను ఆత్మ, అనాత్మల మేలుకలయిక అని తెలుసుకుంటాడు జ్ఞాని. ప్రతివ్యక్తిలో కనబడే శరీరం, కనబడని చైతన్యం ఉంటాయి. శరీరం పతనమైనాకూడా, చైతన్యం ఉంటుంది. ఆ చైతన్యం శరీరంలో ఒకభాగం కాదు, శరీరం లక్షణం కాదు, దానినుంచి ఉత్పత్తి చెందలేదు. అది స్వతంత్రం.

**యోగినః** – యోగినః అంటే వివేకం ఉన్నవారు, పరిణితి చెందినవారు, జ్ఞానులు.

**ఏనం పశ్యంతి** – శరీరంలో ఉన్న ఈ బ్రహ్మను, జీవాత్మగా తెలుసుకుంటారు. మమైవాంశో జీవలోకే అని అంతకుముందు శ్లోకాల్లో చెప్పాడు. పరమాత్మను తెలుసుకుంటారు. పరమాత్మ ఎక్కడ ఉన్నాడు?

**ఆత్మని అవస్థితమ్** – కార్యకరణసంఘాతంలో ఉన్నాడు. ఇక్కడ ఆత్మ అంటే కార్యకరణసంఘాతం. అంటే మనశ్శరీరాలు. అవస్థితమ్ అంటే ఉన్నాడు. ఎలా ఉన్నాడు? ప్రతిబింబచైతన్యంగా లేదా చిదాభాసగా లేదా జీవాత్మగా ఉన్నాడు. పరమాత్మ జీవాత్మగా ఈ మనశ్శరీరాలలో ఉన్నాడు.

**దేహో దేవాలయః ప్రోక్తః** – పరమాత్మ మన శరీరంలో జీవాత్మగా కొలువైవున్నాడు. అందువల్ల శరీరం ఒక ఆలయం; మనస్సు గర్భగృహం; చైతన్యం భగవంతుడు. నిజానికి ఒక ధ్యానశ్లోకం చాలా అద్భుతంగా ఉంటుంది.

**ఆరాధయామి మణిసన్నిభమాత్మలింగమ్**
**మాయాపురీ హృదయ పంకజ సన్నివిష్టమ్**
**శ్రద్ధానదీ విమల చిత్త జలాభిషేకైః**
**నిత్యం సమాధికుసుమైరపునర్భవైః॥**

ఆ పరమాత్మ నాలో జీవాత్మలింగంగా ఉన్నాడు. ఆ ఆత్మలింగం హృదయమనే పంకజంలో ఉన్నాడు. శుద్ధమైన మనస్సుతో, స్వచ్ఛమైన అంతఃకరణతో నేను భక్తితో ప్రతిరోజూ అభిషేకం చేస్తున్నాను. అభిషేకం రెండురకాల

నీటితో చెయ్యవచ్చు – మామూలు నీటితో, పవిత్రమైన గంగాజలంతో. హృదయపంకజంలో ఉన్న భగవంతునికి ఆలోచనలనే నీటితో అభిషేకం చేస్తున్నాను. ఆ భగవంతుని ధ్యానంలో నెలకొని ఉండటమే పుష్పాలతో అలంకరించటం. ఆ అభిషేకం నిత్యమూ చేస్తే నేను పునర్జన్మనుంచి ముక్తి పొందుగాక, మోక్షం పొందటానికి నాలో కొలువైవున్న ఆత్మలింగానికి పూజచేస్తాను అని ఈ ధ్యానశ్లోకం అర్థం. అదే భావన ఇక్కడ కూడా.

జ్ఞానులు తమలో కొలువైవున్న ఆత్మలింగాన్ని తెలుసుకుంటారు. యోగినః అంటే సాధనచతుష్టయ సంపన్నులు. అంటే వారికి ఆత్మ గురించి తెలుసుకునే అధికారిత్వం వస్తుంది. వారు తెలుసుకుంటారు. ఎలా తెలుసుకుంటారు?

**యతంతః** – సరియైన ప్రయత్నం చెయ్యటంద్వారా. ఏమిటా ప్రయత్నం? ఆధ్యాత్మిక సాధన చెయ్యటమే ప్రయత్నం. అది ఏమిటో చాలాసార్లు చూశాము.

**కర్మయోగేన చిత్తశుద్ధిః, ఉపాసనేన చిత్తఏకాగ్రతా, శ్రవణేన అజ్ఞాననివృత్తిః, మననేన సంశయనివృత్తిః, నిదిధ్యాసనేన వాసనానివృత్తిః॥**

ఇది భగవద్గీత సారాంశం అని చూశాము. కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం చేసి చిత్తఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా ఆత్మజ్ఞానం పొందితే, మోక్షం పొందుతారు. ఈ సాధనలన్నీ చేసితీరాలి. గీతాబోధకు వెళ్ళటం శ్రవణంలోకి వస్తుంది. ఇప్పుడు వీరికి భిన్నంగా అజ్ఞానుల పరిస్థితిని వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**అకృతాత్మానః** – సాధనచతుష్టయ సంపత్తిని పొందనివారు, అధికారిత్వం లేనివారు, అజ్ఞానులు. అకృతం అంటే సంస్కరించబడనివారు; కృతం అంటే సంస్కృతం అంటే సంస్కరించబడినవారు; అకృతం అంటే సంస్కరించబడనివారు. ఆత్మ అంటే ఇక్కడ మనస్సు. అందువల్ల అకృత ఆత్మ అంటే అజ్ఞానులు.

**అచేతసః** – వారికి ఆత్మానాత్మవివేకం చేసేశక్తి ఉండదు. చేతస అంటే వివేకం ఉన్న బుద్ధి; అచేతస అంటే వివేకంలేని బుద్ధి, అవివేకులు.

**ఏనం న పశ్యంతి** – వారు భగవంతుణ్ణి ఎన్నడూ వారి హృదయంలో చూడలేరు. కాని నిజానికి మన పూజను ఆత్మపూజతో మొదలుపెట్టాలి.

**ఆత్మనే నమః, అంతరాత్మనే నమః, పరమాత్మనే నమః, జీవాత్మనే నమః**

ఇలా ఆత్మపూజ చేశాక, బాహ్యంగా ఉన్న భగవంతునికి పూజచేసి, మళ్ళీ ఆత్మపూజతో ముగించాలి. ఆత్మ అంటే వ్యష్టిపరంగా ఉన్న నేను కాదు. కొంతమంది తమకు పూజ అనుకుని దాన్ని గర్వంగా భావిస్తారు. అదికాదు. ఇది భగవంతుడు నాలో నెలకొనివున్నాడు అనే జ్ఞానంతో చేసే పూజ.

**(అకృతాత్మానః న పశ్యంతి) యతంతః అపి** – వారి మనస్సు శుద్ధి చెయ్యబడకపోతే, వారు శాస్త్రాన్ని అధ్యయనం చేసినా కూడా, వారికి ఆత్మజ్ఞానం కలగదు. అది కేవలం ఇంకొక లౌకికవిద్య నేర్చుకున్నట్టు అవుతుంది అంతే. అది అటువంటి వారి గర్వాన్ని రెట్టింపు చేస్తుంది. నేను భగవద్గీత మొత్తాన్ని అధ్యయనం చేశాను, నేను ఉపనిషత్తులు

అన్నీ నేర్చుకున్నాను; బ్రహ్మసూత్రాలు కూడా నేర్చుకున్నాను అని వెన్నువిరుచుకు తిరుగుతారు. మీరు ఎన్ని ఉపనిషత్తులు నేర్చుకున్నారన్నది కాదు ముఖ్యం, మీలో ఎన్ని జీర్ణమయ్యాయన్నది ముఖ్యం. అందువల్ల నేర్చుకునే సాధకుడు అధికారిత్వం పొందకపోతే, అంటే శుద్ధమైన మనస్సు లేకపోతే, ఈ ఆత్మజ్ఞానంవల్ల ఫలం పొందలేడు. అందువల్లనే శాస్త్ర అధ్యయనంతో పాటు, దైవచింతన కూడా తోడుగా సాగాలి. రెండూ సమానంగా ఉండాలి.

ఈ శ్లోకంతో మొదటి అంశం ముగిసింది. పరమాత్మే జీవాత్మగా అందరిలోనూ ఉన్నాడు. అందువల్లనే మన సంప్రదాయం ఎదుటివ్యక్తికి చేతులు జోడించి నమస్కరించమంటుంది. నమస్తే అంటే తే నమః, నీకు నా నమస్కారములు. ఎదుటివ్యక్తికి మన నమస్కారాలను అందుకునే అర్హత లేకపోయినా పెడతాము. ఎందుకంటే మనం పెట్టే నమస్కారం అతనికి కాదు, అతని మనశ్శరీరాల వెనక జీవాత్మగా ప్రకాశిస్తున్న పరమాత్మకు. అశుద్ధమైన మనశ్శరీరాలలో కొలువైవున్న శుద్ధబ్రహ్మకు. దీన్ని సర్వాత్మభావన అంటారు.

**పరమాత్మా జీవరూపేణ వర్తతే**

కృష్ణపరమాత్మ నేనే అన్నింటిగా కనిపిస్తున్నాను అంటున్నాడు. ఈ విషయం ఇప్పటికే 7, 9, 10, 11 అధ్యాయాల్లో చెప్పాడు. విశ్వరూపదర్శనం అంటేనే అంతటా భగవంతుడే ఉన్నాడని తెలుసుకోవటం. ఈ సర్వాత్మభావననే ఈ శ్లోకాల్లో మళ్ళీ టూకీగా చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 12 **యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్ ।**
**యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥**

యత్, ఆదిత్యగతమ్, తేజః, జగత్, భాసయతే, అఖిలమ్,
యత్, చంద్రమసి, యత్, చ, అగ్నౌ, తత్, తేజః, విద్ధి, మామకమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ఆదిత్యగతమ్ | = సూర్యమండలమందున్న | చంద్రమసి | = చంద్రునియందును |
| యత్, తేజః | = ఏ తేజస్సు | యత్ | = ఏది |
| అఖిలమ్, జగత్ | = సమస్తజగత్తును | అగ్నౌ | = అగ్నియందు గలదో |
| భాసయతే | = ప్రకాశింపజేయునో | తత్, తేజః | = ఆ తేజస్సు |
| చ | = ఇంకా | మామకమ్ | = నాదేయని |
| యత్ | = ఏ తేజస్సు | విద్ధి | = తెలుసుకొనుము |

**యత్ ఆదిత్య-గతం తేజః అఖిలమ్ జగత్ భాసయతే, యత్ చ చన్ద్రమసి,**
**యత్ చ అగ్నౌ (స్థితమ్ అస్తి), తత్ మామకమ్ తేజః (అస్తి ఇతి త్వం) విద్ధి ॥**

తా: సూర్యమండలమందున్న ఏ తేజస్సు సమస్తజగత్తును ప్రకాశింపజేయునో, ఇంకా ఏ తేజస్సు చంద్రునియందును, ఏది అగ్నియందు గలదో ఆ తేజస్సు నాదేయని తెలుసుకొనుము.

కృష్ణపరమాత్మ తానే చేతనజీవునిగానూ, అచేతన ప్రపంచంగానూ ప్రకటితమవుతున్నాను అని చెబుతున్నాడు. అందులో మొదటిభాగం 7-11 శ్లోకాల్లో అయింది. జీవరూపంలో ఎలా ప్రకటితమవుతున్నాడో చెప్పుకొచ్చాడు. ఇప్పుడు 12-15 శ్లోకాల్లో అచేతనజగత్తు కూడా తానేనని చెప్పబోతున్నాడు.

**ఈశావాస్యమిదగ్ం సర్వమ్** – ఈశావాస్యోపనిషత్తు

ఈ జగత్తులో ఉన్నదంతా బ్రహ్మే. ఎలా ఉన్నదంతా బ్రహ్మే అవుతుందో కృష్ణపరమాత్మ తార్కికంగా నిరూపించడు. ఎందుకంటే ఆ విషయం అంతకుముందు అధ్యాయాల్లో చూశాము. అయినా ఇప్పుడు సందర్భం వచ్చింది కాబట్టి మళ్ళీ ఒకసారి చూద్దాము.

ఒక వస్తువు సృష్టించబడాలంటే దానికి రెండు కారణాలు ఉంటాయి. నిమిత్తకారణం, ఉపాదానకారణం. ఉదాహరణకు కుండ అనే కార్యం రావాలంటే కుమ్మరి నిమిత్తకారణం, ముడిసరుకు అయిన మట్టి ఉపాదాన కారణం. కాని జగత్తు సృష్టివిషయానికి వచ్చేసరికి భగవంతుడే నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ కూడా.

**అభిన్న నిమిత్త ఉపాదానకారణం బ్రహ్మ**

అనేకరూప ఈశ్వరునిగా భగవంతుణ్ణి భావించటానికి ఉపాదానకారణంగా తెలుసుకోవాలి. ఒక నియమం ఏమిటంటే ఉపాదానకారణం, కార్యం అంతటా ఉంటుంది. ఉదాహరణకు కుండకు ఉపాదానకారణమైన మట్టి కుండ అంతటా ఉంటుంది; ఆభరణానికి ఉపాదానకారణమైన బంగారం ఆభరణం అంతటా ఉంటుంది; కుర్చీకి ఉపాదానకారణమైన చెక్క కుర్చీ అంతటా ఉంటుంది. అంటే ఈ వాక్యాల అర్థం – మట్టి లేకుండా కుండ లేదు; బంగారం లేకుండా ఆభరణాలు లేవు; చెక్క లేకుండా కుర్చీ లేదు.

ఈ సూత్రాన్ని బ్రహ్మకు అన్వయిస్తే బ్రహ్మ జగత్తుకు ఉపాదానకారణం. అందువల్ల జగత్తుకు ఉపాదానకారణమైన బ్రహ్మ జగత్తు అంతటా ఉంటాడు. అంటే బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. మన వేదాంతబోధ ప్రత్యేకత అదే.

జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ. అందువల్లనే మనం భగవంతుణ్ణి అన్నిరూపాల్లోనూ కొలుస్తాము. జంతువులను భగవంతునిగా కొలుస్తాము; మనుష్యులను భగవంతునిగా కొలుస్తాము; చెట్లను భగవంతునిగా కొలుస్తాము; నదులను భగవంతునిగా కొలుస్తాము; పంచభూతాలను భగవంతునిగా కొలుస్తాము. ఎందుకు? భగవంతుడు లేకపోతే వీటికి విడిగా ఉనికి లేదు. అందువల్ల భగవంతుడు అన్నింటిలోనూ ఉన్నాడు. నాలో, నీలో, ఈ బల్లలో, కుర్చీలో, పెన్నులో, మైకులో, పుస్తకంలో – అన్నింటిలో ఉన్నాడు. ఆ పట్టిక ఇస్తూపోవాలంటే ఈ అధ్యాయాన్ని ముగించలేము.

అందువల్ల కృష్ణపరమాత్మ సృష్టిలో ఉన్న కొన్ని ముఖ్యమైన అంశాలను తీసుకుని అవి నా ప్రకటితరూపాలే అంటున్నాడు. భగవంతుడు వాటిలో మాత్రమే కాదు, అలా అన్నింటిలోనూ ఉన్నాడని అర్థం. కృష్ణపరమాత్మ తీసుకున్న అంశాలు మనం నిరంతరం అనుభవిస్తున్న ప్రాథమిక, సహజమైన శక్తులు. వాటిని మనం సృష్టించలేదు. అవి భగవంతుని సృష్టి. ఈ సహజమైన శక్తులు లేకుండా, జగత్తు కొనసాగలేదు. ఏమిటవి? సూర్యశక్తి, చంద్రశక్తి, అగ్నిశక్తి. కృష్ణపరమాత్మ శక్తి పదం బదులు తేజః అంటున్నాడు. అందువల్ల శక్తి తీసి తేజః పెడితే వరుసగా సూర్యతేజః, చంద్రతేజః, అగ్నితేజః.

ఈ మూడూ చాలా గొప్ప శక్తులు. వాటి లోతులు కొలిచినకొద్దీ ఆశ్చర్యపడకుండా ఉండలేము. విజ్ఞానశాస్త్రం సూర్యభగవానుని గురించి ఇంకా పరిశోధిస్తూనే ఉంది కాని, ఇంకా ఆ శాస్త్రానికి అంతుపట్టని విషయాలు ఉంటూనే ఉన్నాయి. నేనే ఈ సూర్యశక్తిగా, చంద్రశక్తిగా, అగ్నిశక్తిగా ఉన్నాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఆదిత్యగతం తేజః** – తేజః అంటే శక్తి అని చూశాము. తక్కిన శక్తులు అయిపోయినా కూడా సౌరశక్తికి అంతం ఉండదు. అందువల్లనే సౌరశక్తిని అనేక విధాలుగా ఉపయోగించటానికి ప్రయత్నిస్తున్నారు. సూర్యునిలో శక్తిని నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అఖిలం జగత్ భాసయతే** – ఈ సూర్యశక్తి మొత్తం జగత్తును ప్రకాశింపజేస్తుంది. ఒక పెద్దహాలు దేదీప్యమానంగా వెలగాలంటే, అనేక దీపాలు పెడతాము అందులో. కాని ఇటువంటి హాలు ఒక్కటే కాదు, మొత్తం జగత్తు అంతటినీ ప్రకాశింపజేయాలంటే ఎంత కాంతి కావాలో ఒక్కసారి ఊహించుకోండి. సూర్యుని కాంతి ఎన్నడూ క్షీణించదు; ఎన్నడూ అంతమవదు.

**యత్ చంద్రమసి (తేజః)** – తేజః పదం మనం కలుపుకోవాలి. చంద్రకాంతి కూడా నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. మనకు విజ్ఞానశాస్త్రం ప్రకారం చంద్రకాంతి చంద్రుని స్వంతం కాదు, సూర్యుణ్ణుంచి అరువు తెచ్చుకున్న కాంతి అని తెలుసు. అంటే సూర్యకాంతి చంద్రునిలో ప్రతిబింబిస్తోంది. అంటే చంద్రకాంతి సూర్యునియొక్క చిదాభాస. అయితే ఏం? నిండుపున్నమిరాత్రి చంద్రుడు కురిపిస్తున్న పండువెన్నెల పుచ్చపువ్వులా ఈ భూమి అంతటినీ ప్రకాశింపజేస్తుంది. నిజానికి పున్నమివెన్నెల ఎంత కాంతివంతంగా ఉంటుందంటే, ఆ వెన్నెల్లో మీరు ఈ పుస్తకాన్ని చదవవచ్చు. అంటే చిదాభాసే ఎంత శక్తివంతంగా ఉందో చూడండి! ఆ చంద్రతేజస్సును నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**యత్ చ అగ్నౌ (తేజః)** – ఇక్కడ కూడా తేజః పదం కలుపుకోవాలి. అగ్నిలో ఉన్న అగ్నితత్త్వాన్ని నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**తత్ తేజః మామకమ్ విద్ధి** – ఆ తేజస్సులన్నీ నేనే అని తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్లనే మన శాస్త్రం సూర్యభగవానుని ప్రార్థనతో రోజును ప్రారంభించమంటుంది.

**ఓం మిత్రస్య చర్షణీధృతః శ్రవో దేవస్య సానసిమ్ । సత్యం చిత్రశ్రవస్తమమ్ ।**
**మిత్రో జనాన్ యాతయతి ప్రజానన్మిత్రో దాధార పృథివీముత ద్యామ్ ।**
**మిత్రః కృష్టీరనిమిషాఽభిచష్టే సత్యాయ హవ్యం ఘృతవద్విధేమ ।** – సంధ్యావందనము

ఈ సూర్యభగవానుడే అన్ని జీవరాశులకు పోషణకర్త. సూర్యుడు లేకపోతే సౌరమండలానికి ఉనికిలేదు; పృథివికి ఉనికిలేదు. సూర్యుడు కొన్ని కోట్లమైళ్ళ దూరంలో ఉన్నా, ఆయన కాంతే భూమ్మీద జీవరాశులను పోషిస్తోంది అంటే ఎంత అద్భుతమో చూడండి. మిత్రోదాధార పృథివీముత ద్యామ్ అంటే పృథివికి ఈ సూర్యుడే ఆధారం. మిత్రః అంటే సూర్యుడు. పొద్దున్న మాత్రమేనా? మధ్యాహ్నం కూడా సూర్యుడే ఆధారం.

**మధ్యాహ్నిక సూర్యోపస్థానమ్**

**ఆసత్యేన రజసా వర్తమానో నివేశయన్నమృతం మర్త్యం చ ।**
**హిరణ్యయేన సవితా రథేనా౽౽ దేవో యాతి భువనా విపశ్యన్**

సూర్యకాంతి విటమిన్ డి ఇస్తుంది. అందువల్లనే విదేశాల్లో ఎండాకాలంలో ఆరుబయట ఎండలో కాసేపు పడుకుంటారు. శరీరానికి సూర్యరశ్మి సోకాలి. అంతేకాదు, మన దినచర్య కూడా సూర్యుని దినచర్యతో పెనవేసుకుని ఉంటుంది. పూర్వం గూట్లో దీపం, నోట్లో ముద్ద అనేవారు. సూర్యాస్తమయం కాగానే, భోజనం చేసేసి, పెందరాళే పడుకుని, సూర్యుడు రాకముందే లేచేవారు. భగవంతుడు సూర్యుని రూపంలో మనకు ప్రత్యక్షమవుతాడు కాబట్టి పొద్దున్నే లేచి ఆయనను స్వాగతించాలి అంటుంది శాస్త్రం.

అంతేకాదు, మనలో జీర్ణక్రియకు తోడ్పడే రసాయనాలు కూడా మధ్యాహ్నం 12-1 గంటల లోపు ఊరుతాయి. అందువల్ల పొద్దున్న భోజనం త్వరగా చేయాలని అంటారు. అలాగే రాత్రి అయ్యేసరికి, ఈ జీర్ణక్రియశక్తి కూడా తగ్గుతూ వస్తుంది. అందువల్ల రాత్రిపూట అల్పాహారం తీసుకోవాలి అంటారు. ఆ విధంగా మన జీవనవిధానం సూర్యభగవానునితో పెనవేసుకుని ఉంటుంది.

అదేవిధంగా చంద్రుడు కూడా మనకు ప్రత్యేకమే. పౌర్ణమి చాలా ముఖ్యమైన రాత్రి. పౌర్ణమితో ముడివడి మనకు అనేక పూజలు కూడా నిర్దేశించబడ్డాయి. ఉదాహరణకు కార్తీకపౌర్ణమి ఒకటి. ఇంక అగ్ని గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

**అగ్నిమీళే పురోహితమ్** – ఋగ్వేదము

మన శాస్త్రం విధించిన నిత్యనైమిత్తిక కర్మలలో అగ్ని ఉపాసన ఉంటుంది. అనేక యజ్ఞయాగాదులలో అగ్నిహోమం ఉంటుంది. ఈ విధంగా సూర్యశక్తి, చంద్రశక్తి, అగ్నిశక్తులు చాలా ముఖ్యమైనవి. వాటిని నిర్లక్ష్యం చెయ్యకూడదు. ముందు ఈ మూడింటినీ పేర్కొని, ఇప్పుడు రాబోయే శ్లోకాల్లో వాటి గొప్పదనాన్ని వివరించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 13 **గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా ।**
**పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః ॥**

గామ్, ఆవిశ్య, చ, భూతాని, ధారయామి, అహమ్, ఓజసా,
పుష్ణామి, చ, ఓషధీః, సర్వాః, సోమః, భూత్వా, రసాత్మకః ॥

| | | | |
|---|---|---|---|
| చ | = ఇంకా | చ | = ఇంకా |
| అహమ్ | = నేనే | రసాత్మకః | = రసస్వరూపుడగు |
| గామ్, ఆవిశ్య | = భూమిని ప్రవేశించి | సోమః, భూత్వా | = చంద్రుడనై |
| ఓజసా | = (నా) శక్తిద్వారా | సర్వాః, ఓషధీః | = ఓషధులకు అన్నింటికిని |
| భూతాని | = సకల భూతములను | పుష్ణామి | = పుష్టిని చేకూరుస్తున్నాను |
| ధారయామి | = ధరించి, పోషించుచున్నాను | | |

**అహమ్ చ గామ్ ఆవిశ్య భూతాని ఓజసా ధారయామి ।**

**రసాత్మకః సోమః భూత్వా చ సర్వాః ఓషధీః పుష్ణామి ॥**

తా: ఇంకా నేనే భూమిని ప్రవేశించి నా శక్తిద్వారా సకల భూతములను ధరించి, పోషించుచున్నాను. ఇంకా రసస్వరూపుడగు చంద్రుడనై ఓషధులకు అన్నింటికిని పుష్టిని చేకూరుస్తున్నాను.

ఈ శ్లోకంలో సూర్యశక్తి గురించి, చంద్రశక్తి గురించీ చూస్తాము.

**గామ్ ఆవిశ్య** – సూర్యశక్తియొక్క గొప్పతనాన్ని చూడబోతున్నాము. సూర్యకిరణాలు భూమ్మీదకు ప్రసరిస్తాయి. సూర్యుడు ఉదయించాక తన కిరణాలను అంతటా వెదజల్లుతాడు. తన కిరణాలద్వారా అన్ని జీవరాశులకు ప్రాణశక్తిని ప్రసాదిస్తాడు. అందువల్ల సూర్యుణ్ణి పోషణకర్త అంటారు. గామ్ అంటే పృథివిలో; ఆవిశ్య అంటే ప్రవేశించాక;

**భూతాని** – సూర్యకిరణాలు అన్ని జీవరాశుల్లోకి ప్రవేశిస్తాయి. అందువల్లనే సూర్యోదయానికి ముందే లేవాలని, నదిలో స్నానం చెయ్యాలని, గుడిలో ప్రదక్షిణలు చెయ్యాలని నిర్దేశించింది శాస్త్రం. ఆ విధంగా సూర్యకాంతి మన శరీరంమీద పడుతుందనేది వారి ఉద్దేశం. సూర్యకాంతిని ప్రాణశక్తి అంటారని చూశాము.

అందువల్లనే ప్రాణిక్‌హీలర్స్ సూర్యుణ్ణుంచి ప్రాణిక్ ఎనర్జీని స్వీకరించి, ఎదుటివ్యక్తిలోని ప్రాణమయకోశానికి అందిస్తారు. ఎందుకంటే, ప్రాణమయకోశానికి శక్తిని ఇచ్చేది సూర్యభగవానుడే. భూతాని అంటే ఇక్కడ పంచభూతాలు కాదు, సర్వజీవరాశులు.

**ధారయామి** – నేను పోషిస్తున్నాను. నేను ఎవరు? కృష్ణపరమాత్మ.

**అహమ్ ఓజసా** – నేను ప్రాణశక్తిద్వారా జీవరాశులను పోషిస్తున్నాను. ఓజసా అంటే ప్రాణశక్తి. ఈ ప్రాణశక్తి ప్రత్యక్షంగా ప్రాణమయకోశానికీ, పరోక్షంగా అన్నమయకోశానికీ, మనోమయకోశాలకూ కూడా శక్తిని ఇస్తుంది. అందువల్ల మన దినసరి ప్రార్థనలో ఆదిత్యహృదయం చాలా శక్తివంతమైన ప్రార్థన. ఆదిత్యహృదయం తెలియకపోతే, అది నేర్చుకుని రోజూ ప్రార్థన చేస్తే ఆ ప్రార్థన అన్ని కోశాలకూ శక్తిని ఇస్తుంది. గాయత్రీమంత్రం తెలియనివారు, వారి సంధ్యావందన ప్రార్థనతో ఆదిత్యహృదయాన్ని జతచేసుకోవచ్చు. ఎందుకంటే, ఇది ఒక విధంగా సూర్యదేవుణ్ణి ఆవాహన చేసే మంత్రం. ఇదీ సూర్యునిరూపంలో కృష్ణపరమాత్మ అందిస్తున్న శక్తి.

**రసాత్మక సోమః భూత్వా** – ఇప్పుడు చంద్రశక్తి గురించి చెబుతున్నాడు. నేను చంద్రకాంతిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎటువంటి చంద్రశక్తి? రసాత్మకః అంటే చెట్లకు కావాల్సిన పోషకశక్తిని ఇస్తాడు చంద్రుడు. రసం అంటే వృక్షాలలో ఉన్న పోషకశక్తి.

**ఓషధీః సర్వాః పుష్ణామి** – నేను చంద్రకాంతిద్వారా చెట్లకు ఔషధులను ఇస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. కొంతమంది రైతులు విత్తనాలను నాటేముందు ఆ విత్తనాలను చంద్రునికాంతిలో పెడతారుట. అలా పెడితే అవి చంద్రకాంతినుంచి శక్తిని పొందుతాయట. ఆ విధంగా మనుష్యులకు శక్తినిచ్చే సూర్యశక్తిని నేను, చెట్లకు శక్తినిచ్చే చంద్రశక్తిని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 14 **అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
**ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥**
అహమ్, వైశ్వానరః, భూత్వా, ప్రాణినామ్, దేహమ్, ఆశ్రితః,
ప్రాణాపానసమాయుక్తః, పచామి, అన్నమ్, చతుర్విధమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేనే | వైశ్వానరః భూత్వా | = వైశ్వానరాగ్నినై |
| ప్రాణినామ్ | = సకల ప్రాణులయొక్క | చతుర్విధమ్ | = నాలుగు విధములైన |
| దేహమ్, ఆశ్రితః | = దేహమందుండి | అన్నమ్ | = ఆహారమును |
| ప్రాణాపానసమాయుక్తః | = ప్రాణాపానములతో గూడిన | పచామి | = జీర్ణింపజేయుదును |

**అహమ్ ప్రాణినామ్ దేహమ్ ఆశ్రితః ప్రాణ-అపాన-సమ-ఆయుక్తః**
**వైశ్వానరః భూత్వా చతుర్విధమ్ అన్నమ్ పచామి ॥**

తా: నేనే సకల ప్రాణులయొక్క దేహమందుండి ప్రాణాపానములతో గూడిన వైశ్వానరాగ్నినై, నాలుగు విధములైన ఆహారమును జీర్ణింపజేయుదును.

ఈ శ్లోకంలో అగ్నిశక్తి గురించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. శాస్త్రము అగ్నితత్త్వాన్ని రెండు విధాలుగా విభజించింది. అవి బాహ్యాగ్ని, ఆంతర అగ్ని. బాహ్యాగ్ని అంటే యజ్ఞాలలో వాడే అగ్ని; ఆంతరాగ్ని అంటే మన ఉదరంలో ఉన్న అగ్ని. దాన్ని జఠరాగ్ని అని, వైశ్వానరాగ్ని అనికూడా అంటారు. ఈ వైశ్వానరాగ్ని మనం తిన్న ఆహారాన్ని మళ్ళీ లోపల వండుతుంది.

శరీరం స్వీకరించే ఆహారం రెండు విధాలుగా వండబడుతుంది. మనం ఆహారం తీసుకునేముందు బాహ్యంగా వండబడుతుంది. అంటే కూరలను, అన్నాన్ని వండి వాటిని తింటాము. ఇక్కడ మనం నాచురోపతి గురించి మాట్లాడటం లేదు. నాచురోపతిలో పచ్చికూరలు మంచివి అంటారు. కొన్ని కూరలను, పండ్లను తొక్కలతో తింటే మంచిది అంటారు. విదురుడు కృష్ణపరమాత్మ తన ఎదురుగా కూర్చుంటే, తన భక్తితన్మయత్వంతో పండునుపారేసి, కృష్ణునికి తొక్కను సమర్పించాడు. ఈ విషయాన్ని పక్కనపెడితే, మామూలుగా కూరలను వండి, వాటికి కొత్తిమీర, కరివేపాకు, పొడులు వేసి, మరింత రుచికరంగా చేసుకుని తింటాము. అలా మొదటిమార్పు బాహ్యంగా అవుతుంది. పచ్చికూరగాయలు, దినుసులు వండబడి, ఆహారంగా స్వీకరించబడతాయి.

రెండవరకం వంట, కడుపులో జరుగుతుంది. మనం తిన్న ఆహారం మళ్ళీ వండబడుతుంది. ఆ వంటను వైశ్వానరాగ్ని చేస్తుంది. విజ్ఞానశాస్త్రం ఈ అగ్నిని రసాయనాలు అంటుంది. ఈ రసాయనాల్లో అనేక ఆసిడ్లు, ఎంజైములు ఉంటాయి. అందువల్లనే ఈ ఆసిడ్లు ఊరినప్పుడు, అవి తినటానికి కడుపులో ఆహారం పడకపోతే, అవి మన కడుపునే తినేస్తాయి. ఈ రసాయనాలు ఊరినప్పుడే ఆహారం తీసుకోవాలని ఇందాక కూడా చూశాము. ఆహారం లేకపోతే, అవి కడుపును మండిస్తాయి. దాన్నే అల్సర్, గ్యాస్ట్రిక్‌ట్రబుల్ అంటారు.

ఆ విధంగా మనం తీసుకున్న ఇడ్లీలు, దోశలు, అన్నం, కూరలు, అన్నీ కడుపులో వండబడి, అవి కార్బోహైడ్రేట్ ఫ్యాట్, ప్రోటీన్, మినరల్లుగా మారుతాయి. ఈ విధంగా మనం తినే ఆహారం రెండుసార్లు వండబడుతుంది. బాహ్యంగా వండేది బాహ్యాగ్ని, ఆంతరంగా వండేది వైశ్వానరాగ్ని. ఆ వైశ్వానరాగ్నిని నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. పంచప్రాణాల్లో సమానప్రాణం పని ఇలా వండటం. ఈ జీర్ణశక్తి భగవంతునిశక్తి కాబట్టి, మనం ఆహారం తీసుకునేముందు భగవంతుణ్ణి ప్రార్థించి, మనం తీసుకుంటున్న ఆహారాన్ని ఆయనకు సమర్పించాలి. ఏ భగవంతునికి? మన కడుపులో ఉన్న భగవంతునికి; అంటే వైశ్వానరాగ్నికి. అందువల్ల తినటాన్ని కూడా అగ్నిహోత్రకర్మగా భావిస్తుంది శాస్త్రం. ఛాందోగ్యోపనిషత్తు ఇలా ఆహారం తీసుకోవటాన్ని ప్రాణాగ్నిహోత్రంగా వర్ణించింది. ఇలా మీరు వైశ్వానరాగ్నికి ఆహారం సమర్పిస్తారు కాబట్టి నేను నిత్యాగ్నిహోత్రుణ్ణి అని చెప్పుకోవచ్చు ఎవరికైనా.

అందువల్ల, భోజనం చేసేముందు ప్రాణాయస్వాహా, అపానాయస్వాహా అంటారు. అలా చెప్పేటప్పుడు ఆహారాన్ని చప్పరించకుండా మింగేయాలి. అది సరాసరి వైశ్వానరాగ్నికి వెళ్ళాలి.

బృహదారణ్యకోపనిషత్తులో వైశ్వానరాగ్నిమీద ప్రత్యేకమైన ఉపాసన ఉంది. ఆకలిమీద, లేదా ఈ జీర్ణశక్తిమీద ఉపాసన చెయ్యాలి. ఆకలి వేస్తోందని ఎలా తెలుస్తుంది? లోపల్నుంచి రకరకాల శబ్దాలు వినిపిస్తాయి. పేగులు అరుస్తున్నాయి అంటారు కొందరు. అంటే ఈ శబ్దాలు జీర్ణక్రియశక్తిని సూచిస్తాయి. అందువల్ల ఆ శబ్దంమీద ధ్యానం చెయ్యమంటుంది ఉపనిషత్తు. అదికూడా ఆ శబ్దాన్ని భగవంతునిగా భావించి ధ్యానం చెయ్యాలంటుంది.

**అయమగ్నిర్వైశ్వానరో యోఽయమన్తః పురుషే యేనేదమన్నం పచ్యతే**
**యదిదమద్యతే తస్యైష ఘోషో భవతి**

ఘోష అంటే అంతర్గత శబ్దం. ఆ శబ్దాన్ని వైశ్వానరాగ్నిశక్తిగా భావించి, ఆ శబ్దంమీద ఉపాసన చెయ్యాలి అంటుంది ఉపనిషత్తు. అదే విషయాన్ని కృష్ణపరమాత్మ సూచిస్తున్నాడు ఇక్కడ.

**అహం వైశ్వానరో భూత్వా** – నేనే ఆంతర అగ్నిశక్తిగా ఉన్నాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ కృష్ణపరమాత్మ బాహ్యశక్తి గురించి చెప్పటం లేదు. అదికూడా కలుపుకోవచ్చు మనం. ఆంతరశక్తిగా ఎక్కడ ఉన్నాడు కృష్ణపరమాత్మ?

**ప్రాణినాం దేహమాశ్రితః** – అన్ని ప్రాణుల శరీరంలో ఉన్నాను. సమానాగ్ని శరీరం మధ్యలో ఉంటుంది. భగవంతుడు ఈ అగ్నిరూపంలో ఏంచేస్తాడు?

**చతుర్విధం పచామ్యన్నమ్** – మనిషి తినే నాలుగురకాల అన్నాన్ని వండుతాడు. మనం తిన్న ఆహారం మళ్ళీ లోపల వండబడి మనకు కావాల్సిన కొవ్వుపదార్థాలుగా, ప్రొటీనులుగా మారుతుందని చూశాము. చతుర్విధ అన్నం అంటే ఏమిటి? దక్షిణ భారతీయుణ్ణి అడిగితే సాంబారు అన్నం, చారుఅన్నం, పెరుగుఅన్నం, పాయసం అంటాడు. కాని అది దేశంలో ఒక భాగానికి చెందిన ఆహారనియమం. కృష్ణపరమాత్మ మాట్లాడేది మొత్తం మానవాళి తీసుకునే ఆహారం గురించి. నిజానికి ఒకరాష్ట్రంలో తినే భోజనానికి, ఇంకో రాష్ట్రంలో తినే భోజనానికి చాలా భేదం ఉంటుంది. కాని ఆ విధమైన భేదాలు చెప్పటంలేదు కృష్ణపరమాత్మ. మనం ఆహారాన్ని తినే తీరునిబట్టి నాలుగువిధాలుగా విభజించాడు. వాటిని భక్ష్య, భోజ్య, లేహ్య, చోషణాలు అంటారు. అవేమిటో

వివరంగా చూద్దాము.

**భక్ష్యమ్** – ఆహారంగా తీసుకునే ఘనపదార్థం ఏదైనా. కొరికితినే ఆహారం. దాన్ని చర్వణం అంటారు. ఒక వయస్సు వచ్చాక, కొన్ని కొరికి తినలేము. కట్టుడుపళ్ళు ఉన్నా వాటితో ధైర్యంగా తినలేము.

**భోజ్యమ్** – మనం ఆహారంగా తీసుకునే ద్రవపదార్థం. పాలు, కాఫీ, టీ, సూప్‌వంటి ద్రవపదార్థాలు. వీటిని కొరికి తిననవసరం లేదు. మింగేస్తాము.

**లేహ్యమ్** – నాకి తినాలి. దాన్ని అలాగే గొంతులో వేసుకోలేము. ఉదాహరణకు తేనె. తేనె చాలా చిక్కగా ఉంటుంది. దాన్ని నాకి తినాలి. ఊరగాయలన్నీ లేహ్యంలోకి వస్తాయి. లేహ్యం తీసుకునేటప్పుడు నాలుకను బయటకు చాపుతాము.

**చోష్యమ్** – లోపలికి పీల్చేది. ఉదాహరణకు చెరుకుగడ. దాన్ని కొరికి, దాని రసాన్ని లోపలికి పీలుస్తాము. ఇప్పటి ఉదాహరణ చెప్పాలంటే స్ట్రాతో తాగే కోకోకోలావంటి డ్రింకు ఏదైనా. భోజ్యానికి తల పైకెత్తి తాగుతారు; చోష్యానికి తలవంచి తాగుతారు. రసం మామిడిపండు కూడా ఈ తెగకిందికే వస్తుంది. పండుని కింద నొక్కుతూ, పైనుంచి ఆ రసాన్ని లోపలికి పీలుస్తారు.

ఆహారం ఆ విధంగా నాలుగురకాలుగా ఉంది. భక్ష్యం, భోజ్యం, లేహ్యం, చోష్యం. ఇవికాక ఐదవరకం ఉందేమో ఆలోచించిండి! ఇంకొకరకం లేదు. గొట్టాలు వేసి ఆహారాన్ని లోపలికి పంపటం గురించి చెప్పకూడదు. అది సహజంగా తీసుకునే పద్ధతి కాదు. ఈ నాలుగురకాల ఆహారాన్నీ నేను వైశ్వానరాగ్ని రూపంలో వండుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

బాహ్యాగ్నిని తీసుకుంటే ఒకప్పుడు ఆ అగ్నిజ్వాల పెద్దదవటానికి దాన్ని విసనకర్రతో విసిరేవారు. ఇప్పుడు గ్యాసుస్టవ్‌లు వచ్చాయి కాబట్టి ఆ విషయం కూడా కొందరికి తెలియకపోవచ్చు. పూర్వం గాడిపొయ్యిల్లో వంట చేసేవారు. అనేక యజ్ఞాలు, యాగాలు చేసేవారు. వాటిలో అగ్నిజ్వాల పుంజుకోవటానికి బాగా విసిరేవారు. విసనకర్ర కాకపోతే ఒక పొగగొట్టం ఉండేది. దానితో బాగా ఊదేవారు.

అలా బాహ్యాగ్నిని అధికశ్రమతో ఎక్కువ చెయ్యాల్సివుంటే, లోపల ఉన్న అగ్నికి విసనకర్ర ఏది? దానికి కూడా ఉంది విసనకర్ర.

**ప్రాణాపానసమాయుక్తః** – అలా విసిరేవి పంచప్రాణాల్లోని ప్రాణం, అపానం. ప్రాణ, అపానాలు గాలిని లోపలికి పీల్చుకోవటానికి, బయటకు వదలటానికి తోడ్పడతాయి. ఏదైనా అధికశ్రమపడితే, ఆయాసం వచ్చి ఊపిరిపీల్చి వదలటం వేగంగా జరుగుతుంది. అలా గాలి వేగంగా పీల్చివదిలితే, లోపల అగ్ని త్వరగా వేడెక్కుతుంది. అంటే వైశ్వానరాగ్ని పెద్దజ్వాలగా అవుతుంది; అది పెద్దదిగా అయితే మీకు బాగా ఆకలివేస్తుంది.

దీనికి భిన్నంగా ఊపిరి తీసుకునే చర్య నిదానంగా జరిగితే, ఆకలి తగ్గుతుంది. దీన్ని అన్వయవ్యతిరేక పద్ధతి

అంటారు. ఊపిరి పీల్చుకుని వదలటం వేగంగా జరిగితే ఆకలి ఎక్కువవుతుంది; నిదానంగా జరిగితే ఆకలి తక్కువవుతుంది. దీన్నిబట్టి వైశ్వానరాగ్నిని ఎక్కువ తక్కువలు చేసేది ప్రాణ అపాన ప్రాణశక్తులు అని అర్థమవుతున్నది. ప్రాణం అంటే గాలిని బయటకు వదలటం లేదా నిశ్వాస; అపానం అంటే గాలిని లోపలికి పీల్చటం లేదా ఉచ్ఛ్వాస. సమాయుక్తం అంటే వీటితో కూడిన. ఇప్పుడు వీటన్నిటినీ కలిపి వాక్యం చేస్తే, ప్రాణాపాన ప్రాణశక్తులతో శక్తి పుంజుకున్న వైశ్వానరాగ్ని రూపంలో మనిషి తిన్న నాలుగురకాల ఆహారాన్ని నేను వండుతాను. అంటే జీర్ణక్రియకు తోడ్పడుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే సృష్టిలో నన్ను సూర్యశక్తిగా, చంద్రశక్తిగా, అగ్నిశక్తిగా చూడు అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆ విధంగా కృష్ణపరమాత్మ సర్వాంతర్యామి.

శ్లో. 15 **సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ ।**
**వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥**
సర్వస్య, చ, అహమ్, హృది, సన్నివిష్టః, మత్తః, స్మృతిః, జ్ఞానమ్, అపోహనమ్, చ,
వేదైః, చ, సర్వైః, అహమ్, ఏవ, వేద్యః, వేదాంతకృత్, వేదవిత్, ఏవ, చ, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేనే | అపోహనమ్ | = మరుపు |
| సర్వస్య, హృది | = ప్రతిప్రాణియొక్క హృదయమందు | (భవతి) | = (కలుగుతాయి) |
| సన్నివిష్టః | = అంతర్యామిగా ఉంటాను | చ | = ఇంకా |
| చ | = ఇంకా | సర్వైః, వేదైః | = వేదములన్నింటిద్వారా |
| మత్తః | = నానుంచే | అహమ్, ఏవ | = నేనే |
| స్మృతిః | = జ్ఞాపకము | వేద్యః | = తెలిసికొనదగినవాడను |
| జ్ఞానమ్ | = జ్ఞానము | వేదాంతకృత్ | = వేదాంతకర్తను |
| చ | = ఇంకా | వేదవిత్, చ | = వేదములు తెలిసినవాడను గూడ |
| | | అహమ్, ఏవ | = నేనే |

**అహమ్ సర్వస్య హృది సన్నివిష్టః (అస్మి), మత్తః (సర్వస్య)**
**స్మృతిః జ్ఞానమ్ అపోహనమ్ చ (భవతి) అహమ్ చ ఏవ**
**సర్వైః వేదైః వేద్యః (అస్మి), అహమ్ ఏవ చ వేదాన్త-కృత్ వేద-విత్ చ (అస్మి) ॥**

తా: నేనే ప్రతిప్రాణియొక్క హృదయమందు అంతర్యామిగా ఉంటాను, ఇంకా నానుంచే జ్ఞాపకము, జ్ఞానము, ఇంకా మరుపు కలుగుతాయి. ఇంకా వేదములన్నింటిద్వారా నేనే తెలిసికొనదగినవాడను, వేదాంతకర్తను, వేదములు తెలిసినవాడను గూడ నేనే.

ఈ సర్వాత్మకభావాన్ని ఈ శ్లోకంతో ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**సర్వస్య హృది అహం సన్నివిష్టః** – పరమాత్మ అయిన నేను అందరి హృదయాలలో కొలువైవుంటాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల ప్రతి మనిషి ఒక ఆలయంవంటి వ్యక్తి; అతని మనస్సు గర్భగుడి. ఆ గర్భగుడిలో

భగవంతుడు జీవాత్మరూపంలో నెలకొనివున్నాడు. మనస్సులో కలిగే ప్రతి ఒక్క ఆలోచనను సాక్షిగా చూస్తాడు. హృదిసాక్షిచైతన్యరూపేణ, క్షేత్రజ్ఞరూపేణ చైతన్యంగా నేను అందరిలో ఉన్నాను.

**మత్తః** – నావల్లనే అంటే చైతన్యంవల్లనే మనస్సులో జరిగే కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఏమిటవి?

**స్మృతిర్ జ్ఞానమపోహనం చ** – మూడు కార్యకలాపాలు చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అవి జ్ఞానం పొందటం, జ్ఞాపకం పెట్టుకోవటం, మర్చిపోవటం. జ్ఞానం అంటే ఒక విషయం గురించిన జ్ఞానం పొందటం. ఇప్పుడు భగవద్గీతను నేర్చుకుంటున్నారు. స్మృతి అంటే మీరు నేర్చుకుంటున్నదాన్ని గుర్తుపెట్టుకుంటారు. నేర్చుకున్నది నేర్చుకున్నట్టుగా మర్చిపోతే పదిహేనవ అధ్యాయందాకా రాలేరు. మొదటే ఆగిపోతారు.

కొంతమంది నేను బాగానే నేర్చుకుంటాను కాని త్వరగా మర్చిపోతాను అంటారు. మర్చిపోవటం శాపం అనుకుంటారు కాని, అది కూడా భగవంతుడు మనకు ఇచ్చిన గొప్ప వరం. జీవితంలో ఎన్నో కష్టనష్టాలను ఓర్చి పైకొచ్చివుంటాము. వాటన్నిటినీ అలాగే గుర్తుపెట్టుకుంటే జీవితాన్ని అనుభవించలేము, దేన్నుంచీ ఆనందాన్ని పొందలేము. కాలమే అన్నిటికీ గొప్ప పరిష్కారం అంటారు. కాలం ఎంత పెద్ద గాయాన్నైనా మాన్పుతుంది అంటారు.

గుర్తుంచుకోవటం ఒక గొప్ప వరం, మర్చిపోవటం ఇంకొక గొప్ప వరం. కాని ఆ వరాలను మనం శాపాలుగా మార్చుకుంటున్నాము. దేన్ని గుర్తుపెట్టుకోవాలో దాన్ని మర్చిపోతున్నాము, దేన్ని మర్చిపోవాలో దాన్ని గుర్తుపెట్టుకుంటున్నాము. నిన్న గీతలో ఏం నేర్చుకున్నామో మర్చిపోతాము కాని ఎప్పుడో 1953లో ఎవరో మనను అన్న ఏదో చిన్నమాట ఈరోజుకు కూడా ఒక పెద్దభూతంలా మన జ్ఞాపకాలలో నిలిచి, మనని వేటాడి, హింసిస్తుంది. అందువల్ల కృష్ణపరమాత్మ దేన్ని గుర్తుంచుకోవాలో దాన్ని గుర్తుంచుకోండి, దేన్ని మర్చిపోవాలో దాన్ని మర్చిపోండి; రెండూ నాయొక్క విభూతులే అంటున్నాడు.

శంకరాచార్యులవారు కాకుండా ఇంకొక భాష్యకారులు ఈ మూడు– జ్ఞానం, స్మృతి, అపోహనం – పదాలకు అద్భుతమైన వ్యాఖ్యానం ఇచ్చారు.

జ్ఞానమ్ – ఇది జాగ్రదావస్థను సూచిస్తుంది. ఎందుకంటే జాగ్రదావస్థలోనే మనం అనేక అనుభవాలను పొందుతూ, అనేక విషయాలను నేర్చుకుంటాము.

స్మృతిః – ఇది స్వప్నావస్థను సూచిస్తుంది. స్వప్నావస్థలో కొత్తగా ఏమీ నేర్చుకోము. జాగ్రదావస్థలో చూసినవి, విన్నవి, మన మనస్సులో పొందుపరచుకుని, మన వాసనల ద్వారా స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాము. స్మృతి అంటే జ్ఞాపకాలు.

అపోహనమ్ – ఇది సుషుప్తి అవస్థను సూచిస్తుంది. సుషుప్తిలో అన్నీ మర్చిపోతాము.

ఆ విధంగా ఈ మూడుపదాలు మనిషియొక్క మూడు అవస్థలను సూచిస్తాయి. ఆ మూడు అవస్థలలో అనుభవాలకూ నేనే కారణం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సర్వైః వేదైః అహమ్ ఏవ వేద్యః** – వేదాలద్వారా తెలిసికొనదగినవాడను నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. వేదాలు బోధించేది బ్రహ్మ గురించే కదా. వేదపూర్వభాగం సగుణ ఈశ్వరుణ్ణి వర్ణిస్తే, వేదాంతభాగం నిర్గుణ ఈశ్వరుణ్ణి వర్ణిస్తుంది. ఆ విధంగా మొత్తం వేదం బ్రహ్మజ్ఞానాన్ని కలుగజేస్తుంది.

**వేదాంతకృత్ అహమ్** – వేదాంతకర్తను కూడా నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. వేదాంతం అంటే వేదపూర్వభాగాన్ని కూడా కలుపుకోవాలి. వేదాలు అపౌరుషేయం అంటారు. అంటే పురుషబుద్ధినుంచి వచ్చినవి కావు, సాక్షాత్తూ ఆ భగవంతుణ్ణుంచే వచ్చాయని అర్థం. అంటే వేదాలను ఇచ్చిందీ నేనే, వేదాల్లో బోధించిందీ నా గురించే అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే వేదాలు ప్రమాణం, బ్రహ్మ ప్రమేయం.

**వేదవిత్** – వేదాలను నేర్చుకునే శిష్యుడు కూడా నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. వేదవిత్ అంటే వేదాలను నేర్చుకున్న వ్యక్తి. నేర్చుకునే వ్యక్తి ప్రమాత. అంటే ప్రమాత, ప్రమేయం, ప్రమాణం అనే త్రిపుటి మొత్తం నేనే.

దీనితో కృష్ణపరమాత్మ రెండవ అంశాన్ని ముగిస్తున్నాడు. ముందేమన్నాడు? పరమాత్మ జీవరూపేణ వర్ధతే. ఇప్పుడు పరమాత్మ జగద్రూపేణ వర్ధతే. రెండూ కలిపితే బ్రహ్మ సర్వాత్మకత్వం వస్తుంది

**చేతన అచేతనప్రపంచః అహమ్ అస్మి**

దీని అర్థం – సర్వం బ్రహ్మమయం జగత్.

సరిగ్గా అర్థం చేసుకోకపోతే సర్వం భ్రమమయం జగత్ అని పొరపాటుపడే అవకాశం ఉంది. ముండకోపనిషత్తు మంత్రం ఇంతకుముందే చూశాము. బ్రహ్మే ముందు, వెనక, పైన, కింద, లోపల, బయట, అంతటా ఉన్నాడని దాని అర్థం. నామరూపాలలో భేదం ఉంది తప్పితే అంతా బ్రహ్మే. ఇదే అర్థాన్ని గీతలో కూడా నాలుగవ అధ్యాయంలో చూశాము.

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**

**బ్రహ్మైవ తేన గంతవ్యం, బ్రహ్మకర్మసమాధినా ॥** – 4.24

ఈ విషయమే ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ 7–15 శ్లోకాలలో వర్ణించాడు. దీన్ని బ్రహ్మణః సర్వాత్మకత్వమ్ అంటారు. కాని ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. బ్రహ్మ సర్వాత్మకం అని నేర్చుకుంటే చాలదు. బ్రహ్మజ్ఞానం అసంపూర్తిగా మిగిలిపోతుంది. ఆ **సర్వాత్మకమైన బ్రహ్మను నేనే** అని ముగించాలి. అంటే బ్రహ్మ సర్వాత్మకం అని చెప్పేబదులు నేను సర్వాత్మకం అని చెప్పగలగాలి.

**అహమన్నమహమన్నమహమన్నమ్। అహమన్నాదో** 3 **ఒ హమన్నాదో** 3 **ఒ హమన్నాదః॥** – తైత్తిరీయం

దీనితో బ్రహ్మణః సర్వాత్మకత్వమ్ అంశం ముగిసింది.

## 4. బ్రహ్మణః పురుషోత్తమత్వమ్ – శ్లోకాలు 16–18: ఉపోద్ఘాతం

ఇప్పుడు 16–18 శ్లోకాల్లో కృష్ణపరమాత్మ పురుషోత్తమం పదాన్ని నిర్వచిస్తున్నాడు. ఈ పురుషోత్తమ పదాన్ని ఆధారంగా చేసుకునే ఈ అధ్యాయానికి పురుషోత్తమయోగము అనే పేరు వచ్చింది. ముందు ఈ శ్లోకాల సారాంశం చూద్దాము.

పురుషోత్తముడు పదాన్ని నిర్వచించటానికి కృష్ణపరమాత్మ, మొత్తం విశ్వాన్ని మూడుభాగాలుగా విభజించాడు. దాన్ని **అంశత్రయమ్** అంటారు. అవి క్షరపురుషుడు, అక్షరపురుషుడు, ఉత్తమపురుషుడు.

**క్షరపురుషుడు** – క్షరపురుషుడు అంటే కంటికి కనిపించే జగత్తు. ఇంద్రియాలు ఈ జగత్తును శబ్దస్పర్శరూపరస గంధాల ద్వారా చూపిస్తాయి. ఇది వ్యక్తం. ఇది జడం. ఈ జగత్తు పంచభూతాలతో సృష్టించబడిందని మనకు తెలుసు. పంచభూతాలంటే ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథివి – ఈ పంచభూతాలు జడం. దీనికి కృష్ణపరమాత్మ ఇచ్చిన సాంకేతిక పదజాలం క్షరపురుషుడు. మామూలుగా జగత్తును ప్రకృతి అనీ ప్రకృతితత్త్వం అనీ అంటారు. కాని ఇక్కడ క్షరపురుషుడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. జగత్తును పదార్థం అంటారు. విజ్ఞానశాస్త్రం ప్రకారం పదార్థాన్ని కొత్తగా సృష్టించలేరు, నాశనం చెయ్యలేరు అని నేర్చుకుంటాము. పదార్థం శక్తిగా మారుతుంది.

**అక్షరపురుషుడు** – పదార్థం శక్తిగా మారుతుందని విజ్ఞానశాస్త్రం అంటే వ్యక్తమయిన జగత్తు, అవ్యక్తంలోకి వెళుతుంది అంటుంది వేదాంతశాస్త్రం. సృష్టి జరిగినప్పుడు వ్యక్తంలోకి వస్తుంది; మళ్ళీ ప్రళయంలో అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. అందువల్ల రెండవఅంశం అవ్యక్తంలో ఉన్న పదార్థం. అది కూడా పదార్థమే. దీనికి కృష్ణపరమాత్మ ఇచ్చిన సాంకేతికపదం అక్షరపురుషుడు. ఇదికూడా అరుదైన పదం. ఎందుకంటే సాధారణంగా శాస్త్రంలో అక్షరపురుషుడు పదాన్ని నిర్గుణబ్రహ్మకు వాడతారు. సైన్సు ప్రకారం దేన్నైతే శక్తి (ఎనర్జీ) అంటారో, దాన్ని శాస్త్రంలో మాయ అంటారు. మాయ అంటే అవ్యక్తజగత్తు. ఆ మాయాతత్త్వాన్ని, ఆ అవ్యక్తపదార్థాన్ని ఇక్కడ అక్షరపురుషుడు అంటున్నాడు. కనబడే జగత్తు క్షరపురుషుడు, అవ్యక్తంలో ఉన్నది అక్షరపురుషుడు.

**ఉత్తమపురుషుడు** – ఉత్తమపురుషుడు అంటే చేతనతత్త్వం. శాస్త్రం ప్రకారం పదార్థం వేరు, చైతన్యం వేరు. మనం చైతన్యం గురించి నేర్చుకున్న ఐదుసూత్రాల్లో మొదటిసూత్రాన్ని గుర్తుపెట్టుకోవాలి. చైతన్యం శరీరంలో ఒకభాగం కాదు, దానిలక్షణం కాదు, దాన్నుంచి ఉత్పత్తి చెందలేదు. ఈ చైతన్యతత్త్వం స్వతంత్రమైనది. ఇటువంటి స్వతంత్రమైన ఉనికి ఉన్న చైతన్యాన్ని కృష్ణపరమాత్మ ఉత్తమపురుషుడు అంటున్నాడు.

ఇప్పుడు ఈ మూడు అంశాలలోని సాధర్మ్యాలు, వైధర్మ్యాలు చూద్దాము. ఏ మూడు అంశాలు – క్షరపురుషుడు, అక్షరపురుషుడు, ఉత్తమపురుషుడు. మొదటి రెండు పదార్థతత్త్వం అనీ, చివరిది చైతన్యతత్త్వం అనీ చూశాము. మొదటివి పదార్థం కాబట్టి అవి అచేతనతత్త్వం, జడం; మూడవది చైతన్యం కాబట్టి చేతనతత్త్వం. మొదటి రెండూ పదార్థం కాబట్టి పదార్థానికి అనేక లక్షణాలు ఉంటాయి. వాటిని గుణాలు అంటారు. అందువల్ల మొదటి రెండింటినీ **సగుణతత్త్వం** అనీ, మూడవదాన్ని **నిర్గుణతత్త్వం** అనీ అంటారు. మొదటిరెండు మార్పుకు లోనవుతాయి. అవ్యక్తం, వ్యక్తమే ఒక మార్పు. సైన్సుపరంగా మాటర్ ఎనర్జీగా, ఎనర్జీ మాటర్‌గా మారతాయి. $E=MC^2$ అనే ఈ సూత్రం ఈ విషయాన్ని నిరూపిస్తుంది కూడా. సృష్టి జరిగినప్పుడు అవ్యక్తం వ్యక్తమవుతోంది, ప్రళయంలో వ్యక్తం అవ్యక్తమవుతోంది.

**అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥** – 8.18

ఆ విధంగా మొదటిరెండూ **సవికారం**, చైతన్యం **నిర్వికారం**. చైతన్యం కూడా మారుతుందని చెప్పకూడదు. నాలుగవ భేదం, మొదటి రెండింటినీ భాగాలుగా విభజించవచ్చు. శరీరాన్ని భాగాలుగా విభజించవచ్చు, శరీరంలో ఒక పన్ను ఊడితే ఇంకో పన్ను పెట్టించుకోవచ్చు. ఒక వస్తువును భాగాలుగా విభజించవచ్చు. అందువల్ల ఇవి **సవికల్పం** కాని మూడవది **నిర్వికల్పం**.

చివరగా ఇంకొక ముఖ్యమైన భేదం ఉంది. పదార్థానికి (మొదటి రెండింటికీ) విడిగా ఉనికి లేదు. దానికి స్వతంత్రసత్తా లేదు. అందువల్ల దాన్ని **మిథ్య** అంటారు. ఆ విధంగా క్షరపురుషుడు, అక్షరపురుషుడు – ఇద్దరూ మిథ్యే. ఉత్తమపురుషుడు లేదా చైతన్యతత్త్వానికి మాత్రమే స్వతంత్రసత్తా ఉంది. నిజానికి చైతన్యతత్త్వమే పదార్థానికి ఉనికిని, తెరను ఇస్తుంది. క్షరపురుషుడు వ్యక్తమవటానికి, అక్షరపురుషునిగా అవ్యక్తమవటానికి ఆధారం ఉత్తమ పురుషుడనే తెర. అందువల్ల ఉత్తమపురుషుడు సత్యం. ఇప్పుడు ఈ భేదాలను మళ్ళీ టూకీగా చూద్దాము.

| | |
|---|---|
| క్షర, అక్షరపురుషులు | – పదార్థతత్త్వం, సగుణతత్త్వం, సవికారం, సవికల్పం, మిథ్య |
| ఉత్తమపురుషుడు | – చేతనతత్త్వం, నిర్గుణతత్త్వం, నిర్వికారం, నిర్వికల్పం, సత్యం |

ఈ మూడింటిలో ఉత్తమపురుషుడే ఉత్తమం అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? ఉత్తమపురుషుడు సర్వాధారం కాబట్టి.

విశ్వాధారం గగనసదృశం (మేఘవర్ణం ఇప్పుడు చెప్పకూడదు). ఇదంతా చెప్పాక, కృష్ణపరమాత్మ ఆ ఉత్తమ పురుషుణ్ణి నేనే, చైతన్యమే నా అసలు స్వరూపం అని చెబుతున్నాడు. నేను క్షరపురుషుణ్ణి కాదు, అక్షరపురుషుణ్ణి కాదు, ఉత్తమపురుషుణ్ణి అంటున్నాడు. ఎటువంటి ఉత్తమపురుషుడు? చేతన, నిర్గుణ, నిర్వికార, నిర్వికల్ప, సత్యపురుషుడు. నేను ఉత్తమపురుషుణ్ణి కాబట్టి పురుషోత్తమునిగా ప్రఖ్యాతి చెందాను అంటున్నాడు. ఉత్తమపురుషుడు పదాన్ని తిరగేస్తే పురుషోత్తముడు అని వస్తుంది. ఇదీ ఈ మూడుశ్లోకాల సారం. ఇప్పుడు శ్లోకాలను చూద్దాము.

శ్లో. 16 **ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।**
**క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥**
ద్వౌ, ఇమౌ, పురుషౌ, లోకే, క్షరః, చ, అక్షరః, ఏవ, చ,
క్షరః, సర్వాణి, భూతాని, కూటస్థః, అక్షర, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| లోకే | = ఈ జగత్తునందు | క్షరః | = నశించేవి |
| క్షరః, చ | = నశించేవాడని | చ | = ఇంకా |
| అక్షరః | = నాశనము లేనివాడని | కూటస్థః | = జీవాత్మ |
| ఇమౌ, ద్వౌ, పురుషౌ, ఏవ | = ఈ రెండు విధములగు పురుషులే ఉన్నారు | అక్షరః | = నాశనములేని వాడని |
| సర్వాణి, భూతాని | = సకల ప్రాణుల శరీరములు | ఉచ్యతే | = పేర్కొనబడుచున్నది |

**(అస్మిన్) లోకే క్షరః అక్షరః చ ఏవ ఇమౌ ద్వౌ పురుషౌ (స్తః),**
**సర్వాణి భూతాని క్షరః కూటస్థః చ అక్షరః ఉచ్యతే ॥**

తా: ఈ జగత్తునందు నశించేవాడని, నాశనము లేనివాడని, ఈ రెండువిధములగు పురుషులే ఉన్నారు. సకల ప్రాణుల శరీరములు నశించేవి, ఇంకా జీవాత్మ నాశనము లేనివాడని పేర్కొనబడుచున్నది.

**లోకే ద్వౌ పురుషౌ ఇమౌ** – ఈ విశ్వంలో ముందుగా ఇద్దరు పురుషులు ఉన్నారు. మూడవ పురుషుని గురించి ఇప్పుడు చెప్పబోవటం లేదు. వారి పేర్లు ఏమిటి?

**క్షరః చ అక్షరః ఏవ చ** – ఆ పురుషుల పేర్లు క్షరపురుషుడు, అక్షరపురుషుడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. వారు ఎవరు? కృష్ణపరమాత్మే వారిని నిర్వచిస్తున్నాడు.

**క్షరః సర్వాణి భూతాని** – అన్ని వస్తువులు, అన్ని ప్రాణులు క్షరపురుషుడు. వస్తువులు, ప్రాణులు అంటే కనబడే భూతప్రపంచం. ప్రాణులు అంటే స్థూలశరీరం, వస్తువులు అంటే జగత్తులో ఉన్న విషయవస్తువులు. స్థూలశరీరం కూడా పదార్థంలోకే వస్తుందని మీకు తెలుసు. ఆ విధంగా కనబడే జగత్తు క్షరపురుషుడు.

**కూటస్థోఽక్షర ఉచ్యతే** – కూటస్థః అంటే అవ్యక్తవస్తువు. ఈ కూటస్థః అనే పదం మనను అయోమయంలో పడేసే ప్రమాదం ఉంది. ఈ పదాన్ని 8, 12 అధ్యాయాల్లో కూడా చూశాము. అక్కడ ఈ పదం అర్థం వేరు.

ఇక్కడ కూటస్థః అంటే అవ్యక్తపదార్థం. దీన్ని మాయాతత్త్వం అంటారు. మాయ సాపేక్షికంగా శాశ్వతం కాబట్టి కూటస్థః అన్నాడు కృష్ణపరమాత్మ. కూటస్థః అంటే ఇక్కడ సాపేక్షికంగా శాశ్వతం. ఈ అవ్యక్తపదార్థాన్ని అక్షరపురుషుడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఆ విధంగా ఈ శ్లోకంలో ఇద్దరు పురుషులను పరిచయం చేశాడు. వారు క్షరపురుషుడు, అక్షరపురుషుడు. తర్వాత ఉత్తమపురుషుణ్ణి పరిచయం చేస్తాడు.

శ్లో. 17 **ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః ।**
**యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥**
ఉత్తమః, పురుషః, తు, అన్యః, పరమాత్మా, ఇతి, ఉదాహృతః,
యః, లోకత్రయమ్, ఆవిశ్య, బిభర్తి, అవ్యయః, ఈశ్వరః ॥

| | | | |
|---|---|---|---|
| ఉత్తమః, పురుషః | = పై ఇద్దరికన్నా ఉత్తమపురుషుడే | అవ్యయః | = నాశరహితుడు, శాశ్వతుడు |
| తు, అన్యః | = వేరైనవాడు | ఈశ్వరః | = పరమేశ్వరుడు |
| యః | = ఎవరైతే | పరమాత్మా, ఇతి | = పరమాత్మ అని |
| లోకత్రయమ్, ఆవిశ్య | = ముల్లోకములలో ప్రవేశించి | ఉదాహృతః | = పేర్కొనబడుచున్నాడు |
| బిభర్తి | = అందరిని భరించి, పోషిస్తున్నాడో, అతడే | | |

**ఉత్తమః పురుషః తు అన్యః (అస్తి), (సః) పరమ్-ఆత్మా ఇతి**

**ఉదాహృతః యః అవ్యయః ఈశ్వరః లోక-త్రయమ్ ఆవిశ్య (తత్) బిభర్తి ॥**

తా: పై ఇద్దరికన్నా ఉత్తమపురుషుడే వేరైనవాడు. ఎవరైతే ముల్లోకములలో ప్రవేశించి, అందరిని భరించి, పోషిస్తున్నాడో, అతడే నాశరహితుడు,శాశ్వతుడు. పరమేశ్వరుడు, పరమాత్మ అని పేర్కొనబడుచున్నాడు.

**తు అన్యః** – క్షరపురుషుడు, అక్షరపురుషులకు భిన్నంగా ఇంకొక పురుషుడు ఉన్నాడు. అంటే వ్యక్తపదార్థం, అవ్యక్తపదార్థాలకు భిన్నంగా చైతన్యతత్త్వం ఉంది. ఆ భిన్నపురుషుడు చైతన్యం అని ఎలా చెప్పగలము? మొదటి రెండూ అచేతనం కాబట్టి. ఈ చైతన్యం పేరు ఏమిటి?

**ఉత్తమః పురుషః** – ఆ పురుషుని పేరు ఉత్తమపురుషుడు. ఈ ఉత్తమపురుషుని లక్షణాలను మనం ఉపోద్ఘాతంలో చూశాము. వాటిని ఇక్కడ గుర్తుతెచ్చుకోవాలి. ఉత్తమపురుషుడు – **చేతనతత్త్వం, నిర్గుణతత్త్వం, నిర్వికారం, నిర్వికల్పం, సత్యం.**

ఇందులో సత్యం పదాన్ని గుర్తుంచుకోవాలి. లేకపోతే మూడుతత్త్వాలు ఉన్నాయి అనుకునే ప్రమాదం ఉంది. మూడు తత్త్వాలు ఉంటే అద్వైతం అని ఎలా చెప్పగలరు? అద్వైతం అంటే ఒకటే ఉండాలి కదా అనే సందేహం రావచ్చు.

మూడు తత్త్వాల పేర్లు చెప్పాము. అవి – క్షరపురుషుడు, అక్షరపురుషుడు, ఉత్తమపురుషుడు. అయినా ఉన్నదొక్కటే అంటున్నాము. అదెలాగంటే క్షరపురుషుడు, అక్షరపురుషుల లక్షణాలు చెప్పినప్పుడు ఏమన్నాము?

**పదార్థతత్త్వం, సగుణతత్త్వం, సవికారం, సవికల్పం, మిథ్య**

మిథ్య అంటే విడిగా ఉనికి లేనిది లేదా అసత్యం. అందువల్ల ఆ పురుషులను లెక్కలోకి తీసుకోము. ఉన్నదొక్కటే సత్యం. అది ఉత్తమపురుషుడు. అది సత్యతత్త్వం.

**పరమాత్మేత్యుదాహృతః** – ఈ ఉత్తమపురుషుణ్ణి, ఈ చైతన్యాన్ని అన్ని ఉపనిషత్తులలోనూ పరమాత్మగా వ్యవహరిస్తారు.

**ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః ।**

**పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః ॥** – 13.23

అక్కడ కూడా పరమాత్మ అని అంటారని పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ. ఈ పరమాత్మ లక్షణం ఏమిటి? మనకు పదార్థం గురించి తెలుసు. మాటర్, ఎనర్జీల పేర్లతో దాని గురించి సైన్సులో నేర్చుకుంటాము. మాటర్ ఎనర్జీగా, ఎనర్జీ మాటర్‌గా మారుతుందని చూస్తాము. కాని వేదాంతశాస్త్రంలో ఈ రెండింటికీ అధిష్ఠానంగా ఇంకొకటి ఉందని నేర్చుకుంటాము. ఆ అధిష్ఠానాన్నే నిర్గుణబ్రహ్మ అనీ, చైతన్యమనీ అంటుంది శాస్త్రం. ఇక్కడ కృష్ణపరమాత్మ ఉత్తమపురుషునిగా పేర్కొంటున్నాడు.

**లోకత్రయమావిశ్య** – ఉత్తమపురుషుడు ముల్లోకాలలోనూ సర్వవ్యాపకంగా ఉన్నాడు. ఆవిశ్య అంటే ప్రవేశించి, అధిష్ఠానంగా ఉన్నాడు. ఇక్కడ లోకత్రయాన్ని క్షర, అక్షరపురుషులుగా తీసుకోవచ్చు. వీరికి అధిష్ఠానంగా ఉండి, ఏం చేస్తున్నాడు?

**బిభర్తి** – వారికి స్థితికర్త అవుతున్నాడు. బంగారం, ఆభరణం అంతటా ఉండి, ఆభరణానికి ఉనికిని అరువు ఇస్తున్నట్లుగా; చెక్క, కుర్చీ అంతటా ఉండి, కుర్చీకి ఉనికిని అరువు ఇస్తున్నట్లుగా; నీరు, అలలంతటా ఉండి, అలలకు ఉనికిని అరువు ఇస్తున్నట్లుగా, ఉత్తమపురుషుడు, క్షర, అక్షరపురుషులంతటా ఉండి, వాటికి ఉనికిని ఇస్తున్నాడు. బంగారం లేకపోతే ఆభరణాలు లేవు; చెక్క లేకపోతే కుర్చీలేదు; నీరు లేకపోతే అలలేదు; అదే సూత్రం ప్రకారం ఉత్తమపురుషుడు లేకపోతే క్షర, అక్షరపురుషులు లేరు. చైతన్యతత్త్వం లేకుండా పదార్థానికి, శక్తికి ఉనికి లేదు. వాటి సారమే చైతన్యం. అందువల్ల చైతన్యమే వాటికి చైతన్యాన్ని అరువు ఇస్తుంది.

**అవ్యయః** – మారుతున్న పదార్థం అంతటా చైతన్యమున్నా కూడా, చైతన్యం మారదు. సినిమాలో తెరమీద పాత్రలు కదులుతాయి; కార్లు పరుగులు తీస్తాయి; కాని తెర వాటితోపాటు పరుగులు తీయదు. నిజానికి పరుగులు తీయదు కాదు, పరుగులు తీయకూడదు. ఎందుకు? అదికూడా పరుగులు తీస్తే, దానిమీద సినిమా చూడలేము. అందువల్ల కదలని తెరమీదే కదిలే బొమ్మలను చూడగలము. అదేవిధంగా కదలని చైతన్యం సమక్షంలోనే, జగత్తులోని మార్పులన్నీ జరిగే అవకాశం ఉంటుంది. అలా జగదాధారం చైతన్యం. అందువల్ల చైతన్యం అవ్యయం. అవ్యయం అంటే మార్పులేనిది.

**ఈశ్వరః** – ఈశ్వరుడు అంటే పదార్థానికి ప్రభువు; పదార్థానికి బానిస కాదు. అంటే స్వతంత్రుడు. పదార్థానికి ఏమయినా, చైతన్యానికి ఏమీ అవదు. అందువల్ల చైతన్యం అసంగం. చైతన్యం పదార్థం అంతటా వ్యాపించివున్నా, పదార్థానికి ఏమార్పులు వచ్చినా, చైతన్యం మారదు. వ్యష్టిపరంగా తీసుకుంటే శరీరం షడ్వికారాలకు లోనవుతుంది. పుడుతుంది, ఎదుగుతుంది, క్షీణిస్తుంది, మరణిస్తుంది. సమష్టిపరంగా చూస్తే తుఫానులు వస్తాయి, భూకంపాలు వస్తాయి కాని చైతన్యానికి మాత్రం ఏమవదు. నవగ్రహాలు శరీరాన్ని బాధించవచ్చు కాని, చైతన్యాన్ని ఏమీ చెయ్యలేవు.

**అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ అక్లేద్యోఽశోష్య ఏవ చ** – 2.24

ఈ లక్షణాలను గుర్తుంచుకోవాలి. అటువంటి చైతన్యం ఈశ్వరుడు.

శ్లో. 18 **యస్మాత్ క్షరమతీతోఽహమ్ అక్షరాదపి చోత్తమః ।**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥**
యస్మాత్, క్షరమ్, అతీతః, అహమ్, అక్షరాత్, అపి, చ, ఉత్తమః,
అతః, అస్మి, లోకే, వేదే, చ, ప్రథితః, పురుషోత్తమః ॥

| | | | |
|---|---|---|---|
| యస్మాత్ | = ఎందుకంటే | చ | = ఇంకా |
| అహమ్ | = నేను | అక్షరాత్, అపి | = నాశరహితుడైన జీవాత్మకన్నా |
| క్షరమ్ | = అశాశ్వతమైన జడవర్గక్షేత్రముకన్నా | ఉత్తమః | = ఉత్తముడను |
| అతీతః | = పూర్తిగా అతీతుడను | అతః | = ఇందువల్ల |

| | | | |
|---|---|---|---|
| లోకే, చ | = లోకమందు | పురుషోత్తమః | = పురుషోత్తముడని |
| వేదే (చ) | = వేదమందు | ప్రథితః, అస్మి | = ప్రసిద్ధుడనైతిని |

**యస్మాత్ అహమ్ క్షరమ్ అతీతః, అక్షరాత్ అపి చ ఉత్తమః**
**(అస్మి), అతః (అహం) లోకే వేదే చ పురుషోత్తమః ఇతి ప్రథితః అస్మి ॥**

తా: ఎందుకంటే, నేను అశాశ్వతమైన జడవర్గక్షేత్రముకన్నా పూర్తిగా అతీతుడను. ఇంకా నాశరహితుడైన జీవాత్మకన్నా ఉత్తముడను. ఇందువల్ల లోకమందు, వేదమందు పురుషోత్తముడని ప్రసిద్ధుడనైతిని.

**క్షరమ్ అతీతః** – ఈ మూడవతత్త్వం అయిన చేతనతత్త్వమ్ క్షరపురుషునికి అతీతం. క్షరపురుషుడు అంటే వ్యక్తజగత్తు అని చూశాము. దానికన్నా ఉన్నతం.

**అక్షరాత్ అపి చ ఉత్తమః** – అంతేకాదు, అక్షరపురుషునికన్నా ఉత్తముడు ఈ ఉత్తమపురుషుడు. అంటే అవ్యక్త ప్రపంచంకన్నా ఉత్తముడు. అందువల్లనే చైతన్యం అంటే ఒక విధమైన శక్తి అనుకోకూడదు. చైతన్యం ఒక తత్త్వం. అది అన్నిరకాల శక్తులకన్నా అతీతమైనది. శక్తి అంటే వేరే ఏదోకాదు, అవ్యక్తంగా ఉన్న పదార్థం అని చూశాము. కాబట్టి వ్యక్తపదార్థానికీ, అవ్యక్తపదార్థానికీ భిన్నంగా ఉండి, వాటికి అతీతంగా ఉన్నది ఏదో, అది ఉత్తమపురుషుడు.

సంస్కృతంలో ఉత్తమః అంటే అన్నిటికన్నా ఎక్కువ. క్షర, అక్షరపురుషులకన్నా చైతన్యం శ్రేష్ఠం కాబట్టి, చైతన్యానికి ఉత్తమపురుషుడు అనే పేరు ఇవ్వటం జరిగింది.

**అతః** – అందువల్ల. ఎందువల్ల? చైతన్యం అన్నిటికన్నా శ్రేష్ఠం కాబట్టి.

**ప్రథితః పురుషోత్తమః** – చైతన్యం ఉత్తమపురుషునిగా ప్రసిద్ధి పొందింది. ఉత్తమపురుషుణ్ణి తిరగేస్తే పురుషోత్తముడు అవుతుందని చూశాము. చైతన్యం పురుషోత్తమునిగా పేరుపొందింది. ఎక్కడ?

**లోకే వేదే చ** – లోకాలలోనూ, వేదాలలోనూ ప్రసిద్ధి పొందింది. కాని ఇక్కడ కృష్ణపరమాత్మ తన చిలిపితనాన్ని చూపిస్తున్నాడు. చైతన్యం ఉత్తమపురుషుడు అనకుండా, నిశ్శబ్దంగా ఒక పదం వేశాడు. ఏమిటది?

**అహమ్** – నేనే ఆ ఉత్తమపురుషుణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ. కాకపోతే కృష్ణపరమాత్మ నేను అంటే ఏ నేనో అర్థం చేసుకోవాలని కూడా ఈ అధ్యాయంలోనే చూశాము. అర్జునా, ఆ చైతన్యాన్ని నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. నేను అంటే కృష్ణుని ఆకారంతో ఉన్న ఏకరూప ఈశ్వరుడు కాదు; కృష్ణశరీరం క్షరపురుషునిలోకి వస్తుంది. కృష్ణశరీరం వెనకనున్న చైతన్యతత్త్వాన్ని నేను అంటున్నాడు. నేను క్షరపురుషునికన్నా, అక్షరపురుషునికన్నా శ్రేష్ఠమైన ఉత్తమపురుషుణ్ణి. అందువల్ల నన్ను పురుషోత్తముడు అంటారు. కాబట్టి నేను అంటే కృష్ణశరీరం కాదు, సగుణకృష్ణుడు కాదు, నిర్గుణ కృష్ణపరమాత్మ లేదా చైతన్యస్వరూపం అని అర్థం చేసుకోవాలి.

ఈ శ్లోకంతో పురుషోత్తముడు పదం నిర్వచనం ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ. పురుషోత్తముడు అంటే క్షర, అక్షరపురుషులకన్నా శ్రేష్ఠమైన చైతన్యం. ఈ పురుషోత్తముని నిర్వచనం వచ్చింది కాబట్టి ఈ అధ్యాయానికి పురుషోత్తమయోగము అనే పేరు వచ్చింది.

శ్లో. 19 **యో మామేవమసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।**
**స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత ॥**
యః, మామ్, ఏవమ్, అసమ్మూఢః, జానాతి, పురుషోత్తమమ్,
సః, సర్వవిత్, భజతి, మామ్, సర్వభావేన, భారత ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | సః | = ఆ జ్ఞాని |
| యః, అసమ్మూఢః | = జ్ఞానియైన ఎవరైనా | సర్వవిత్ | = సర్వజ్ఞుడు |
| మామ్ | = నన్ను | సర్వభావేన | = అన్నివిధముల |
| ఏవమ్ | = ఈ విధముగా | మామ్ | = నన్నే నిరంతరము పరమేశ్వరునిగా |
| పురుషోత్తమమ్ | = పురుషోత్తమునిగా | | |
| జానాతి | = తెలుసుకుంటారో | భజతి | = భజించును |

**హే భారత! యః అసమ్మూఢః మామ్ పురుషోత్తమమ్ ఏవమ్ జానాతి,**
**సః సర్వ-విత్ (భూత్వా) మామ్ సర్వ-భావేన భజతి ॥**

తా: ఓ అర్జునా! జ్ఞానియైన ఎవరైనా నన్ను ఈ విధముగా పురుషోత్తమునిగా తెలుసుకుంటారో, ఆ జ్ఞాని సర్వజ్ఞుడు. ఆ జ్ఞాని అన్నివిధముల నన్నే నిరంతరము పరమేశ్వరునిగా భజించును.

**5. బ్రహ్మజ్ఞానమ్, ఫలమ్ - శ్లోకాలు 19, 20**

పురుషోత్తముని నిర్వచనం చెప్పాక, ప్రతి ఒక్క సాధకుడు పురుషోత్తమజ్ఞానం పొందాలని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

తెలివైన వ్యక్తి క్షరపురుషుని వెంటో, అక్షరపురుషుని వెంటో పడకుండా, ఉత్తమపురుషుని గురించిన జ్ఞానం పొందాలని తెలుసుకుంటాడు. ఉత్తమపురుషుడంటే నిర్గుణబ్రహ్మ అని చూశాము. కాని మూఢులు ఎంతసేపూ కనబడే జగత్తే సత్యం అనుకుంటారు.

**అసమ్మూఢః** - అసమ్మూఢః అంటే జ్ఞాని. అంటే మోహం లేనివ్యక్తి; వివేకం ఉన్నవ్యక్తి; సాధనచతుష్టయసంపత్తి ఉన్న సాధకుడు. కర్మ, ఉపాసన, జ్ఞానయోగాలను పాటించి, పురుషోత్తముని గురించి తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాడు. అలా ప్రయత్నం చేస్తే వారు పొందే ఫలం ఏమిటి?

**జానాతి పురుషోత్తమమ్** - పురుషోత్తముని గురించి తెలుసుకుంటారు. పురుషోత్తముని లక్షణాలు మర్చిపోకూడదు.

**చేతనతత్త్వం, నిర్గుణతత్త్వం, నిర్వికారం, నిర్వికల్పం, సత్యం**

**సః సర్వవిత్ భజతి** - అటువంటి ఉత్తమపురుషుని గురించి నేర్చుకుంటే వారు సర్వజ్ఞులు అవుతారు; సర్వమూ తెలిసినవారు అవుతారు. ఎందుకంటే బ్రహ్మ సర్వవ్యాపకం కాబట్టి, అన్నిటికీ అధిష్ఠానం కాబట్టి. ఒక్క బ్రహ్మ గురించి తెలుసుకుంటే సర్వమూ తెలిసినట్టు అవుతుంది. **ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి** - ముండకం

ఏ ఒక్క విజ్ఞానం పొందితే అన్నీ తెలుసుకున్నట్టు అవుతుందో ఆ విద్యను బోధించమని శౌనకుడు, అంగిరస ఋషిని అడుగుతాడు ముండకోపనిషత్తులో. అదే బ్రహ్మవిద్య. **పురుషోత్తమజ్ఞానేన సర్వవిద్భవతి**

దాని తర్వాత కూడా జ్ఞాని భగవంతుణ్ణి కొలుస్తాడు కాని, ఆ పూజ ఉన్నతస్థాయికి చెందినది.

**(స) సర్వభావేన (మాం భజతి)** – అటువంటి జ్ఞాని నన్ను అన్నివిధాలుగా పూజిస్తాడు. మనస్ఫూర్తిగా ధ్యానిస్తాడు.

మనస్ఫూర్తిగా, అన్నివిధాలుగా పూజిస్తాడు అంటే అర్థమేమిటి? దాన్ని శంకరాచార్యులవారు ఇలా నిర్వచిస్తున్నారు. ఆ పురుషోత్తముడు వేరే ఎవరో కాదు, ఆ పురుషోత్తముణ్ణి నేనే అనే సంపూర్ణజ్ఞానంతో కొలుస్తాడు. సర్వవ్యాపకమైన చైతన్యమైన పురుషోత్తముడు ఆత్మచైతన్యమైన నేను అని అర్థం చేసుకుంటాడు. అంటే ఇటువంటి జ్ఞానీభక్తిని అద్వైతభక్తి అంటారు. అందువల్ల సర్వభావేన అంటే అద్వైతభావేన, అభేదభావేన.

మనం ఏడవ అధ్యాయంలో నాలుగురకాల భక్తుల గురించి చూశాము. అక్కడ కృష్ణపరమాత్మ జ్ఞానీభక్తుడు అందరిలోకి గొప్పభక్తుడు అన్నాడు. ఎందుకు? అతనిది అద్వైతభక్తి కాబట్టి. అతను చూపించేది అభేదజ్ఞానభక్తి. ఇదే ఆలోచనను కొనసాగిస్తున్నాడు చివరిశ్లోకంలో కూడా.

శ్లో. 20 **ఇతి గుహ్యతమం శాస్త్రమ్ ఇదముక్తం మయానఘ ।**
**ఏతద్ బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ కృతకృత్యశ్చ భారత ॥**
ఇతి, గుహ్యతమమ్, శాస్త్రమ్, ఇదమ్, ఉక్తమ్, మయా, అనఘ,
ఏతత్, బుద్ధ్వా, బుద్ధిమాన్, స్యాత్, కృతకృత్యః, చ, భారత ॥

| | | | |
|---|---|---|---|
| అనఘ! | = ఓ పుణ్యపురుషా! | ఉక్తమ్ | = చెప్పబడినది |
| భారత! | = ఓ అర్జునా! | ఏతత్ | = ఈ తత్త్వమును |
| ఇతి | = ఈ విధముగా | బుద్ధ్వా | = మనుష్యుడు తెలిసికొని |
| గుహ్యతమమ్ | = మిక్కిలి రహస్యమైన | బుద్ధిమాన్ | = జ్ఞాని |
| ఇదమ్, శాస్త్రమ్ | = ఈ శాస్త్రము | కృతకృత్యః, చ | = కృతార్థుడు |
| మయా | = నాచేత | స్యాత్ | = అవుతాడు |

**హే అనఘ! ఇతి గుహ్యతమమ్ ఇదమ్ శాస్త్రమ్ మయా ఉక్తమ్,**
**హే భారత! ఏతత్ బుద్ధ్వా (జీవః) బుద్ధిమాన్ కృతకృత్యః చ స్యాత్ ॥**

తా: ఓ పుణ్యపురుషా! ఓ అర్జునా! ఈ విధముగా మిక్కిలి రహస్యమైన ఈ శాస్త్రము నాచేత చెప్పబడినది. ఈ తత్త్వమును మనుష్యుడు తెలిసికొని జ్ఞాని ఇంకా కృతార్థుడు అవుతాడు.

**ఇదముక్తం శాస్త్రం గుహ్యతమమ్** – బ్రహ్మ గురించిన ఈ బోధ ఎంతో రహస్యమైనది అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏ బ్రహ్మ? ఈ అధ్యాయంలోనే సర్వాత్మకబ్రహ్మగా చూశాము, పురుషోత్తమునిగా చూశాము. ఈ రెండు వర్ణనలు ఒక బ్రహ్మకే చెందుతాయి. ఇటువంటి పురుషోత్తముని గురించి బోధించే బ్రహ్మవిద్య గుహ్యతమమ్ అంటున్నాడు కృష్ణపరమాత్మ. ప్రపంచంలో ఏ యూనివర్సిటీలో, ఏ కోర్సులో చేరినా కూడా అవన్నీ క్షరపురుషుని గురించో, అక్షరపురుషుని గురించో మాత్రమే ఉంటాయి. ముండకోపనిషత్తు పరిభాషలో చెప్పాలంటే దీనిని

అపరావిద్య అంటారు. పురుషోత్తముని గురించి బోధించే విద్య పరావిద్య. అందువల్ల పరావిద్య అరుదుగా దొరికేవిద్య.

**(ఇదం) మయా (ఉక్తమ్) అనఘ** – ఓ అర్జునా! ఇటువంటి అరుదైన విద్యను నీకు నేను బోధిస్తున్నాను. ఎందుకు అర్జునునికి బోధిస్తున్నాడు? ఒక కారణం, అర్జునుడు అడిగాడు కాబట్టి. అది ముఖ్యమైన కారణం. అదికాక అర్జునుడు అర్హత ఉన్న విద్యార్థి. అనఘ అంటే స్వచ్ఛమైన మనస్సు ఉన్నవాడు అని అర్థం. అఘం అంటే పాపం; అనఘ అంటే పాపరహితుడు; శుద్ధపురుషుడు. నీకు చిత్తశుద్ధి ఉంది కాబట్టి నీకు బోధిస్తున్నాను.

**ఏతద్ బుద్ధ్వా** – ఈ జ్ఞానాన్ని నువ్వు అందుకుని, దాన్ని జీర్ణించుకొనుగాక. ఏమని జీర్ణించుకోవాలి? నేను శరీరాన్ని కాదు, నేను మనస్సును కాను – ఈ రెండూ క్షరపురుషుడు; నేను కారణశరీరాన్ని కాను. అది అక్షరపురుషుడు అనుకోవాలి. మాండూక్యోపనిషత్తు పరిభాషలో చెప్పాలంటే నేను ప్రథమపాదాన్ని కాదు, నేను ద్వితీయపాదాన్ని కాదు – అవి క్షరపురుషునికి చెందినవి; నేను తృతీయపాదాన్ని కాదు. అది అక్షరపురుషునికి చెందినది. అంటే నేను విశ్వకాదు, తైజస కాదు, ప్రాజ్ఞ కాదు, నేను నాలుగవ పాదం అయిన తురీయాన్ని. ఆ తురీయాన్ని ఇక్కడ కృష్ణపరమాత్మ ఉత్తమపురుషుడు అన్నాడు. ఇదే బోధ ఛాందోగ్యోపనిషత్తు ఎనిమిదవ అధ్యాయంలో కూడా వస్తుంది. ఆ ఎనిమిదవ అధ్యాయం, ఈ పదిహేనవ అధ్యాయానికి ఆధారం. ఏతత్ బుద్ధ్వా అంటే ఇటువంటి జ్ఞానాన్ని పొంది, జీర్ణించుకోగాక.

**బుద్ధిమాన్ స్యాత్** – అలా జీర్ణించుకుని నువ్వు జ్ఞానివి అవుగాక.

ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలమేమిటి? కృష్ణపరమాత్మ ఈ జ్ఞానంవల్లనే జీవితంలో పరిపూర్ణత్వం ఏర్పడుతుందని చెబుతున్నాడు.

**కృతకృత్యశ్చ భారత** – ఈ జ్ఞానం పొందితే పరిపూర్ణత్వం ఏర్పడుతుంది. వేరే ఏ జ్ఞానం పొందినా పరిపూర్ణత్వం రాదు. వచ్చినట్టుగా అనిపించినా, అది తాత్కాలికం మాత్రమే. పరావిద్యజ్ఞానం పొందితేనే శాశ్వతమైన ఫలం కలుగుతుంది.

**పురుషోత్తమ జ్ఞానేన తృప్తిః భవతి**
**ఆత్మన్యేవ ఆత్మనః తృప్తిః భవతి**

ఈ ఫలం చెప్పటంతో కృష్ణపరమాత్మ ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాడు.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే పురుషోత్తమయోగో నామ పంచదశోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు పురుషోత్తమయోగము అనే పదునైదవ అధ్యాయము.

# అధ్యాయము 15 – పురుషోత్తమయోగము సారాంశము

పురుషోత్తమయోగము అనే పేరు ఉన్న ఈ పదిహేనవ అధ్యాయము చాలా ప్రసిద్ధి పొందిన అధ్యాయము. దీనిని అనేక కారణాలవల్ల అనేకమంది కంఠతా పడతారు. కొన్నిచోట్ల భోజనం చేసేముందు ఈ అధ్యాయాన్ని పఠిస్తారు; ఇది చిన్న అధ్యాయం కాబట్టి పారాయణం చెయ్యటానికి వీలుగా ఉంటుంది; అన్నింటినీ మించి ఈ అధ్యాయంలో ఉపనిషత్తుల్లోని ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. సర్వ ఉపనిషత్తులసారం ఇదని చెప్పవచ్చు.

ఇందులో ప్రధానంగా ఐదు భాగాలు ఉన్నాయి. అవి –

1. **సంసారవర్ణనమ్ – శ్లోకాలు: 1–3 మొదటి పాదం**
2. **మోక్షసాధనాని – శ్లోకాలు: 3 రెండవ పాదం –6**
3. **బ్రహ్మణః సర్వాత్మకత్వమ్ – శ్లోకాలు: 7–15**
4. **బ్రహ్మణః పురుషోత్తమత్వమ్ – శ్లోకాలు: 16–18**
5. **బ్రహ్మజ్ఞానమ్, ఫలమ్ – శ్లోకాలు: 19, 20**

### 1. సంసారవర్ణనమ్ – శ్లోకాలు: 1–3 మొదటి పాదం

సంసారవర్ణనను మొదటి రెండు శ్లోకాల్లోనూ, మూడవశ్లోకంలో మొదటిపాదం వరకూ చూస్తాము.

కృష్ణపరమాత్మ జగత్తును ఒక పెద్ద అశ్వత్థవృక్షంతో పోల్చాడు. జగత్తుకూ, వృక్షానికీ మధ్య అనేక పోలికలు చూశాము. ఉదాహరణకు మహత్వమ్, ఆద్యంతరహితత్వమ్, అనిర్వచనీయత్వమ్, మూలత్వమ్, శాఖాత్వమ్ మొదలైనవి. వీటన్నిటిలోకి ఒక ముఖ్యమైన అంశం ఉంది. దాన్ని మనం గుర్తుపెట్టుకోవాలి. ఆ అంశాన్ని కృష్ణపరమాత్మ చెప్పలేదు కాని మనం ఉపనిషత్తులనుంచి ఇక్కడికి తెచ్చుకోవాలి. ఎందుకంటే ఈ వృక్షదృష్టాంతం కృష్ణపరమాత్మ స్వంతదృష్టాంతం కాదు, ఉపనిషత్తుల్లోనుంచి చెప్పినదే. కఠోపనిషత్తులో ఈ పోలిక చాలా వివరంగా వస్తుంది.

> **ఊర్ధ్వమూలోఽవాక్శాఖః ఏషోఽశ్వత్థః సనాతనః, తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే**
> **తస్మిం లోకాః శ్రితాః సర్వే తదు నాత్యేతి కశ్చన। ఏతద్వై తత్॥** – కఠ 2.3.1

ఇలాంటి పోలికే ముండకోపనిషత్తులో కూడా వస్తుంది.

> **ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే**
> **తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్ అన్యో అభిచాకశీతి** – ముండకం 3.1.1

కఠోపనిషత్తులో చెప్పిన చెట్టుపేరు అశ్వత్థవృక్షం, ముండకంలో చెప్పిన చెట్టుపేరు పిప్పలం. రెండూ ఒకటే.

ముండకోపనిషత్తు జీవరాశులన్నింటినీ చెట్టుమీద నివసిస్తున్న పక్షులతో పోలుస్తుంది.

ఈ మొత్తం జగత్తును చెట్టుతో పోలిస్తే, జీవులను కొమ్మలమీద ఉన్న పక్షులతో పోల్చవచ్చు. మూడుస్థాయిల్లో ఉన్న లోకాలను మూడుస్థాయిల్లో ఉన్న కొమ్మలతో పోల్చవచ్చు.

అంతేకాదు, ఆ కొమ్మలమీద పక్షులు, చెట్టుకున్న ఫలాలను తింటున్నాయి. ఈ సంసారమనే వృక్షంలో పండిన ఫలాలు జీవులు అనుభవించే ఫలాలు. చెట్టుకున్న ఫలాలు ఎలా తియ్యగా, పుల్లగా ఉంటాయో, అలా సంసారంలో జీవుడు అనుభవించే ఫలాలు కూడా రెండుగా ఉంటాయి. సుఖఫలం ఉంటుంది, దుఃఖఫలం ఉంటుంది. ఒక ఫలం ఆనందాన్ని ఇస్తే, ఇంకొక ఫలం బాధపెడుతుంది.

ఈ వృక్షదృష్టాంతంద్వారా కృష్ణపరమాత్మ చెప్పదలుచుకున్న విషయం – సంసారం అంటే నిరంతరం సుఖదుఃఖాలను రెండింటినీ ఇస్తుంది. ఎలాగైతే ఒకటే వృక్షం కొన్ని రుచికరమైన ఫలాలను, కొన్ని చేదుఫలాలను ఇస్తుందో, అలాగే ఒకటే సంసారం సుఖాన్నీ ఇస్తుంది, దుఃఖాన్నీ ఇస్తుంది. సంసారం అంటేనే సుఖదుఃఖాల మేలుకలయిక. అవి ఒకే నాణేనికి ఇరుపక్కలా ఉన్న బొమ్మ, బొరుసు వంటివి. నాణేనికి ఏదో ఒకవైపు మాత్రమే ఎలా ఉండదో, జీవితానికి కూడా ఏదో ఒకటే ఉండటం అసంభవం. కేవలం దుఃఖమే ఉండదు; కేవలం సుఖమే ఉండదు.

అందువల్ల మనకు జీవితంలో రెండే మార్గాలు ఉన్నాయి. ఏమిటవి? ఆనందాన్ని ఆహ్వానించాలంటే, దాన్ని వెన్నంటే ఉండే దుఃఖాన్ని కూడా స్వీకరించటానికి సిద్ధపడివుండాలి. ప్రతి ఒక్క విజయం కూడా దుఃఖమిశ్రితత్వంగా ఉంటుంది. అందువల్ల సుఖం కావాలంటే దానితో వచ్చే దుఃఖాన్ని కూడా నవ్వుతూ స్వీకరించాలి. ఇది ఒక మార్గం.

రెండవ మార్గం ఏమిటి? దుఃఖాన్ని పారద్రోలటం. దుఃఖాన్ని పారద్రోలటం అంటే దానితో పాటు సుఖాన్ని కూడా వదులుకోవటానికి సిద్ధపడాలి. దుఃఖం వద్దనుకుంటే, ఆనందాన్ని కూడా వద్దనుకోగలగాలి. అందువల్ల మనకు ఉన్నవి రెండే మార్గాలు. అయితే కష్టసుఖాలు రెండింటినీ రెండు చేతులతో మనసారా ఆహ్వానించటం; లేదంటే నేను దుఃఖాన్ని భరించలేను అంటే కష్టసుఖాలు రెండింటినీ చేజేతులా దూరం చేసుకోవటం. లేదు నేను సుఖాన్ని స్వీకరిస్తాను, దుఃఖాన్ని పారద్రోలుతాను అంటే కుదరదు. అయితే రెండింటినీ స్వీకరించాలి, లేదా రెండింటినీ పారద్రోలాలి.

కాని సమస్య ఎక్కడంటే, ఈ రెండింటిలో ఏ నిర్ణయం తీసుకోవాలనుకున్నా కూడా, మనస్సు బాగా దిటవు పరుచుకోగలగాలి. ఎందుకంటే, మొదటిదాంట్లో రెండూ స్వీకరించినప్పుడు కష్టాన్ని పళ్ళబిగువున అనుభవించగలిగి ఉండాలి. అలాగని రెండూ తిరస్కరించాలనుకుంటే చూస్తూచూస్తూ ఐహికసుఖాలను కాలదన్నుకోవాలి. ఏం చెయ్యాలన్నా మనస్సు చాలా దృఢంగా ఉండాలి.

కాని మనిషి మనస్సు చాలా బలహీనమైనది. సమస్య ఎక్కడో బాహ్యంగా ప్రపంచంలో లేదు; సమస్య అతని బలహీనమైన మనస్సులోనే ఉంది. అందువల్ల అతను ఈ రెండు నిర్ణయాల్లో ఏ నిర్ణయాన్ని కూడా మనస్ఫూర్తిగా తీసుకోలేకపోతున్నాడు. కష్టసుఖాలను రెండింటినీ రెండుచేతులా ఆహ్వానిద్దామనే మనస్ఫూర్తిగా నిర్ణయం

తీసుకుంటాడు. కాని ఎంతసేపు? ఏదైనా కష్టం వచ్చేదాకానే. సుఖంలో మునిగి తేలుతున్నంతసేపూ ఏమీ తెలియదు; కష్టం వస్తేనే ఏ హిమాలయాలకో పారిపోవాలనుకుంటాడు. కాని అక్కడన్నా సుఖంగా ఉంటాడా? ఉండలేడు. వారం రోజులు ఉండగలిగితే అద్భుతం! ఇక్కడ సంసారంలో ఉంటే హృషీకేశ్‌కి వెళ్ళిపోతే బాగుంటుంది అనిపిస్తుంది; తీరా అక్కడికెళితే సంసారమే అద్భుతం అనిపిస్తుంది. అంటే సమస్య ఎక్కడ ఉంది? హృషీకేశ్‌లోనా, ఉన్న ఊరిలోనా? రెండింటిలోనూ లేదు, అతని మనస్సులోనే ఉంది సమస్యంతా.

అందువల్ల సంసారానికి మూలకారణం మనిషియొక్క మానసిక దౌర్బల్యం. దానివల్ల అటు అతను సుఖదుఃఖాలను రెండింటినీ చిరునవ్వుతో స్వీకరించలేకపోతున్నాడు; అలాగని రెండింటినీ వదులుకోలేకుండానూ ఉన్నాడు. గృహస్థాశ్రమంలోనూ సంతోషంగా ఉండలేకుండా ఉన్నాడు. అలాగని సన్యాసంలోనూ ఆనందం పొందలేకపోతున్నాడు. అంటే సమస్య ఆశ్రమజీవితంలో లేదు, అతని మనస్సులో ఉంది. దీనికి పరిష్కారం ప్రపంచాన్ని మార్చటం కాదు, ప్రపంచం తీరే అంత. అది సుఖదుఃఖాల మేలుకలయిక.

ఉన్న పరిస్థితిని ఉన్నట్టుగా స్వీకరించి, దానికి అలవాటు పడిపోవాలి. అలా చెయ్యటానికి మనస్సును దృఢపరుచుకోవాలి. ఉన్న ఈ రెండు మార్గాల్లో ఏదో ఒకదాన్ని స్వీకరించటానికి సిద్ధపడాలి. గృహస్థాశ్రమంలో ఉన్నా, సన్న్యాసాశ్రమంలో ఉన్నా సుఖదుఃఖాలు తప్పవు. అలాగే సమాజంతో కలిసి జీవించినా, ఒంటరిగా జీవించినా సమస్యలు తీరవు. సమస్య ఆశ్రమజీవితంలో లేదు, అతని మనస్సులో ఉంది. సంసారంనుంచి ముక్తి పొందాలంటే, మానసిక దౌర్బల్యంనుంచి ముక్తి పొందాలి.

**మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః**

మనిషి బంధంలో పడిపోయినా, మోక్షం పొందినా దానికి కారణం **మనస్సు మాత్రమే**. బలహీనమైన మనస్సు సంసారం అనే బంధంలో పడవేస్తే, దృఢమైన మనస్సు బంధంనుంచి లేపి, మోక్షాన్ని ప్రసాదిస్తుంది. ఈ భావనను పరోక్షంగా అందజేశాడు కృష్ణపరమాత్మ మొదటి రెండున్నర శ్లోకాల్లో.

**2. మోక్షసాధనాని– శ్లోకాలు: 3 రెండవ పాదం –6**

మూడవశ్లోకం రెండవపాదంనుంచి ఆరవశ్లోకం వరకూ మనస్సును ఎలా దిటవుపరచుకోవాలనే అంశాన్ని చర్చించాడు కృష్ణపరమాత్మ. దీన్ని సంసారనివృత్తి ఉపాయః అని కూడా అనవచ్చు. గృహస్థుగా ఉండి, కుటుంబసభ్యులతో బంధాన్ని అనుభవిస్తూ, వారు కలుగజేసే సమస్యలను ఎదుర్కోవటమెలా? ఎందుకంటే బంధం కూడా రెండు అంశాల మేలుకలయికగా ఉంటుంది. బంధం కూడా ఆనందాన్నీ ఇస్తుంది; దుఃఖాన్నీ ఇస్తుంది. సన్న్యాసాశ్రమంలో ఉండే బాధలు అక్కడా ఉంటాయి. ఎందులో ఉన్నా మనస్సును దృఢపరచుకోవాలంటే ఏంచెయ్యాలి? కృష్ణపరమాత్మ నాలుగు సాధనలను వివరించాడు. అవి – వైరాగ్యం, శరణాగతి, వేదాంతవిచారణ, సద్గుణాలు.

ఎ) **<u>వైరాగ్యం</u>** – వైరాగ్యం అంటే తామసిక, రాజసిక కర్మలు చెయ్యాలనే వ్యసనంనుంచి బయటపడగలగటం. తామసిక కర్మలు అంటే ఏమిటి? అధార్మిక పనులు, అనైతికకార్యక్రమాలు, చెడు కర్మలు అన్నీ తామసిక

పనుల్లోకి వస్తాయి. ఇలాంటి పనులకు బానిస అవకుండా వాటిమీద వైరాగ్యం పెంచుకోవాలి. ఇది వైరాగ్యంలో మొదటిదశ.

రెండవదశలో రాజసిక కర్మలకు కూడా బానిస కాకుండా, వాటిమీద కూడా వైరాగ్యం పెంచుకోవాలి. రాజసిక కర్మలు అంటే ఏమిటి? రాజసిక కర్మలు ధార్మిక కర్మలే కాని అవన్నీ లౌకిక విజయాలకు సంబంధించినవి. తమోగుణానికి బానిస అయితే ఆధ్యాత్మికంగా దిగజారిపోతారు; రాజసికగుణానికి బానిస అయితే ఆధ్యాత్మికంగా దిగజారరు కాని, ఆధ్యాత్మికత ఎదుగుదల కూడా ఉండదు. అందువల్ల అధార్మిక కర్మలను, ధార్మిక లౌకిక కర్మలను కూడా తగ్గించుకోవటాన్ని వైరాగ్యం అంటారు.

ఈ రెండురకాల కర్మలను పారద్రోలటం కాని, కనీసం తగ్గించుకోవటం కాని ఎలా చెయ్యాలి? కొత్త అలవాటును చేసుకోవాలి. ముల్లును ముల్లుతోనే తీయాలి అంటారు. వ్యసనాన్ని వ్యసనంతోనే పారద్రోలాలి. తామసిక, రాజసిక వ్యసనాలను తగ్గించుకోవాలనుకున్నా, పూర్తిగా పారద్రోలాలనుకున్నా సాత్త్వికకర్మలకు బానిస అవ్వాలి. గీతాబోధకు వెళ్ళటం ఒక సాత్త్వికకర్మ. అప్పుడు తక్కిన రెండూ తగ్గుతాయి.

సరే బాగానే ఉంది కాని, సాత్త్వికకర్మకు బానిస అవకుండా ఉండాలంటే ఏం చెయ్యాలి? ముందు సాత్త్వికకర్మ అలవాటు కానీయండి, అప్పుడు చూద్దాము. ఇప్పట్నుంచీ దిగులుపడటం ఎందుకు? దానికీ మార్గాలున్నాయి కాని వాటిని సమయం వచ్చినప్పుడు చూద్దాము. ప్రస్తుతానికి సాత్త్వికకర్మలు అంటే గీతాబోధకు వెళ్ళటం, గీతాధ్యయనం చెయ్యటం, శాస్త్రాన్ని నేర్చుకోవటం, సత్సంగాలకు వెళ్ళటం వంటి మంచికర్మలు చెయ్యాలి.

**సత్సంగత్వే నిస్సంగత్వమ్**

బి) **శరణాగతి** – ఇది చాలా ముఖ్యమైన ఆధ్యాత్మిక సాధన. శరణాగతి అంటే ఒక ప్రత్యేకమైన దృక్పథాన్ని పెంపొందించుకోవటం. ఏమిటా దృక్పథం?

జీవితంలో మీరు మార్చలేని పరిస్థితులు ఏవైనా ఎదురైనప్పుడు, నిస్సహాయంగా అనిపించినప్పుడు, అవి భగవంతుడు మీకోసం పంపాడని, ప్రత్యేకించి మీకోసమే ఏర్పాటుచేశాడని, అది మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు, మార్పుకు తోడ్పడుతుందని మనస్సులో గట్టిగా అనుకోవటం నేర్చుకోవాలి. చెప్పినంత తేలిక కాదు, అలా అనుకోగలగటం. అయినా అసాధ్యమూ కాదు. అందువల్లనే **నేర్చుకోవాలి** అన్నాము. కష్టపడి అలవాటు చేసుకోవాలి. అందువల్లనే దీన్ని సాధన అన్నారు.

మొట్టమొదటి స్పందన – భగవంతునిమీద కోపం వస్తుంది. మీరు మార్చలేని పరిస్థితి వస్తే, ముఖ్యంగా మీకు ప్రతికూలమైన పరిస్థితి వస్తే, 'నాకే ఎందుకు వచ్చింది?' అని కోపం వస్తుంది. మార్చలేని పరిస్థితులను ఎలా మార్చాలి? ప్రశ్నే అర్థంలేని ప్రశ్న. మార్చలేని పరిస్థితులు అంటేనే వాటిని మార్చలేమని అర్థం. అలా మార్చలేని పరిస్థితులను మార్చాలనుకోకూడదు. మరేం చెయ్యాలి? మీ మనస్సును మార్చటానికి ప్రయత్నించాలి.

'మీకు జరిగే విషయాలను మీరు అదుపులో పెట్టలేరు. కాని మీకు జరిగే విషయాలమీద మీ దృక్పథాన్ని మీరు అదుపులో పెట్టగలరు. అలాచేస్తే, మార్పు మీకు యజమాని అయ్యేబదులు, మీరు మార్పుమీద యజమాని అవుతారు.' (బ్రయాన్ ట్రేసీ)

జీవితంలో మార్చగలిగిన వాటిని మార్చటానికి ప్రయత్నించాలి
జీవితంలో మార్చలేని వాటిని నవ్వుతూ స్వీకరించాలి
ఏవి మార్చగలిగినవో, ఏవి మార్చలేనివో తెలుసుకోవటమే మేధస్సు అంటే.

అందువల్ల మార్చలేని వాటి గురించి బాధపడేబదులు మీ చేతుల్లో ఉన్న పనిని చెయ్యాలి. అంటే మీ మనస్సును మార్చాలి. మనస్సును సంసిద్ధం చెయ్యాలి. ఏమని? 'నాకీ పరిస్థితి అవసరం. ఇది నాకోసం భగవంతుడు ప్రత్యేకించి ఏర్పాటుచేశాడు. ఇది నేను మారటానికి తోడ్పడుతుంది,' అనుకోవాలి. అలా అనుకోవటం అంత తేలికకాదు కాని, అటువంటి దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. దీన్ని శరణాగతి అంటారు.

అంతేకాదు, శరణాగతి అంటే ఆధ్యాత్మిక ఎదుగుదలకు భగవంతుని కృపను కోరటం కూడా వస్తుంది. మీరు మార్చలేని పరిస్థితులను ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడే నిచ్చెనమెట్లుగా భావించటానికి తగ్గ మనోధైర్యాన్ని ఇవ్వమని ప్రార్థన చెయ్యాలి. ఇది శరణాగతి.

సి) **వేదాంతవిచారణ** – వేదాంత శాస్త్రాన్ని సమర్థవంతమైన గురువుద్వారా కొన్ని సంవత్సరాలపాటు అధ్యయనం చెయ్యాలి. అంటే వేదాంత శాస్త్రాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా నేర్చుకోవాలి.

డి) **సద్గుణాలు** – వేదాంతం నేర్చుకోవటానికి అనువైన విలువలను పెంపొందించుకోవాలి. అలాంటి కొన్ని విలువలను కృష్ణపరమాత్మ పదమూడవ అధ్యాయంలో చెప్పాడు. అవి అమానిత్వం, అదంభిత్వం మొదలైనవి. ఇప్పుడు వాటిని మళ్ళీ గుర్తుచేస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఇందులో చెప్పిన విలువలు – నిర్మానమోహాః, జితసంగదోషాః, వినివృత్తకామాః, ద్వంద్వైర్విముక్తాః, సుఖదుఃఖసంజ్ఞైః, అధ్యాత్మనిత్యాః. నిర్మానమోహాః అనే విషయంలో రెండు విలువలు ఉన్నాయి. దాన్ని నిర్మానమ్, నిర్మోహాః అని విడదీయాలి. ఈ విలువల అర్థాలు చూస్తే వరుసగా దురభిమానం లేకపోవటం, వివేకం చూపించటం, భగవంతునిమీద ఆధారపడటం, కొత్త బంధాలను పెంచుకోకపోవటం, ద్వంద్వాలకు అతీతంగా ఎదగటం, సుఖదుఃఖాలను సమానంగా తీసుకోవటం, ఆధ్యాత్మిక గ్రంథాలను పఠించటం చెయ్యాలి. నిర్మానమ్ అంటే పదమూడవ అధ్యాయంలో చూసిన అమానిత్వమే.

ఈ నాలుగు సాధనలనూ పాటిస్తే, అన్నీ కలిసి మనస్సు బలపడటానికి తోడ్పడతాయి. అటువంటి దృఢమైన మనస్సు మోక్షం పొందటానికి తోడ్పడుతుంది. మోక్షం అంటే మానసిక దౌర్బల్యంనుంచి విడివడటం.

**విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః** – 1.47

అంత గొప్ప యోధుడు అయిన అర్జునుడు కూడా క్లిష్టపరిస్థితిలో మోహంలో పడిపోయాడు. అందువల్ల ఈ నాలుగు సాధనలూ చెయ్యాలి. ఇవి చేస్తే కలిగే ఫలమేమిటో కూడా కృష్ణపరమాత్మే వివరించాడు. బ్రహ్మప్రాప్తి కలుగుతుంది అన్నాడు. బ్రహ్మ దగ్గరకు తీసుకువెళుతుంది అంటే అక్షరాలా ప్రయాణం చేసి, వెళ్ళటం కాదని అనేకసార్లు చూశాము. బ్రహ్మప్రాప్తి అంటే బ్రహ్మ ఎక్కడో దూరంగా ఉన్నాడనే అపోహ తొలగటం. మోక్షం అంటే ఆ సర్వవ్యాపకమైన బ్రహ్మ నేనే అని తెలుసుకోవటం.

తరువాత కృష్ణపరమాత్మ బ్రహ్మ లక్షణం అద్భుతంగా ఇచ్చాడు.

**న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః ।**

**యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥** – 15.6

ఇది చాలా ముఖ్యమైన నిర్వచనం. కఠోపనిషత్తులోనూ, ముండకోపనిషత్తులోనూ వచ్చిన మంత్రాన్ని ఆధారంగా చేసుకుని వచ్చిన నిర్వచనం అని చూశాము. ఆ మంత్రం –

**న తత్ర సూర్యో భాతి, న చంద్రతారకమ్**

దాని అర్థాన్నే కృష్ణపరమాత్మ ఇక్కడ నిర్వచిస్తున్నాడు. బ్రహ్మ శుద్ధచైతన్యం, నిర్గుణం, సర్వవ్యాపకం. బ్రహ్మను సూర్యుడు, చంద్రుడు, తారకలు, అగ్ని, విద్యుత్తు ప్రకాశింపజేయలేవు; నిజానికి బ్రహ్మవల్లనే ఇవన్నీ ప్రకాశిస్తున్నాయి. బ్రహ్మను ఆబ్జెక్టుగా చూడలేము; సాక్షిచైతన్యమైన నేనే బ్రహ్మను. బ్రహ్మ సత్యం, జ్ఞానం, అనంతం. ఇది మోక్షసాధన అంశం.

**3. బ్రహ్మణః సర్వాత్మకత్వమ్ – శ్లోకాలు: 7–15**

ఈ భాగంలో కృష్ణపరమాత్మ బ్రహ్మే అంతటా సర్వవ్యాపకంగా ఉన్నాడని నిరూపించాడు. బ్రహ్మకు భిన్నంగా జగత్తు లేదు. ఉన్నదొక్కటే బ్రహ్మ. పదార్థం అంటూ విడిగా లేదు.

**బ్రహ్మ + నామరూపాలు = జగత్తు**

**భూత భౌతిక ప్రపంచః సర్వః అపి బ్రహ్మైవ. బ్రహ్మణా వ్యతిరిక్తం కించిదపి వస్తు అణుమాత్రమపి వస్తు నైవ ఆసీత్, నైవ అస్తి, నైవ భవిష్యతి**

ఈ భూతభౌతిక ప్రపంచం మొత్తం బ్రహ్మే. బ్రహ్మకు భిన్నంగా, అణువంత వస్తువు కూడా, ఇంతకుముందు లేదు, ఇప్పుడులేదు, ఇకముందు కూడా ఉండబోదు. ఆభరణం అనే వస్తువు ఉంది అనుకోవటం భ్రమ; ఆభరణం అనే వస్తువు లేదు, ఉన్నదొకటే బంగారం. మనం అనవసరంగా ఆభరణానికి ప్రాముఖ్యతను ఇస్తున్నాము. అదే విధంగా కుర్చీలేదు; ఉన్నది చెక్క మాత్రమే. కుండ విడిగా లేదు; ఉన్నది మట్టి మాత్రమే. మట్టిబుర్రలమైన మనం మట్టిని వదిలేసి, కుండను మాత్రమే చూస్తున్నాము. ఈ సూత్రాన్ని అనుసరించి, జగత్తు విడిగా లేదు, ఉన్నదొకటే చైతన్యం అంటున్నది శాస్త్రం. నిర్గుణబ్రహ్మ సగుణాత్మక జగత్తుగా ప్రకటితమవుతున్నది. కంటికి కనబడని బ్రహ్మ కనబడే జగత్తుగా భాసిల్లుతున్నది.

**బ్రహ్మైవ జగద్రూపేణ వర్తతే**

ఈ జగత్తు మొత్తం బ్రహ్మయొక్క నామరూపాలు మాత్రమే. కాని ఈ నామరూపాలు కూడా రెండురకాలుగా ప్రకటితమవుతున్నాయి. బ్రహ్మ నిర్వచనం సత్ చిత్ ఆనందం బ్రహ్మ. సత్ అంటే ఉనికి, చిత్ అంటే చైతన్యం, ఆనందం అంటే అనంతం లేదా పరిపూర్ణత్వం. కొన్నింటిలో బ్రహ్మ సద్రూపంగా మాత్రమే ఉంటుంది. అంటే అందులో చిద్రూపం తెలియదు. కాబట్టి సద్రూపం మాత్రమే తెలిసేదాన్ని **జడం** అంటారు. అది జగత్తు.

కాని జీవిని తీసుకుంటే జీవిలో సద్రూపం, చిద్రూపం రెండూ తెలుస్తాయి. మనిషి ఉనికీ తెలుస్తుంది, అతనిలో ఉన్న చైతన్యమూ తెలుస్తుంది. ఎందుకంటే చైతన్యం తెలియాలంటే ఆ చిత్‌ను ప్రతిబింబింపజేసే మాధ్యమం ఉండాలి. జీవిలో ఆ మాధ్యమం ఉంది. అది మనస్సు. అందువల్లనే మనస్సును ప్రతిబింబమాధ్యమం అనీ; మనస్సు ప్రతిబింబించిన చైతన్యాన్ని ప్రతిబింబచైతన్యం లేదా చిదాభాస అనీ అంటారు. కాని జడవస్తువులైన కుర్చీ, బల్లవంటి వస్తువుల్లో చైతన్యం ఉన్నా వాటికి మనస్సు లేదు కాబట్టి వాటిలో చైతన్యం ఉన్నట్టు తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేదు అనకూడదు.

దీనికి ఒక ఉదాహరణ చూద్దాము. రెండు బర్నర్లు ఉన్న స్టౌమీద, ఒక బర్నరుమీద ఒక ఇనుపచువ్వను, ఇంకొక బర్నరుమీద ఒక గిన్నెలో నీరును పెట్టారనుకోండి. ఏమవుతుంది? రెండూ వేడెక్కుతాయి. అగ్నికి రెండు లక్షణాలు ఉన్నాయి. అవి ఉష్ణత్వం, ప్రకాశకత్వం. అంటే వేడి, కాంతి. ఇప్పుడు మీరు వేడిచేసిన వస్తువులను చూద్దాము. ఇనుపకడ్డీ ఎర్రగా కాలుతుంది. ముట్టుకుంటే చెయ్యి కాలుతుంది కూడా. అంటే దానిలో అగ్నియొక్క కాంతీ తెలుస్తోంది, వేడీ తెలుస్తోంది. అదే నీటి విషయానికి వచ్చేసరికి నీరు ఎర్రగా మారదు. నీటిలో వేడి మాత్రమే తెలుస్తుంది. నీరు కాంతిని ప్రతిబింబింపజేయలేకపోయింది.

రెండూ పదార్థాలే కాని ఒకదానికి ఒక లక్షణమే అరువు తీసుకోగలిగిన సామర్థ్యం ఉంటే, ఇంకొకదానికి రెండు లక్షణాలను తీసుకోగలిగే సామర్థ్యం ఉంది. ఇదే సూత్రం జీవ, జగత్తులకు వర్తిస్తుంది. జగత్తుకు సత్ అంశాన్ని మాత్రమే తీసుకోగలిగే శక్తి ఉంది. అందువల్ల జగత్తును జడం అంటాము. జీవునికి సత్, చిత్ రెండు అంశాలనూ ప్రకటించగలిగే శక్తి ఉంది. అందువల్ల బ్రహ్మ జడమైన జగత్తులోనూ ఉన్నాడు, ప్రాణమున్న జీవునిలోనూ ఉన్నాడు.

**బ్రహ్మైవ జీవరూపేణ జగద్రూపేణ వర్తతే**

బ్రహ్మే సద్రూపంగా, చిద్రూపంగా అంతటా ఉన్నాడు.

బ్రహ్మే అంతటా సర్వాత్మకంగా ఉన్నాడని చెప్పటం ద్వారా, ఈ అంశాన్ని ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఎలాగైతే ఆభరణమంతటా బంగారం సర్వవ్యాపకంగా ఉందో, అలా బ్రహ్మ జీవ, జగత్తులంతటా ఉన్నాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకోలేని వ్యక్తిని విమూఢా అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆభరణాలని చూస్తూ బంగారాన్ని తెలుసుకోలేకపోయినట్టే, ఫ్యానును చూస్తూ విద్యుచ్ఛక్తిని తెలుసుకోలేకపోయినట్టే, ఇటువంటి విమూఢులు జగత్తును చూస్తున్నా, మనుష్యులను చూస్తున్నా అంతటా ఉన్న చైతన్యాన్ని తెలుసుకోలేకపోతున్నారు.

**ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।**

**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥** – 15.10

మీరు మాట్లాడగలుగుతున్నా, మీ మాటను ఒకరు వినగలుగుతున్నా, ఈ రెండూ చైతన్యంవల్లనే జరుగుతున్నాయి. ఈ చైతన్యమే లేకపోతే, మీరు మాట్లాడనూలేరు, వారు విననూలేరు. అటువంటి సర్వాత్మకమైన బ్రహ్మను అర్థం చేసుకోలేకపోతే అది అతని సమస్య.

**పశ్యంతి జ్ఞానచక్షుషః** – తెలివైన వ్యక్తి బ్రహ్మే అంతటా ఉన్నాడని తన జ్ఞాననేత్రంద్వారా తెలుసుకుంటాడు.

**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

మూడవ అంశం **బ్రహ్మే చేతన అచేతన ప్రపంచం** లేదా **బ్రహ్మణః సర్వాత్మకత్వమ్.**

**4. బ్రహ్మణః పురుషోత్తమత్వమ్ – శ్లోకాలు: 16–18**

బ్రహ్మను పురుషోత్తమునిగా ఈ మూడుశ్లోకాల్లో వర్ణించాడు కృష్ణపరమాత్మ. ఈ భావనను అందజేయటానికి కృష్ణపరమాత్మ మొత్తం జగత్తును మూడు భాగాలుగా విభజించాడు. అవి

ఎ) **క్షరపురుషుడు** – కనిపించే జగత్తు; ప్రత్యక్ష ప్రమాణానికి అందే జగత్తు. దీన్ని పదార్థం అనవచ్చు.

బి) **అక్షరపురుషుడు** – అవ్యక్తంగా ఉన్న జగత్తు. అంటే శక్తి అనవచ్చు.

సి) **ఉత్తమపురుషుడు** – ఈ పదార్థానికీ, శక్తికీ భిన్నంగా సర్వవ్యాపకంగా చైతన్యతత్త్వం ఉంది. దాన్నే బింబచైతన్యం అనీ, నిర్గుణబ్రహ్మ అనీ అంటారు. ఈ నిర్గుణచైతన్యం పదార్థంలో భాగం కాదు, పదార్థం లక్షణాలు లేవు, పదార్థంనుంచి ఉత్పత్తి చెందలేదు. దీన్ని ఉత్తమపురుషుడు అన్నాడు కృష్ణపరమాత్మ ఇక్కడ. ఉత్తమం అంటే అన్నిటికన్నా శ్రేష్ఠతమం. ఎందుకంటే పదార్థానికి కాని, శక్తికి కాని విడిగా ఉనికి లేదు; కాని చైతన్యానికి ఇవి లేకపోయినా విడిగా ఉనికి ఉంది.

క్షర, అక్షరపురుషులు తక్కువస్థాయికి చెందినవి. ప్రతిబింబచైతన్యం కూడా వీటిల్లోకే వస్తుంది. బింబచైతన్యమే ఉత్తమపురుషుడు. ఉత్తమపురుషుడు పదాన్ని తిరగేస్తే అదే పురుషోత్తముడు అవుతుంది.

ఆ పురుషోత్తముణ్ణి నేనే అన్నాడు కృష్ణపరమాత్మ. అదే నా స్వరూపం అన్నాడు. రెండు స్వరూపాలను ఏడవ అధ్యాయంలో ప్రవేశపెట్టి అందులో నేను పరాప్రకృతిని అన్నాడు కృష్ణపరమాత్మ. ఆ పరాప్రకృతికి ఇంకొక పేరే పురుషోత్తముడు. ఈ నిరాకారబ్రహ్మ ఎక్కడా లేదు అనకూడదు. ఈ బ్రహ్మ సర్వవ్యాపకం. నిరాకారబ్రహ్మను వెంటనే అందరు అర్థం చేసుకోలేరు కాబట్టి శాస్త్రం తాత్కాలికంగా ఏకరూప ఈశ్వరుణ్ణి పరిచయం చేసింది. కాని అక్కడే ఆగిపోకూడదు. ఏకరూప ఈశ్వరుని కొలిచే స్థాయినుంచి ఆరూప ఈశ్వరజ్ఞానం పొందే స్థాయికి రావాలి.

**నిర్విశేషం పరంబ్రహ్మ, సాక్షాత్కర్తృమనీశ్వరాః**
**యే మందాస్తే ఽనుకంప్యంతే సవిశేషనిరూపణైః**

మందాః అంటున్నది శాస్త్రము. అందరూ నిర్గుణబ్రహ్మ గురించి అంత త్వరగా అర్థం చేసుకోలేరు. అలాంటి వారికి రామరూపమో, కృష్ణరూపమో పరిచయం చేస్తుంది. మీ ఇష్టదేవతగా మీరు కోరిన భగవంతునికి ప్రార్థన చెయ్యవచ్చు; కాని అది భక్తిలో మొదటిదశ అని చూశాము. ఏకరూప ఈశ్వరునినుంచి అనేకరూప ఈశ్వరుని స్థాయికి వచ్చి, అనేకరూప ఈశ్వరుని స్థాయినుంచి అరూప ఈశ్వరుని స్థాయికి రావాలి. నేను విష్ణుభక్తుణ్ణి అని భావించి శివభక్తునితో పోట్లాడటంలో అర్థం లేదు. అలా పోట్లాడితే శాస్త్రము సరిగ్గా అర్థం కాలేదని అర్థం. అందువల్లనే ఎవరో అద్భుతంగా వర్ణించారు, 'మనకు మతకలహాలు చేసుకునేంతటి మేరకు మతం అర్థమయింది కాని అన్ని మతాలతో సామరస్యంగా జీవించేటంత మేరకు మతం అర్థం కాలేదు.'

ఎందుకు? ఉన్నదొకటే భగవంతుడు. ఆయన నిర్గుణబ్రహ్మ. అనేక దేవుళ్ళు ఒకటే దేవునియొక్క సాకార రూపాలు. ఆ ఒకటే దేవుని పేరు ఇక్కడ పురుషోత్తముడు. ఆ పురుషోత్తముణ్ణి నేనే అన్నాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మ నేను అన్నప్పుడు ఏ నేను గురించి చెబుతున్నాడో అర్థం చేసుకోవాలని చూశాము. కృష్ణపరమాత్మ నేను పురుషోత్తముణ్ణి అంటే సాకారంగా కాదు, నిర్గుణచైతన్యంగా చెప్పాడు.

**5. బ్రహ్మజ్ఞానమ్, ఫలమ్ – శ్లోకాలు: 19, 20**

ఈ చివరి రెండు శ్లోకాల్లో బ్రహ్మజ్ఞానం గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. గృహస్థాశ్రమంలో ఉన్నా, సన్న్యాసాశ్రమం స్వీకరించినా మనస్సును స్థిరపరచుకోవాలి. ఈ బ్రహ్మజ్ఞానం పొందటమే అందరూ పొందాల్సిన అంతిమలక్ష్యం. ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలం ఏమిటి?

**కృతకృత్యశ్చ భారత** – పరిపూర్ణత్వాన్ని పొందుతావు అర్జునా అన్నాడు. జీవితం సార్థకమవాలంటే ఈ జ్ఞానాన్ని పొందాలి. ఆ విధంగా జ్ఞానం, జ్ఞానఫలం గురించి చెప్పి ఈ అధ్యాయాన్ని ముగించాడు కృష్ణపరమాత్మ.

పురుషోత్తముని గురించి వివరించాడు కాబట్టి ఈ అధ్యాయానికి పురుషోత్తమయోగము అనే పేరు వచ్చింది.

## స్వామీజీ ఆణిముత్యాలు

మరణం సంభవించినపుడు చైతన్యాన్ని ప్రతిబింబింపజేసే మనస్సు వెళ్ళిపోతుంది కాబట్టి, బింబచైతన్యం ఉన్నట్టు తెలియదు. బింబచైతన్యం, శరీరానికి ఎందుకు ప్రత్యక్షంగా చైతన్యం ఇవ్వదు? శరీరానికి ప్రత్యక్షంగా చైతన్యాన్ని ఇస్తే, శరీరానికి మరణం ఉండదు. మరణం లేకపోతే నష్టమేమిటంటే, పెరిగే జనాభాకి చోటు ఉండదు. మనస్సు వెళ్ళిపోగానే, శరీరానికి చైతన్యం ఉండదు; బింబచైతన్యం ఉన్నట్టు తెలియదు.

దీన్నిబట్టి చైతన్యం మనస్సును చైతన్యవంతం చేస్తుందనీ, మనస్సు శరీరాన్ని చైతన్యవంతం చేస్తుందనీ అర్థమవుతున్నది. అందువల్ల జీవించి ఉన్నవారిని చూస్తే, వారి వెనక మనస్సు ఉందని తెలుసుకోవాలి. వారి మనస్సు మనకు కనబడదు, అర్థంకాదు కాని, శరీరం చేసే ప్రతి పని వెనక మనస్సు ఉందని తెలుస్తుంది. మనస్సు ఉందని తెలిస్తే, బింబచైతన్యం ఉన్నట్టు అర్థం. ఎందుకంటే బింబచైతన్యం లేకుండా మనస్సు చైతన్యవంతం అవలేదు. ఆ విధంగా శరీరం మనస్సు ఉందని తెలుసుకోవటానికి తోడ్పడితే, మనస్సు బింబచైతన్యం ఉందని తెలుసుకోవటానికి తోడ్పడుతుంది. ఆ బింబచైతన్యమే బ్రహ్మ.